


ఆంధ్రప్రదేశ్
1971



ఆంధ్రప్రదేశ్

ఫిబ్రవరి, 1971

మాఘం – ఫాల్గుణం 1892 శా. శ

సంపుటి: 15 సంచిక: 4

ప్రధాన సంపాదకులు : పెండ్యాల వామనరావు

సంచికలో

★

ముఖచిత్రం : విశాఖ ఉక్కు కర్మాగారానికి జనవరి 20వ తేదీన ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ప్రారంభోత్సవం చేశారు.

రెండవఅట్ట : మన ప్రధానమంత్రికి ఆనందోత్సాహాలతో అసంఖ్యాక ప్రజానీకం స్వాగతం యిచ్చారు.

మూడవఅట్ట : ప్రధానమంత్రి సందేశం వింటోన్న లక్షలాది ప్రజాసందోహం.

చివరిఅట్ట : తెలుగు ప్రజల దృఢదీక్షా సంకల్పాలకు చిహ్నం.

★

వెల : 50 పైసలు

సాలు చందా: 6 రూపాయలు

రిజిస్టర్డ్ నెం. 133

పేజీ


ప్రదర్శనల ప్రాముఖ్యం

మామూలులాగా, ఈ యేడు కూడా, రాష్ట్ర రాజధానిలో, అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభోత్సవంతో నూతన సంవత్సరం ప్రారంభమైంది. ఈ ప్రదర్శన హైదరాబాదు నగర సాంఘిక సాంస్కృతిక, ఆర్థిక జీవనంలో అంతర్భాగంగా అభివృద్ధి చెందింది. ఏటేటా నలభై రోజులపాటు లక్షలాదిమంది ప్రజలు బహుళార్థ సాధకమైన యీ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనం తిలకిస్తుంటారు. బహుశః దేశమంతటిలో యిదే పెద్ద ప్రదర్శనం కూడా కావచ్చు. మొదట్లో కేవలం వంద ప్రదర్శనశాలలతో పబ్లిక్ గార్డెన్స్‌లో ఒక చిన్న ప్రదేశంలో ప్రారంభమైన యీ కృషి యీ నాటికి 1500 ప్రదర్శనశాలలతో 32 ఎకరాల విస్తీర్ణంగల విశాలమైన ఆవరణలో రు. 5 కోట్ల విలువకు మించిన విక్రయాలతో బ్రహ్మాండమైన అఖిల భారత ప్రదర్శనగా పరిణామం చెందింది. కనుకనే దీనిని ఒక గొప్ప సాహసోపేతమైన కార్యక్రమంగా పేర్కొనవచ్చు. ఎన్నెన్నో మార్పులను చవిచూసిన గత మూడు దశాబ్దాలలో, కాలపురుషుని అగ్ని పరీక్షలకు తట్టుకుని నిలవడమేకాకుండా, ఒక బ్రహ్మాండమైన సంస్థగా యిది అభివృద్ధి చెందింది. ఒక అనధికార సంస్థ యింతగా అభివృద్ధి చెందడం మాటలతో అయ్యే పనికాదు. కొంతమంది కార్యకర్తల నిస్వార్థ సేవానిరతి, శ్రద్ధాసక్తుల ఫలితంగానే యిది సాధ్యమయింది. వారిలో అగ్రేసరుడు శ్రీ శంకర్ జీ. శంకర్‌జీ, అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన అనేవి రెండూ దాదాపుగా పర్యాయపదాలు అయిపోయాయి. ప్రదర్శన స్థాపకులలో ఒకరై ఆయన ఆనాటినుండి నేటివరకు దాని అభ్యుదయంకోసం నిరంతరం కృషిచేస్తున్నారు. శ్రీ శంకర్‌జీయే యీ సంస్థ ప్రథమ కార్యదర్శి. భారత ఉపరాష్ట్రపతి యీ యేడు ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేసిన సందర్భంలో మన ఉపముఖ్యమంత్రి పేర్కొన్నట్లు, యీ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన వ్యవస్థకు శ్రీ శంకర్‌జీయే జీవశక్తి అని చెప్పవచ్చు. నిరాడంబరత మూర్తీభవించినట్లుండి కూడా చైతన్యవంతంగా పనిచేస్తూ తోటి కార్యకర్తలలో ఉత్సాహశక్తిని ప్రదీపింప జేయగలగడం సామాన్య విషయం కాదు.

ఈ ప్రదర్శన ప్రారంభమైనప్పుడు, 1938 లో, అప్పటి హైదరాబాదు రాష్ట్ర ప్రధాన మంత్రి సర్ అక్బర్ హైదరీ దీనికి ప్రారంభోత్సవం చేశారు. నిజాం ప్రభువే నాలుగుసార్లు దీనికి ప్రారంభోత్సవాలు చేశారు. ఇంకా అప్పటి గవర్నరు జనరల్ శ్రీ సి. రాజగోపాలాచారి, శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి ప్రభృతులుకూడా ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేసినవారిలో వున్నారు. లార్డ్ వేవెల్, డాక్టర్ రాల్ఫ్‌బంచ్ ప్రభృతులు, అనేకమంది ప్రథమశ్రేణి జాతీయ నాయకులు కూడా యీ ప్రదర్శనాన్ని సందర్శించారు.

ఈ ప్రదర్శనను గురించి ఒక అపూర్వమైన విశేషం ఏమంటే, దీనివల్ల వచ్చే లాభాల ద్వారా నాలుగు విద్యా సంస్థలు నిర్వహించబడుతున్నవి. హైదరాబాదులోని కమలానెహ్రూ బాలికల పాలిటెక్నిక్, వనితా మహా విద్యాలయం, సికిందరాబాదులోని సర్దార్ పటేల్ ఆర్ట్స్, సైన్సు కళాశాల, వరంగల్లులోని లాల్‌బహదూర్‌శాస్త్రి ఆర్ట్స్, సైన్సు కళాశాల — యీ నాలుగు సంస్థలను ఎగ్జిబిషను సంస్థ నిర్వహిస్తున్నది. అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనపట్ల ప్రజలు ఆదరాభిమానాలు చూపడం సహేతుకమనే విషయాన్ని యిది ఋజువు చేస్తున్నది. అంతే కాకుండా యీ విద్యా సంస్థల అవసరాలను ఆదుకోడానికై, దీనిని యింకా విస్తృత పరిధిలో నిర్వహించి ఎక్కువ ఆదాయం పొందడం అవసరం అనే విషయంకూడా స్పష్టమవుతున్నది. ఏటేటా జరిగే యీ పారిశ్రామిక ప్రదర్శన రాష్ట్రంలో జరుగుతున్న పారిశ్రామిక ప్రగతికి సూచికగా వుంటుంది. స్థూలంగా యితర రంగాలలో జరిగిన ప్రగతికూడా యిందులో ప్రతిబింబితమవుతుంది. ప్రదర్శనల ప్రాముఖ్యాన్ని గురించి, ముఖ్యంగా క్రమపద్ధతిలో భారీయెత్తున జరిగే వాటి ప్రాధాన్యాన్ని గురించి విశేషంగా చెప్పవలసిన అవసరంలేదు. సంస్కృతి, సంగీతం, చిత్రలేఖనం వంటి విషయాలలో అంత ఎక్కువగా ప్రజలకు వినోద కార్యక్రమాలు లభించని హైదరాబాదు నగరంలో యీ ప్రదర్శన విద్యా - వినోద విషయిక కార్యక్రమంగా భాసించి ప్రజాదరణ పొందుతున్నది. ఎగ్జిబిషన్ సంస్థ వాగా అభివృద్ధిచెంది జిల్లాలకు కూడా తన కార్యక్రమాన్ని విస్తరింపచేయడం ముదావహం.

—పి. వి. ఆర్



పేదవారికి పెన్నిధి: రెడ్‌క్రాస్

కాసు బ్రహ్మానందరెడ్డి

బీదప్రజలకూ, కష్టాల్లోవున్నవారికీ ఆపదలో ఆదుకోవడంకన్న మించిన సత్కార్యం మరొకటిలేదు. హంగులూ ఆర్భాటాలూ లేకుండా నిరంతరం సాంఘిక సేవ చేస్తున్న సేవాసంస్థలు మన దేశంలో చాలా వున్నాయి. అటువంటి సేవాసంస్థల్లో రెడ్‌క్రాస్ సంస్థ ఒకటి. ఈ సంస్థను గురించి మనందరికీ తెలుసు. భారత రెడ్‌క్రాస్‌సంస్థ గత ఏడాది స్వర్ణోత్సవాలు జరుపుకున్నది. ఈ స్వర్ణోత్సవాలకు భారత రాష్ట్రపతి నవంబరు 6వ తేదీన కొత్త ఢిల్లీలో ప్రారంభోత్సవం చేశారు. ఈ సంస్థకువున్న ప్రాముఖ్యం దృష్ట్యా యిది ఎంతో సంతోషంగా వున్నది.

సుమారు వంద సంవత్సరాలక్రితం హెన్రీ డునాంట్ అనే మహనీయుడు రెడ్‌క్రాస్ సంస్థను ప్రారంభించడం అందరికీ తెలిసిన విషయమే. గాయపడినవారికీ, రోగగ్రస్తులకూ తగిన సేవ చేసేవారు లేకపోవడం, లోకంలో జరుగుతున్న రక్తపాతంచూసి హృదయం ద్రవించి, చలించిపోయి ఆయన యీ సంస్థను స్థాపించాడు. మొదట్లో, యుద్ధంలో గాయపడినవారికి సేవచేసే ఉద్దేశంతో మాత్రమే రెడ్‌క్రాస్ ప్రారంభించబడినప్పటికీ తర్వాత తర్వాత క్రమంగా మానవత్వానికి సంబంధించిన అన్ని సేవా కార్యక్రమాలనూ యీ సంస్థ చేపట్టింది. వరదలవల్లగాని, కరువు కాటకాల వల్లగాని, భూకంపాల వల్లగాని, దేనివల్లనైనప్పటికీ ప్రజలకు సంభవించే విపత్తులలో వారిని ఆదుకోవడానికి రెడ్‌క్రాస్‌సంస్థ ఎంతో తోడ్పడుతున్నది. చైనా దురాక్రమణ సమయంలో మన జవానులకు సేవా సౌకర్యాలను కలుగజేయడంలో రెడ్‌క్రాస్ సంస్థ ప్రధానపాత్ర వహించింది. యుద్ధరంగంలో గాయపడిన, జబ్బుపడిన సైనికులను అక్కడినుండి తరలించి, మన ప్రాంతాలకు చేర్చే విషయంలోనూ, మన ఖైదీలను బదిలీ చేసుకునే విషయంలోనూ రెడ్‌క్రాస్ సంస్థ విశేషంగా కృషి చేసింది.

దయాగుణమూ, సేవాభావములతో కూడిన రెడ్‌క్రాస్‌సంస్థ ఆశయాలు నూటికి నూరుపాళ్లు భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా వున్నాయి. స్పర్ధలతోనూ, వైమనస్యంతోనూ నిండిన నేటి ప్రపంచంలో రెడ్‌క్రాస్ సంస్థ ప్రజలను పరస్పరం సన్నిహితం చేస్తుంది. మానవజాతి ఏకతా భావాన్ని ఋజువుచేస్తుంది. రెడ్‌క్రాస్‌సంస్థ చేస్తున్న యీ అపూర్వ సేవాకృషికి గుర్తింపుగా నోబుల్ శాంతి బహుమతి సంఘంవారు ఆ సంఘం శతజయంతి సంవత్సరమైన 1963లో రెడ్‌క్రాస్ సంస్థకు శాంతి బహుమతిని అందజేశారు.

బాధితులపట్ల సానుభూతి, కనికరం, దయ, జాలిమొదలైన మానవత్వ గుణాలను ప్రదర్శించడం మనం అలవరచుకోవాలి. మన చరిత్రలో యిటువంటి సంఘటనలు కొల్లలుగా వున్నాయి. మహాభారతంలో చూడండి. అశ్వత్థామ ఉపపాండవుల ఐదుగుర్ని హతమార్చినప్పుడు, ఆ హంతకుడి శిరస్సును ఖండించి తెస్తానని అర్జునుడు శపథం చేశాడు. అప్పుడు ద్రౌపది ఏమన్నది? "వద్దు. ఆ పని మాత్రం చేయవద్దు. నేను పుత్రశోకంతో రాత్రింబగళ్లు ఏడుస్తున్నట్లుగా అశ్వత్థామ తల్లిని కూడా పుత్రశోకానికి గురిచేయడం ఎందుకు? అశ్వత్థామను మీరేమి చేయవద్దు" అని సలహా చెప్పింది. ప్రపంచం నిజంగా నాగరికమైనదనిపించుకోవాలంటే ఆ విధమైన మానవతాగుణం, దయాగుణం పెంపొందించుకోవాలి. అప్పుడే అది నాగరిక ప్రపంచమౌతుంది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంస్థకు దేశాల ఎల్లలూ, జాతి హద్దులూ ఏవీ లేవు.

అశోకుని ఆదర్శం

ఒకసారి మన చరిత్ర చూడండి. కళింగ యుద్ధంలో ఒకటిన్నర లక్షలమంది సైనికులు చనిపోయినప్పుడు "ఇక రక్తపాతానికి ఏమాత్రం తావుండ కూడదు. చివరకు వంటగదిలో కూడా జీవహింసకు వీలులేదు" అనే నిశ్చయానికి వచ్చాడు అశోక చక్రవర్తి. ఆ తర్వాత అయన "దుఃఖ నివృత్తే" తన ధ్యేయంగా పెట్టుకున్న బుద్ధుని మార్గాన్ని అనుసరించి జీవయాత్ర కొనసాగించాడు.

ఇంచుమించు యిదేమాదిరి అనుభవంవల్లనే రెడ్‌క్రాస్ సంస్థ ఆవిర్భవించింది. రెడ్‌క్రాస్ సంస్థను స్థాపించిన డునాంట్ ఒకసారి యుద్ధరంగంలో 4 వేలమంది సైనికుల మృతదేహాలను

చూశాడు. "మనిషికి బాధంతా ఏమిటి? ఈ దుఃఖాన్ని మనం లోకంనుండి తొలగించలేమా? క్షతగాత్రులై పడివున్న యీ దీనుల శోకాన్ని సాధ్యమైనంత వరకు మనం తగ్గించలేమా?" అనే జిజ్ఞాస ఆయనలో కలిగింది.

ప్రపంచంలోని మతాలన్నీ యితరులపట్ల దయకలిగి వుండమనే మనకు బోధిస్తున్నాయి. శాంతిని పెంపొందింప జేయడమే రెడ్‌క్రాస్ సంస్థ లక్ష్యం. దేశాలమధ్య యుద్ధాలను నిర్మూలించి పరస్పర సహకారం, పరస్పర అవగాహనలను పెంపొందింప జేయడమే లక్ష్యంగా రెడ్ క్రాస్ సంస్థ ప్రపంచస్థాయిలో పని చేస్తున్నది. గతఏడాది ఇస్తాంబుల్‌లో జరిగిన అంతర్జాతీయ రెడ్ క్రాస్ మహాసభలో యువజనులకు అంతర్జాతీయ సోదరభావాన్నీ, స్నేహవాతావరణాన్నీ అలవాటు చేయవలసిన అవసరాన్ని గూర్చి ప్రత్యేకంగా పేర్కొనబడింది.

రెడ్‌క్రాస్ అనేది ప్రపంచ వ్యాప్తమైన ఒక మహోద్యమం. మానవుల బాధలను తొలగించడం, కష్టకాలంలో ఆదుకోవడం మాత్రమే గాక వారిలో పరస్పర అవగాహన, స్నేహభావం, సహకారం, శాంతి వాతావరణం కల్పించడానికి యీ సంస్థ కృషి చేస్తున్నది.

మన రాష్ట్రంలో

మనరాష్ట్రంలో రెడ్‌క్రాస్ సంస్థ చేస్తున్నకృషి ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది. భారత రెడ్‌క్రాస్ సంస్థ శాఖ ఒకటి 1921 నుంచి హైదరాబాదులో పనిచేస్తున్నది. ప్రధానంగా ప్రసూతి, శిశు సంక్షేమం విషయాలలోనూ, ఆసుపత్రులకు కావలసిన సౌకర్యాలను సమకూర్చడంలోనూ యీ శాఖ తన కృషిని కేంద్రీకరించి పని చేస్తున్నది. విస్తృత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెడ్‌క్రాస్ సంస్థ కార్యకలాపాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించాయి.

వరదలు, కరువులు మొదలగు ప్రకృతిసిద్ధమైన వైపరీత్యాలు సంభవించినప్పుడు రెడ్‌క్రాస్ సంస్థ ముందుగా రంగంలో ప్రవేశించి సహాయ కార్యక్రమాలు జరిపించింది. 1962 లో చైనా దురాక్రమణ సమయంలోనూ, 1965 లో పాకిస్తాన్ యుద్ధంలోనూ, రెడ్‌క్రాస్ సంస్థ గాయపడిన సైనికులకు సేవచేసింది. మహిళా విభాగం వారుకూడా ఆహారం, వస్త్రాలు, తదితర వస్తువులను జవాన్లకు బహుమతి పంపి విశేషమైన సేవచేశారు. జబ్బుపడిన జవాన్లకు, గాయపడిన జవాన్లకు వస్త్రాలను కూడా పంపించారు. అత్యవసర సహాయక చర్యలకు, సిపాయీల సంక్షేమానికి యీ మహిళా విభాగం వారు 14 వేల రూపాయలు సేకరించి విరాళంగా పంపించారు. 1959లో ఒరిస్సా, బీహారు, అస్సాం రాష్ట్రాలలోని వరదబాధితుల నిమిత్తం రెడ్‌క్రాస్ సంస్థ 60,000 రూపాయలకు పైగా సేకరించి పంపించింది.

మనరాష్ట్రంలో అనేక సందర్భాలలో ప్రజల విపత్‌బాధలను తొలంగించడానికి రెడ్‌క్రాస్ సంస్థ అమోఘంగా కృషిచేసింది. ఇటీవల జిల్లాలోను, నగరంలోనూ వరదబాధితులకు సహాయం చేయడానికి రెడ్‌క్రాస్ సంస్థ చాలా కృషిచేసింది. హైదరాబాదులోని వరదబాధితుల కుటుంబాలకు ఉచితంగా సరఫరా చేయడానికై రెడ్‌క్రాస్ సంస్థ ప్రధాన కార్యాలయము వారు నాలుగు లక్షల యిరవై వేల మల్టీ విటమిన్ బిళ్ళలను విమానాల ద్వారా సరఫరా చేశారు. రు. 5000/-లు విలువచేసే వస్త్రాలను కూడా పంపిణీ చేశారు.

ప్రజల జీవనస్థాయిని పెంపొందించి అనేకమార్గాలలో దేశాన్ని పటిష్ఠవంతం చేయడమే మన ప్రణాళికల ముఖ్య ఉద్దేశం. ఉత్తమ స్థాయి సాంఘిక సంక్షేమ సాధనకు యివి ఉద్దేశింపబడినాయి. ప్రతివ్యక్తికీ జీవిత ప్రాథమిక అవసరాలను తీర్చడానికి, అంటే త్రాగడానికి మంచినీరు, తగినంత ఆహారం, దుస్తులు గృహవసతి, విద్య,ఆరోగ్యం, మొదలగుసౌకర్యాలు లభింపజేయడమే మనలక్ష్యం.

మన గ్రామసీమలను అన్నివిధాల అభివృద్ధిపరచడమే మనం అమలుపరుస్తున్న సమాజాభివృద్ధి ఉద్యమంయొక్క లక్ష్యంకూడ సాంఘిక సంక్షేమ కార్యక్రమం చాలా విశాలమైనది. మన సమాజంలోని అనేక అంశాలకు యిది వర్తిస్తుంది. మన కృషినీ, రెడ్ క్రాస్‌వంటి సంస్థలు చేస్తున్న కృషినీ సమీకరించినప్పుడు, ఈ సంస్థలు ప్రజల బాధలను తొలగించడంలో ఎంతోచక్కగాపని చేయగలుగుతాయి. మానవ సహోదరత్వం, మానవ జాతి అంతా ఒకటేననే భావమూవంటి ఉన్నత లక్ష్యాలకు రెడ్‌క్రాస్ అంకితమై పనిచేస్తున్నది. భారతీయ సాంప్రదాయంకూడా "వసుధైక కుటుంబం" అనే లక్ష్యాన్నే ప్రబోధించింది.

హ్యూమనిజం

అన్ని "యిజా" లలోకీ హ్యూమనిజం—అంటే మానవ కారుణ్యవాదం - ఉత్కృష్టమైనది. నిస్వార్ధంగా సేవచేయడమే యీలక్ష్యానికిపునాది. భారత రెడ్‌క్రాస్‌సంస్థ అర్ధ శతాబ్దంపాటు చేసిన సేవ పూర్తిగా ఫలప్రదమైంది. మన యువకులు తమశక్తి సామర్థ్యాలను అర్థంలేని యితర మార్గాలలో వినియోగించడానికి బదులుగా ప్రజా సంక్షేమానికి వాటిని సద్వినియోగం చేయటానికి వీలుగా వారిని రెడ్‌క్రాస్ ఉద్యమంలోకి ఆకర్షించాలని నా సూచన.

మన రాష్ట్రంలోని రెడ్‌క్రాస్ సంస్థ మరింత పటిష్ఠవంతంగా పనిచేస్తూ సేవానిరతిలో అగ్రగణ్యంగా నిలుస్తుందని ఆశిస్తున్నాను.

వేర్పాటు ధోరణి సుస్థిరత్వానికి గొడ్డలిపెట్టు

అక్కిరాజు వాసుదేవరావు

రాష్ట్రాలను తిరిగి పునర్వ్యవస్థీకరించే నిమిత్తం రెండవ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలనే కోర్కెను భారత ప్రభుత్వం తిరస్కరించింది. ఇది అత్యంత ప్రాధాన్యం గల నిర్ణయం. దీనివల్ల ప్రస్తుతం వున్న రాష్ట్రాలు మళ్ళీ ముక్కచెక్క లవుతాయని అప్పుడప్పుడు వినిపించే ఊహాగానాలకు తావులేకుండా పోయింది.

ఇప్పుడు వివిధ రాష్ట్రాల మధ్య ఒక విధమైన సమ్యగ్భావన నెలకొని వున్నందువల్ల మళ్ళీ కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసే సమస్య లేదనీ, మాటిమాటికీ రాష్ట్రాల సరిహద్దుల్ని మార్చడం అభిలషణీయంగా ప్రభుత్వం భావించడం లేదనీ, కేంద్ర హోంశాఖ స్టేట్ మంత్రి శ్రీ కె. సి. పంత్ యిటీవల లోకసభలో విస్పష్టంగా ప్రకటించారు. దేశంలోని యోచనాపరులందరి వూహలకు ప్రతిబింబంగా మంత్రి యీ అభిప్రాయం వెల్లడించారు. కొత్తగా ఏ రాష్ట్రాలనూ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని కూడా ఆయన స్పష్టం చేశారు. అంటే మేఘాలయ, మణిపూర్, లేదా త్రిపురలకు రాష్ట్ర ప్రతిపత్తిని యివ్వడం వల్ల కొత్తరాష్ట్రాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న దృఢమైన వైఖరి సడలినట్టు కాదని ఆయన భావం. కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసే స్థితిలో ప్రభుత్వం లేదని, వెనుకబడిన తనం రాష్ట్రాల అభివృద్ధికి దోహదం చేయాలేగాని రాష్ట్రాలను చీల్చడానికి ఎంతమాత్రం కారణం కాకూడదనే ప్రధానమంత్రి నిశ్చయాన్ని శ్రీపంత్ లోక్‌సభలో చేసిన ప్రకటన పునరుద్ఘాటించింది. అంతేకాక యీ ప్రకటన సిద్దిపేట ఎన్నికలో ప్రజాసమితి గెలవడం ఫలితంగా ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు జరుగబోతున్నదని వినిపించిన ఊహాగానాలకు యిక ఏమాత్రం తావులేకుండా చేసింది. ఈ ఎన్నికల ఫలితాలపై చెలరేగిన ఊహాగానాలు ఆలోచనలను తప్పుదారి పట్టించే అసత్య ప్రచారాలు మాత్రమే.

తరచుగా రాష్ట్రాల ఎల్లలు మారుస్తూ వుంటే దేశప్రగతి కుంటుపడుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తుమీద మిగిలిన రాష్ట్రాల వ్యవస్థ భవిష్యత్తు ఆధారపడి వున్నందువల్లనే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఒక్క ముఖ్యమంత్రికీ, యిక్కడి ప్రజలకు మాత్రమే సంబంధించినది కాదు. ఇది యావద్భారత దేశానికి సంబంధించినది. తెలంగాణాకు ప్రత్యేక రాష్ట్రం యివ్వడం అనేది విడిగా ఆలోచించే సమస్య కాదు. అనేక సమస్యలతో ముడిపడి వుంది. విదర్భ, సౌరాష్ట్ర, పాతమైసూరు, జార్‌ఖండ్ మొదలైన వాటిని కూడా విడి రాష్ట్రాలుగా ఏర్పాటు చేయవలసిన పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని యీ విషయాన్ని ఆలోచించవలసి వుంది ఒకవేళ కేంద్రప్రభుత్వం ఉన్నతస్థాయి విధానం మార్చుకొన్న కారణంగా ఆంధ్రప్రదేశ్‌ను విభజించడమే జరిగితే అది రెండుగాగాదు, ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణాలనీ మూడు రాష్ట్రాలుగా విభజింపవలసి వస్తుంది. అభివృద్ధి చెందిన ప్రాంతాలు వెనుకబడిన ప్రాంతాలను దోచుకొంటున్నాయనే వాదనను కొత్త రాష్ట్రాల ఏర్పాటుకోసం చేయడం చాలా ప్రమాదకరమైన విషయం. పశ్చిమ బెంగాలులోని శాంతిభద్రతల పరిస్థితులు తలనొప్పి కలిగిస్తూ మన కళ్ళముందు కనిపిస్తూనే ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడానికి మనశక్తినంతా సమీకరించవలసి వుండగా ఇప్పుడు మళ్ళీ కొత్త రాష్ట్రాలను ఏర్పాటుచేసి తద్వారా మరికొన్ని సమస్యలను కొనితెచ్చుకునే స్థితిలో భారత ప్రభుత్వం లేదు. ఉద్రేక వాతావరణంలో ప్రత్యేకమైన పరిస్థితుల్లో జరిగిన ఒకటో రెండో ఎన్నికల ఫలితాలను బట్టి కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసుకోవడం, దేశాన్ని పునర్విభజించడం వంటి నిర్ణయాలు చేయడానికి వీల్లేదు. అదే ప్రాతిపదిక అయితే చీటికీ మాటికీ కొత్త కొత్త రాష్ట్రాలు ఏర్పాటు అవుతూనే వుంటాయి. ఒకవేళ 1972 ఎన్నికల్లో తెలంగాణా ప్రాంతం నుంచి శాసనసభలో ప్రత్యేక తెలంగాణావాదులు అధిక మెజారిటీ సంపాదించుకున్నప్పటికీ అది రాష్ట్ర విభజనకు తగిన కారణం కారాదు. ఈ వివాదాన్ని ఒప్పుకుంటే భారతదేశం నించి తమిళనాడు వేరైపోవడానికి కూడా భారత ప్రభుత్వం అంగీకరించవలసి వుంటుంది ప్రభుత్వంతో వచ్చిన పేచీలవల్లా, వెనుకబడిన తనంవల్లా, లేదా యితరులు దోచుకుంటున్నారనే కారణం వల్లా వేరే రాష్ట్రం కావాలని కోరుకోవడం మొదలెడితే—యీ కోర్కెలకు అంతేలేదు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ వంటి సమస్యలను జాతీయ స్థాయిలో పరిష్కరించాలి.

1956లో ఆనాటి హోం మంత్రి పండిత్ గోవిందవల్లభ్ పంత్ నాయకత్వంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ద్వారా రాష్ట్రాల సరిహద్దుల విషయంలో జరిపిన అమోఘమైన సమన్వయ కృషిలో భౌగోళికంగానూ, చారిత్రకంగానూ, యితరత్రానూ ఒక సమ్యగ్వ్యవస్థ ఏర్పాటయింది. తమ తండ్రిగారైన గోవిందవల్లభ్

పంత్ సాధించిన యీ సమ్యగ్భావనలోని యధార్థాన్నే శ్రీ కె. సి. పంత్ వివరించారు. క్లిష్టమైన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సమస్య శాశ్వతంగా సామరస్యంతో పరిష్కారం కావడం పండిత్ పంత్ రాత నీతిజ్ఞతకూ, దూరదృష్టికీ నిదర్శనం. గత చరిత్ర రాజకీయ పరిణామాల దృష్ట్యా తెలంగాణా ప్రత్యేకంగా వుండకూడదని ఆయన అభిప్రాయపడినారు. భారత దేశం స్వాతంత్ర్య సిద్ధికి ముందూ, తరువాత కూడా, యీ ఫ్యూడల్ ప్రాంతం నిర్వహించిన పాత్ర దృష్ట్యా ఫ్యూడల్ చిహ్నంగా దీనిని ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగించడంలోగల ప్రమాదాలను ఆయన చక్కగా ఊహించగలిగారు. ఆకారణంవల్లనే శ్రీ పంత్ కీ. శే. ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూలు ఏమాత్రం కాలహరణం లేకుండా విశాలాంధ్ర ఏర్పాటుకు రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం సిఫార్సులను అమలు పరచడానికి తమ సుముఖత వ్యక్తం చేశారు. కమ్యూనిస్టుల తిరుగుబాటుకు అనుకూలమైన పరిస్థితులుగల యీ ఫ్యూడల్ ప్రాంతాన్ని అభివృద్ధిచెందిన ప్రాంతంతో కలిపి వేసినట్లయితే, ఒక్క దెబ్బతో భారతదేశం నడిబొడ్డున సుస్థిరమైన రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవచ్చునని పండిత్ పంత్ గట్టిగా భావించి వుండవచ్చు. భౌగోళిక రీత్యా ఉత్తర దక్షిణ భారతానికి వారధిగావున్న ఈ ప్రాంతం, చరిత్రలో కీలకస్థానం వహించింది. బ్రిటిష్‌వారు ఈ ప్రాముఖ్యతను గుర్తించినారు. తమకు లాభదాయకంగా దీనిని ఉపయోగించుకున్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రాంతాలకు మధ్యగా సుస్థిరమైన ఒక పెద్ద రాష్ట్రంవుంటే కలిగే ప్రాముఖ్యతను సర్దార్‌పటేల్, పండిత్‌జీలు గుర్తించారు. ఫ్యూడల్ వ్యవస్థలో గడిపిన ఒక భాగం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడడంవల్ల ఫాసిస్టు ఫ్యూడల్ శక్తులు విజృంభించడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడగలవని పండిత్ పంత్ అభిప్రాయపడినారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 14 సంవత్సరాలు గడిచింది. లోపాలు ఏమైనా వున్నప్పటికీ, అన్నిరంగాలలో అన్నివిధాలా సమైక్యతా భావం వ్యాపించింది. ఇప్పుడు కాలాన్ని వెనుకకు త్రిప్పదలచి తెలంగాణా రాష్ట్రాన్ని సృష్టించడం గొప్ప పొరపాటే అవుతుంది. భారతదేశం పటంలోనుంచి సంస్థానాల అతుకులను తుడిచివేసి, వాటిని సాధ్యమైనంతవరకు మిగతా భారతదేశ రాష్ట్రాలలో లీనం చేయడమే కీ. శే. సర్దార్ పటేల్ పూనుకుని నిర్వహించిన దేశ సమైక్యతాకృషికి ప్రాతిపదిక. దేశప్రజల ఆశయాలకు అణుగుణంగా అఖండ భారతావనికి స్థిరత్వం చేకూర్చడానికి సర్దార్ పటేల్ అసంపూర్ణంగా నిలిపిన పనిని పండిత్ పంత్ పూర్తి చేశారు. ఒకసారి జరిగిన పరిష్కారాన్ని యధార్థాన్ని కాదని సమస్యను తిరిగి లేవదీయడం విజ్ఞతగల మనతరంవారికి తగనిపని. ఏదో ఒక కొద్ది కాలంపాటు తప్ప ఒకే రాజకీయ పరిపాలనక్రింద వున్న 4 కోట్ల తెలుగు ప్రజల యోగ క్షేమాలకు ఇది అశనిపాతం వంటిది. తాత్కాలిక ఉద్రేకాలు, వాస్తవమైనట్టి లేక ఊహా జనితమైనట్టి కష్ట నిష్ఠూరాలవల్ల కలిగిన ఈర్ష్యాద్వేషాలు, రాజకీయమైన కక్షలు మన మనుగడకు ముప్పుకల్గించే విధంగా, మనం కూచున్న కొమ్మను మనం నరుక్కునే విధంగా పరిణమించకూడదు. సమైక్యరాష్ట్రం వుంచుతూనే రాజకీయ సమస్యలను పరిష్కారం చేసుకుని ఆ నిర్ణయాలను అమలు పరుచు కొనడం అసాధ్యమేమీ కాదు. ముందు తరాలవారి భవిష్యత్తుకు భంగకరంగా వారిశ్రేయస్సుకు ప్రతికూలమైన చర్యల ఫలితాలకూ, దుష్పరిణామాలకూ వారిని గురిచేయడం వారికి ద్రోహం చేయడమే. మనం దురభిమానాలకూ, ఈర్ష్యాద్వేషాలకూ దాసులమై భారతదేశం రాజకీయ రంగంలో విశేష ప్రాముఖ్యతగల, స్థిరత్వంగల ఒక పెద్ద ఏకభాషారాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడం భావ్యంకాదు.

వెనుకబడివున్న ప్రాంతాల ఆర్థికాభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ వహించి ఏకాగ్రతతో కృషిచేయడమే దీనికి పరిష్కారమార్గమని శ్రీ కె. సి. పంత్ చెప్పిన సలహా యీ సమస్యను సమూలంగా పరిష్కరించగలుగుతుంది. తెలంగాణా అభివృద్ధి విషయంలో ప్రత్యక్షంగా జోక్యంకలుగజేసుకొన్న భారత ప్రభుత్వం ఈ విషయానికీ అత్యధిక ప్రాధాన్య యిచ్చింది. తెలంగాణా అభివృద్ధికొరకు ప్రధాన మంత్రి సూచించిన అష్టసూత్ర ప్రణాళిక అమలు జరిగిన ఫలితంగా పరిస్థితి చాలావరకు మారింది. అటుతరువాత ప్రాంతీయ సంఘం ఉత్తర్వును సవరణ చేసి, దానికి విశేషాధికారాలు ఇవ్వడం వల్ల ప్రత్యేక రాష్ట్రవాదానికి వున్నబలం పూర్తిగా క్షీణించిపోయింది. తెలంగాణా రక్షణలను అమలు పరచడానికి ఉద్దేశించిన ఆందోళన, కార్చిచ్చువలె వ్యాపించిన తప్పుడు ప్రచారం ద్వారా ప్రత్యేకరాష్ట్రం కావాలనే కోరికకు దారితీసింది. వెనుకబడిన ప్రాంతంలో సహజంగా వుండే నిరుద్యోగ సమస్య ఆర్థిక ఇబ్బందులు కారణాలుగా ప్రత్యేక రాష్ట్ర వాదనకు అవకాశం కల్పించినాయి. నిరుద్యోగాది సమస్యలే లేకుంటే యీ వాదన నిలిచేదికాదు.

రాష్ట్ర రాజధానిగా వున్న హైదరాబాదు తెలంగాణాలో భాగమైనందున వారికి కొన్ని ప్రత్యేక లాభాలు చేకూరుతాయనే విషయాన్ని తెలంగాణా ప్రజలు మరువరాదు. తెలంగాణా ప్రాంతపు సత్వరాభివృద్ధికి యీ నగరం కీలకంగా, కేంద్రంగా వుండడం తెలంగాణాకు వరప్రసాదం వంటిది. ఒక పెద్ద, ఐశ్వర్యవంతమైన రాష్ట్రానికి ఇది రాజధానిగా వున్నందువల్లనే ఇక్కడ పరిశ్రమలలో రూ 150 కోట్లకు మించి పెట్టుబడి పెట్టడం జరిగింది. కానీ కేవలం వెనుకబడివున్న తొమ్మిది జిల్లాలకు చెందిన నగరమైనందువల్లకాదు. పెద్ద రాష్ట్రంలోనే ఎక్కువ మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. చిన్న రాష్ట్రంలో అదిసాధ్యంకాదు. రాష్ట్రం చిన్నదైతే ఉద్యోగావకాశాలుకూడా పరిమితంగావుంటాయి. పెట్టుబడికూడా పలచగా వుంటుంది. అల్పసంఖ్యలో పార్టీ మార్పులు జరిగినా ప్రభుత్వాలు పడిపోతూవుంటాయి కనుక చిన్న రాష్ట్రాలలో అస్థిరత్వం ప్రబలంగా వుంటుంది. ఫ్యూడల్ శక్తులు, గుత్త పెట్టుబడిదారులు సులభంగా చిన్న రాష్ట్రాలను మింగివేయ గలుగుతారు. అందుకే వారు ఎప్పుడూ చిన్న రాష్ట్రాల ఏర్పాటుకే ప్రోద్బలం ఇస్తుంటారు. చిన్న రాష్ట్రాలు బలవంతమైన రాష్ట్రాలుగా వుండ లేవు. రాష్ట్రాలు బలహీనంగా వున్నకొద్దీ పెద్ద పెద్ద వ్యాపారస్తుల ఒత్తిడికి గురి అవుతుంటాయి.

దేశ విభజనకు దారితీసిన మతతత్వం ప్రేరితమైన ద్విజాతి సిద్ధాంత స్వభావాన్నే ప్రత్యేక రాష్ట్ర నినాదం కూడా ప్రతిబిం

బిస్తున్నది. అఖండమైన భారతజాతిలో తలయెత్తిన ద్విజాతి సిద్ధాంతం, భారత ఉపఖండపు విభజనకు దారితీసింది. సామ్రాజ్యవాద శక్తుల కోరిక ఈ విధంగా నెరవేరింది. ఏకభాషా రాష్ట్రాన్ని విచ్ఛిన్నంచేసే ప్రత్యేక రాష్ట్రవాదనకూడా ఇలాంటి ధోరణికి చెందినదే. దీనివల్ల ఏ రాష్ట్రానికీ మేలుకలుగదు. విభక్త భారతదేశం వలెనే యి వాదన రెండు రాష్ట్రాలనూ బలహీనపరుస్తుంది.

భారత దేశ రాజకీయ చరిత్రలో స్థిరత్వం గలిగిన విస్తృత ఏక భాషా రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడం అత్యంత ప్రాధాన్యంగల చరిత్రాత్మక సంఘటన. 1956 నుంచి మన రాష్ట్రం అనేక రంగాలలో క్లిష్టమైన విలీనీకరణ సమస్యలను పరిష్కరించుకోవడమే కాకుండా, ఆర్థిక ప్రగతి పథంలో అనేక విజయాలు సాధించుకుంటూ ముందుకు నడుస్తున్నదని నిస్సందేహంగా చెప్పవచ్చు. 1956 లోని వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుచ్ఛక్తి మున్నగు విషయాలకు సంబంధించి 1956లో రాష్ట్రంలో వున్న పరిస్థితులను, ఇప్పుడు వున్న పరిస్థితులను పోల్చుకున్నట్లయితే రాష్ట్రంలో బ్రహ్మాండమైన అభివృద్ధికరమైన మార్పు వచ్చినదని తేటతెల్లం అవుతుంది. రాష్ట్రంలో ఆయా ప్రాంతాల లోని వనరులను ఆయాప్రాంతాలకు, యావత్ రాష్ట్ర సౌభాగ్యానికి జాగ్రత్తగా, నేర్పుతో ఉపయోగించడం వల్లనే ఇది సాధ్యమయింది.

తెలంగాణా ఉద్యోగుల కష్టనిష్ఠూరాలను తొలగించి వారికి న్యాయం చేకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంటున్నది. ఈ దృష్టితోనే, ప్రభుత్వోద్యోగ నియామకాల విషయంలో ఒక రాష్ట్రంలోని ఒక పాంతానికి సంబంధించిన నివాస నిబంధనలు చెల్లనేరవని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, 4 వ గ్రూపు మినిస్టీరియల్ సర్వీసులకు ఉద్యోగులను నియమించుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వికేంద్రీకరణ విధానం అమలు జరుపుతున్నది. ఇదేవిధంగా సర్వీసుల విలీనీకరణ విషయంలో ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రాంతీయ సర్వీసులను ఏర్పాటుచేసే విషయాలలో కూడా చర్యలు తీసుకుంటున్నది. ముల్కీ నిబంధనలను గురించి హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుకు ప్రభుత్వం కట్టుబడివుంటుందని ముఖ్యమంత్రి స్పష్టంగా ప్రకటించారు. నిజానికి తెలంగాణా రక్షణల అమలుకు భద్రత చేకూర్చాలన్న ప్రభుత్వ విధానానికి ఈ తీర్పు చాలా సహాయకారిగా వుంది. దీనివల్ల తెలంగాణా ఉద్యోగుల కష్టనిష్ఠూరాలు తొలగిపోవడమే కాకుండా వారిలో కొత్త విశ్వాసం ఏర్పడగలదని నిస్సందేహంగా చెప్పవచ్చు. పరస్పరావగాహనకు అవకాశంగల నూతనశకారంభానికి ఇది దోహదకారి అవుతుంది. అందువల్ల ప్రభుత్వోద్యోగులతో సహా ప్రజలందరి శక్తియుక్తులను రాష్ట్రాభివృద్ధికి వినియోగించడానికి చక్కని అవకాశం కలుగుతుంది.

ఇంతవరకు ప్రత్యేక రాష్ట్రాన్ని అభిలషిస్తున్న వారుకూడా దేశ ప్రయోజనాలనూ, తెలంగాణా ప్రజల భవిష్యత్తునూ దృష్టిలో వుంచుకొని, తమ అభిప్రాయాలను గురించి పునరాలోచిస్తూ వుండడం హర్షించదగిన విషయం. వ్యవసాయదారులు, పరిశ్రమలలోనూ యితర రంగాలలోనూ నిమగ్నులైవున్న కార్మికులు, స్వయంగా ఉపాధి కల్పించుకున్న వారూ ఇంకా ఇతరులు అనేక మంది ప్రజలు ప్రభుత్వం తీసుకొన్న పురోభివృద్ధి చర్యలకు సహకారం ఇస్తూ రాష్ట్ర శ్రేయస్సుకు అనుగుణంగా కృషిచేస్తున్నారు. మత విషయక, భాషా విషయక అల్పసంఖ్యాక వర్గాల ప్రజలు విశాల రాష్ట్రంలో భద్రత కలిగివున్నామని భావిస్తున్నారు. వెనుకబడివున్న ప్రాంతాలపట్ల ప్రత్యేక శ్రద్ధవహించి, వాటి సత్వర ఆర్థికాభివృద్ధికి కృషిచేయడం అత్యవసరమని యిప్పుడు అందరూ అంగీకరించినదే. నిజమైన కష్టనిష్ఠూరాలను అన్యాయాలను ఎక్కడవున్నాసరే సత్వరంగా తొలగించవలసిందే. 4 కోట్ల తెలుగు ప్రజల భవిష్యత్తు పరస్పర సహకారంతో ముడిపడి వుంది. ఉమ్మడి శ్రేయస్సు లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయడమే విజ్ఞత అనిపించుకుంటుంది. తెలుగు ప్రజల సమైక్యత ఒక్కటే వారి సర్వతోముఖాభివృద్ధికి దోహదకారి. తెలుగు ప్రజలందరూ సమైక్యంగా వున్నపుడే వారి కీర్తిప్రతిష్ఠలు అత్యున్నతస్థాయి అందుకొన్నాయనీ. విడిపడి పోయినప్పుడు వారి కీర్తిప్రతిష్ఠలు సన్నగిల్లాయనీ చరిత్ర మనకు చాటి చెబుతున్నది.

మా రచయితలు

కాసు బ్రహ్మానందరెడ్డి, ముఖ్యమంత్రి

అక్కిరాజు వాసుదేవరావు, సమాచారశాఖమంత్రి

నరేంద్రలూథర్, డైరెక్టరు, పరిశ్రమలశాఖ

కె. శివారెడ్డి, లెక్చరర్, వివేకవర్ధనీ కళాశాల, హైదరాబాదు

అవసరాల రామకృష్ణారావు, భీమారావుపేట, బరంపురం (ఒరిస్సా)

టి. ఎ. పద్మనాభరావు, నెల్లూరు

డా. ఎ. రమాపతిరావు, తెలుగు అకాడమీ, హైదరాబాదు

టి. వేదాంతం, సెన్సస్ సూపరింటెండెంట్, హైదరాబాదు

ఉమ్మెత్తల కేశవరావు, సర్వోదయ నాయకులు, హైదరాబాదు

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, డిప్యూటి డైరెక్టరు, విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయము, హైదరాబాదు

డి. ప్రభాకరరావు, ఫామిలీ ప్లానింగ్ బ్యూరో, హైదరాబాదు

వింజమూరి సీతాదేవి, ఆకాశవాణి, హైదరాబాద్

ఎ. పండరీనాథ్, టీచర్, ఇబ్రహీంపట్నం

కూరెళ్ల రామనరసింగరావు, రాజముదిలియార్ స్ట్రీట్, సికింద్రాబాదు

కాండ్రేగుల నూకేశ్వరరావు, కంచెర్లపాలెం, విశాఖపట్టణం

శా.కా.వి. గుప్త, హరిబౌలీ, హైదరాబాదు

శేషం రామానుజాచార్యులు, నకిరేకల్

పి.వి. ప్రసాదరావు, జర్నలిస్టు, గుంటూరు

పారిశ్రామిక రంగంలో ఆంధ్రప్రదేశ్ ముందంజ

నరేంద్ర లూథర్

నా మాదిరిగానే ఎవరైనా కొన్ని సంవత్సరాల వ్యవధి తర్వాత తిరిగి ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించినపుడు యీ రాష్ట్రం సాధించిన ప్రగతి విస్పష్టంగా కనిపిస్తుంది. గత కొన్ని సంవత్సరాల కాలంలో కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ రంగాలలోను, ప్రైవేటు రంగంలోను అనేక పరిశ్రమలు నెలకొల్పబడినాయి.

పరిశ్రమలను రెండు విభాగాలుగా భాగించవచ్చు. రు. 7.5 లక్షల మేరకు పెట్టుబడి, యంత్రపరికరాల ఖర్చుగలవాటిని లఘు పరిశ్రమలుగాను, మిగతావి మధ్య తరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలుగాను వ్యవహరిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో రు. 280 కోట్ల పెట్టుబడితో 153 పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. వచ్చే 2-3 సంవత్సరాలలో దాదాపు రూ॥లు 60 కోట్ల పెట్టుబడితో మరో 27 పరిశ్రమలను నెలకొల్పనున్నారు. కేంద్ర పబ్లిక్ రంగంలో యింతవరకు రు. 118 కోట్లు పెట్టుబడి పెట్టారు. 26,000 మందికి ఉపాధి కల్పించబడింది. యీ రంగంలో యిటీవల రామగుండంలో ఎరువుల కర్మాగారం నెలకొల్పబడుతున్నది. గత నెలలోనే దీనికి శంఖుస్థాపన జరిగింది.

ఉక్కు ఫ్యాక్టరీ

విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పాలని నిర్ణయించడంతో రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. ఈ ఫ్యాక్టరీ నిర్మాణంతో రాష్ట్ర స్వరూపమే మారుతుంది. ఈ ఫ్యాక్టరీ నిర్మాణంలో పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడంవల్ల కలిగే ప్రత్యక్ష ఫలితాలను గూర్చి మాత్రమేగాక యీ ప్రాంతం ప్రజల జీవన స్థాయిలో కలిగే మార్పులను గూర్చి కూడ మదింపు వేయడం జరిగింది. యీ ఫ్యాక్టరీ ద్వారా ఉపాధికల్పన, అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఏర్పడడమేగాక రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై దాని ప్రభావాన్నిగూర్చికూడ మనం పరిశీలించాలి. ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి పెట్టుబడి ఎంత ఉంటుందో యింకా నికరంగా నిర్ధారణకాకున్నా కేంద్ర పబ్లిక్ రంగంలో యింతవరకు ఖర్చుచేసిన మొత్తం పెట్టుబడి ధనంకన్నా ఎక్కువగానే ఉంటుందని చెప్పవచ్చు.

భారీ పరిశ్రమలు ప్రధానమైనవే అయినప్పటికీ దేశ ఆర్థిక పురోభివృద్ధిలో లఘు పరిశ్రమలు వెన్నెముకవంటివని సర్వత్రా గుర్తించడం జరిగింది. ఈ విషయంలో లఘు పరిశ్రమలద్వారా అమోఘమైన అభివృద్ధిని సాధించిన జపాన్ దేశాన్ని దృష్టాంతరంగా తీసుకోవచ్చు. పెద్ద ఎత్తున చిన్న పరిశ్రమలను అభివృద్ధిపరచడానికి మనం చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రతి పెద్ద పరిశ్రమతోపాటు లఘు పరిశ్రమల రంగంలో అనుబంధ పరిశ్రమలు ఏర్పడే విధంగా ఉండాలని మనం ఆలోచిస్తున్నాము. తద్వారా యీ రెండు రంగాల మధ్య సమన్వయం ఏర్పడి, మన వనరులను శాస్త్రీయంగా క్రమ పద్ధతిలో వినియోగించడానికి అవకాశం కలుగుతుంది.

పునాది సంభారాలు

పరిశ్రమల స్థాపనకు భూమి, నీరు, విద్యుచ్ఛక్తి, రవాణా సౌకర్యాలు చాలా అవసరం. వాటిని పునాది సంభారాలు అంటారు. వీటికితోడు పెట్టుబడి, వ్యాపార దక్షత చాలా ముఖ్యమైనవి. పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతాలు, పారిశ్రామికవాడల ద్వారా అవసరమైన పునాది సంభారాలు మనం కల్పిస్తున్నాము. ఇవి మూడు విధాలుగా ఉన్నాయి. మొదటిది సంప్రదాయిక పారిశ్రామిక వాడలు. వాటికి పారిశ్రామికవేత్తలకు కర్మాగారం షెడ్లు నిర్మించబడి ఉంటాయి. రెండవది, సహాయక ప్రైవేటు పారిశ్రామిక వాడలు. వాటిలో పారిశ్రామిక వేత్తలకు భూమి కేటాయించబడి, వారి అవసరాలకు అనుగుణంగా భవనాలను వారే నిర్మించుకునే స్వేచ్ఛ యివ్వబడుతుంది. ఇక మూడవది సహకార పారిశ్రామిక వాడలు. వాటిలో సహకార సూత్రాలకు ప్రోత్సాహం ఉంటుంది.

ఈనాడు రాష్ట్రంలో 37 పారిశ్రామిక వాడలు ఉన్నాయి. వాటిలో 803 యూనిట్లు ఉన్నాయి. 20,000 మందికి నేరుగా ఉపాధి కలిగింది. ఈ వాడలపై యింతవరకు దాదాపు రు 3 కోట్లు ఖర్చు పెట్టాము. వాటిలో నెలకొల్పబడిన యూనిట్లు వార్షికంగా రు. 7.8 కోట్లు విలువచేసే వస్తువులను ఉత్పత్తి చేస్తున్నాయి. రేజరు బ్లేడ్లు, కండక్టర్స్, ఉక్కు ఫర్నీచర్, సైకిల్ విడిభాగాలు, కార్ల బ్యాటరీలు, విద్యుచ్ఛక్తి మోటార్లు, రేడియో ఎలక్ట్రానిక్ పరికరాలు, ప్లాస్టిక్ రబ్బరు ఫోమ్ మొదలైనవి తయారవుతున్నాయి. వాటిలో కొన్ని యూనిట్లు తమ ఉత్పత్తులను ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతిచేస్తూ విదేశీ మారక ద్రవ్యం సంపాదిస్తున్నాయి.

పారిశ్రామిక వేత్తలకు ఆర్థిక సహాయం అందజేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ఏజన్సీలను ఏర్పాటు చేశాయి.

పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్‌తో పాటు, లఘు పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జాతీయం చేయబడిన బ్యాంకులు, రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పేవారికి ఆర్థిక సహాయం అందజేసే పథకాలను అమలు జరుపుతున్నాయి. చిన్న పరిశ్రమలు, గ్రామీణ పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించడానికి పరిశ్రమలను ప్రభుత్వ సహాయం చట్టం క్రింద యింతవరకు రు.51 లక్షలు పంపిణీ చేయడం జరిగింది.

వ్యాపార దక్షత

పరిశ్రమల స్థాపనకు స్థానం, శ్రామిక శక్తి, పెట్టుబడి ప్రధానమైన అంశాలే అయినప్పటికీ, ముఖ్యమైన వ్యాపార దక్షత లేనప్పుడు యివన్నీ అప్రధానమైనవే అవుతాయి. వ్యాపార దక్షత గల వారిచేతిలో మట్టి, మాణిక్యంగా మారుతుంది. విద్యార్హతలు ఉన్నంత మాత్రాన వ్యాపారదక్షత కలగదు. దూరదృష్టి, చొరవ, చతురత, నిర్మాణ శక్తి, కష్టించి పనిచేసే తత్వం ఉండాలి. కొంతవరకు యీ గుణాలను సంపాదించుకోవచ్చు. అందువల్లనే వ్యాపారదక్షతలో శిక్షణయిచ్చే పథకాలను అమలు జరుపుతున్నారు.

లఘు పరిశ్రమల సర్వీసు సంస్థ, సాంకేతిక శిక్షణ పథకాన్ని ప్రారంభించింది. దానికితోడు విస్తృత ప్రాతిపదికపై సెమినార్లను నిర్వహిస్తున్నారు. ముడిసరకు, యితర వనరులను గూర్చి వివిధ జిల్లాలలో పరిశీలనలు జరుపుతున్నారు. ఏ ప్రాంతాలలో ఎటువంటి పరిశ్రమలను నెలకొల్పాలనే విషయాలను గూర్చి తెల్పుతున్నారు. పరిశ్రమల స్థాపనలో ఆసక్తి గలవారికి అపారమైన అవకాశాలు వున్నాయి. అక్కడికక్కడ దరఖాస్తులను స్వీకరించి, రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. గత సెప్టెంబరులో కడపలో సెమినారు జరిగినప్పుడు రు. 58 లక్షల పెట్టుబడిగల 79 దరఖాస్తులను వారం రోజులలో స్వీకరించారు. దానివల్ల లభించిన ప్రోత్సాహంతో యితర జిల్లాలలో కూడ ఇదేమాదిరి సెమినార్లు నిర్వహించాలని ప్రతిపాదించారు.


ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలను నెలకొల్పేవారికి రాష్ట్ర ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్రోత్సాహకార్యలను ప్రకటించింది. మిశ్రమ సంస్కృతి, సౌహార్ద్రతలకు పేరుగాంచిన మనరాష్ట్రంలోని ఏ ప్రాంతంవారైనా పరిశ్రమలను నెలకొల్పడానికి ప్రభుత్వం అవసరమైన సహాయం అందజేస్తుంది. రాష్ట్రంలో ఆరోగ్యకరమైన పారిశ్రామిక వాతావరణం వెల్లివిరుస్తుంది. పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో కృషిచేస్తున్నది. యీనాడు అవకాశాలు మనకొరకు ఎదురుచూస్తున్నాయి. మనలోని చాలామంది యీ అవకాశాలను వినియోగించుకుంటారని ఆశిస్తున్నాము.


జాతీయ పొదుపు ఉద్యమం రాష్ట్ర సలహా సంఘ పునర్నిర్మాణం


రాష్ట్ర పంచాయతీరాజ్, జాతీయ పొదుపు ఉద్యమం శాఖల మంత్రి అధ్యక్షుడుగాను, శ్రీ ఎన్. టి. రామారావు ఉపాధ్యక్షుడుగాను జాతీయ పొదుపు ఉద్యమం రాష్ట్ర సలహా సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునర్నిర్మించింది. 1970 మే 1వ తేదీ నుంచి ఒక సంవత్సరం పాటు ఈ సంఘం పదవిలో ఉంటుంది.

ఇతర సభ్యులు దక్షిణ మధ్య రైల్వే ప్రతినిధి, ఫెడరేషన్ ఆఫ్ ఛేంబర్ ఆఫ్ కామర్స్ శ్రీమతి పద్మ పాట్నీ (సికిందరాబాదు), శ్రీ కె.ఆర్. పట్టాభి రామన్, ఎడిటర్, దక్కన్ క్రానికల్ సికింద్రాబాదు, జనరల్ మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్; శ్రీ ఎం. గోపాల కృష్ణయ్య, కడప; శ్రీ పి. సాంబశివరావు, బోయిగూడ, సికిందరాబాదు; శ్రీ టి. ఆర్. వి. రంగన్; ఎన్.ఎన్. శ్రీమతి సరోజినీ పుల్లారెడ్డి, ఎం.ఎల్.సి.; శ్రీ అప్పన్న సూర్యనారాయణ రావు, విశాఖపట్నం; శ్రీమతి కమలాచౌదరి, రాజమండ్రి; శ్రీ ఆర్. వి. రమణ మూర్తి, హైదరాబాదు, అధికారులు; జాతీయ పొదుపు శాఖ రాష్ట్ర కమీషనరు ఉపాధ్యక్షుడు; ఆర్థికశాఖ డిప్యూటీ కార్యదర్శి, కార్మిక శాఖ కమీషనర్, హైదరాబాదు; విద్యాశాఖ డైరెక్టరు, హైదరాబాదు; పరిశ్రమల శాఖ డైరెక్టరు, హైదరాబాదు; రవాణా శాఖ కమీషనరు, హైదరాబాదు; పోస్టు మాస్టర్ జనరల్, ఆంధ్ర సర్కిల్; సమాచార, పౌరసంబంధ శాఖ డైరెక్టరు, హైదరాబాదు—సభ్యులు. హైదరాబాదులోని జాతీయ పొదుపు ఉద్యమం ప్రాంతీయ డైరెక్టరు (కేంద్ర ప్రభుత్వం) యీ మండలి కార్యదర్శి-కన్వీనరుగా వ్యవహరిస్తారు.

41-3








నగర వార్తా చిత్రాలు

ఎడమవైపు పైన: డిశంబరు 1 న రంజాన్ సందర్భంగా ముసల్మానులు ప్రార్థనలు చేశారు.

ఎడమవైపు మధ్యలో: డిశంబరు తొలివారంలో రవీంద్ర భారతిలో సాంస్కృతిక ప్రదర్శన లిచ్చిన హంగేరియన్ బృందంతో యాత్రా విషయాల మంత్రి శ్రీమతి రోడామిస్త్రీ.

క్రింద: హంగరి సాంస్కృతిక బృందం ప్రదర్శనలు.

పైన: కార్మికశాఖ జరిపిన అంతర్ కర్మాగార క్రీడల పోటీలలో గెలుపొందిన వారికి హోంమంత్రి శ్రీ జె. వెంగళరావు బహుమతులు పంపిణీ చేశారు.



అయ్యో ! ఈ ఇల్లు పూర్వం అద్దెకియ్య
బడుతుండేది

అడ్వాన్సు లేకుండానే ఆక్రమించుకొనేవారు
అన్నివసతులు గలది; కావల్సినంత
ఖాళీస్థలం గలది — కాకుంటే కాస్త శ్రమచేస్తే
కూరగాయల దగ్గర్నుండి, పూలతోటలవరకు
ఏదైనా సులభంగా పెంచవచ్చు;
అయ్యో ! ఈ ఇల్లు పూర్వం అద్దెకియ్య
బడుతుండేది

గుర్తు పెట్టుకోండి !
ఈ సందు పేరు ఆసియా !
ఈ ఇంటి పేరు ఇండియా !
దీని చరిత్ర చాలా గొప్పదిలెండి
ఒకప్పుడు 'సంస్కృతి' వారుండేవారు
వాళ్ళింట్లో 'నాగరికత' అనే
అందాల బొమ్మకూడా ఉండేది.
ఆ దశ ఇప్పుడెలా వస్తుంది సార్!
ఆ తర్వాత
మొగల్‌వంశీయులకి కిరాయికిచ్చాం
ఉత్తమ మధ్యంగా ఉండేది వ్యవహారం
మేం అప్పుడు పెరట్లో పాకలో ఉండేవాళ్ళం
అయినా మొగలాయివారు
ఎంతో ఆదరం చూపించేవారు
వాళ్ళు కిరాయివాళ్ళన్న సంగతే మర్చిపోయాం
ఆ సమయంలోనే
'పొగరుమోతు' రాణాప్రతాపుడు
"అల్లరి" శివాజీ గొడవలు లేవదీశారు!
మేమంతా అండదండగా ఉంటే
మొగలాయి వారిమీద ఈగ వాలిందా! లేదు !!
తర్వాత, పెద్దదొర వచ్చాడు
ఇంటి మొత్తాన్ని గుత్తకు తీసుకున్నాడు
వాడిదేనన్నట్లు ఇల్లు, మా మీద
పెత్తనం చెలాయించేవాడు
వాడి దగ్గర తుపాకుల్లాంటి
తెలివితేటలుండేవండి;
కిమ్మనకుండా సేవలు చేశాం
మేమంతా వాడి పరిచారకులం
సావిట్లో గదులు కట్టుకు ఏడ్చే వాళ్ళం

ఈ ఇల్లు బాగు చేసుకుందాం

కె. శివా రెడ్డి

మా వాళ్ళు చాలా పరాక్రమ వంతులు
వాళ్ళలో వాళ్ళు తన్నుకునే వాళ్ళు
గిచ్చుకునే వాళ్ళు, గిల్లుకునే వాళ్ళు
అప్పుడే, మా దుస్తుల్తోపాటు
మా మానసిక మతం కూడా మార్చాడు,
వాడి బూట్లకి మేం
ఎంతో భక్తితో సేవలుచేశాం
కుక్కలు మా ముందు బలాదూర్
అది మా స్వామి భక్తికి నిదర్శనం
అప్పుడప్పుడు వాడిమీద ఎదురుతిరుగుదామని
తిరగబడదామని ఆలోచించేవాళ్ళం;
మాలో ఎవడో ఒకడు ఇది ఊదనే ఊదేవాడు
అంతే, సున్నంలోకి లేకుండా తన్నేవాడు దొర!
తర్వాత వాడి బాధలు పడలేక
ఇల్లు ఖాళీ చేయమన్నామ్ !
ఇంటిని ఇంటిగా ఉంచుకోవడం మీ చేతగాదు
అసలు మీ కిల్లుండట మేమిటి—
చాకిరీ చేయటానికి మీరు పుట్టారు
చాకిరీ చేయించుకొంటానికి మేం పుట్టాం
కదిలారా మక్కెలిరగ తంతానన్నాడు,
తర్వాత, పక్కలోకత్తి బోసుబాబు
దెబ్బలాటకే దిగాడు వాళ్ళతో
మా ఇంట్లో తాతగారి పుణ్యమాఅని
వాడెలాగైతేనేం ఇల్లు ఖాళీచేశాడు.
కాని ! ఇంటిని రెండుగా చీల్చి పొయ్యాడు
ఈ లంకంత ఇంట్లో

తలా ఒక గది నాక్రమించుకున్నాం
ఏ గదికి ఆ గదే రాజు—ఒక దేశం
గదుల మధ్య దూరం పెరిగింది
గదుల్లో గదులేర్పడ్డాయి—
గదికొకజెండా, మదికొకజాడ్యం,
ఇదంతా జోరీగలరాజ్యమయింది
అందరూనాధులే, అందరూమొనగాళ్లే
ఈ ఇంటిస్థితి
ఈ మధ్యమరీ అధ్వాన్నమయింది,
ఎవడికి అందింది వాడు తినటమే తప్ప
ఇంటి బాగోగులను పట్టించుకునే వాడు లేడు
బొజ్జలు పెంచుకోవటం
సోమరులుగా తిరగటం మా ధ్యేయం.
బందెల దొడ్డి సామెతగాఉంది
ఈ గొఱెల మందలో మేకల రూపంలో
తోడేళ్ళున్నాయి

వెలుగు వాటికి పనికి రాదు
ప్రగతి బద్ధ విరోధి
ఇక్కడ చీకటి వెలుగులా నటిస్తుంది
'దోపిడి' మా మనోమందిరాల్లోని దేవత,
ఈ ఇంటోఅవినీతిTap-waterదొరుకుతుంది
అజ్ఞానంగాస్ పొయ్యికూడా ఉంది
దౌర్భాగ్యం, దారిద్ర్యం, కుళ్ళు, నీచత్వం
ఈ అంతఃపురంలోని పరిజనం
వంగి, వంగి దణ్ణాలు పెట్టే
మేమంతా దాసానుదాసులం
గుర్తుంచుకోండి
ఈ సందు పేరు ఆసియా
ఈ ఇంటి పేరు ఇండియా
ఈ ఇల్లు యింక అద్దెకియ్య బడదు!
ధీరులూ, మొనగాళ్లూ
జాగృత పరిణత మనస్కులూ
చైతన్యాన్కి వారసులూ!
విప్లవాగ్ని పుత్రులూ !
ఇంక రండి ! ముందుకురండి
ఈ ఇల్లు బాగుచేసుకోండి
ఈ తోట బాగు చేసుకోండి !! !

చిన్నకథ:

తీపి తీపి జ్ఞాపకాలు

అపసరాల రామకృష్ణారావు

రైలు ఆ స్టేషనులో ఆగీ ఆగగానే నా మనస్సు ఒక్కసారి ద్రవీభూతమైపోయింది అక్కణ్ణుంచి మరి కదలనని మారాం చెయ్యసాగింది. ఎవరు మటుకు వారే ఉంచుకుని ఎప్పుడో ఒకప్పుడు మననం చేసుకునే మధురానుభూతులు ప్రతీవారికీ ఉంటాయి. అవును, అర్ద్రమయిన నా గుండె అక్కడే ఉండిపోతానని అల్లరి చేసిందంటే అందులో ఆశ్చర్యమేముంది, అది మా ఊరు!

మా ఊరు అని దేన్నిబట్టి అంటాం. మన ఇల్లు అనేది ఒకటి అక్కడ ఉంటేగదా! మన ఇల్లు అనేది దేన్నిబట్టి ఏర్పడుతుంది. మన అమ్మ అనేది ఒకర్తి ఉంటే గదా! అవును, అయిదుగురు కొడుకుల్నీ, ఆరుగురు కూతుళ్ళనీ అమ్మ అక్కడే పెంచి పెద్దచేసింది· నలుగురూ వచ్చీ పోయే నాలుగిళ్ల వాకిలి మాయిల్లు మా తాతల దగ్గర్నుంచీ వ్యవసాయమే మా జీవనాధారం. అంటే పొలంమీద పడి అరకదున్నేవాళ్లం అని కాదు. నమ్మకమైన రైతులకి కౌలుకి ఇచ్చేవాళ్ళం మా పూర్వులందరూ రోజులు ఎలా వెళ్ళబుచ్చేవారో నాకు తెలీదు గాని మా నాన్నమాత్రం ఆయుర్వేద వైద్యం చేసేవాడు. దానివల్ల ఆయన డబ్బు కోరనూలేదు, అది రానూలేదు. నలుగురిచేతా మంచివారనిపించుకోవాలనే ఆయన కోరికమాత్రం పూర్తిగా తీరినట్లుంది. ఆ తృప్తితోనే ఆయన ఏభైఏళ్లు నిండకుండానే హాయిగా కళ్లుమూసినట్టున్నాడు.

నాన్న ఉన్నప్పుడుకూడా అమ్మ నాన్నమాటమీదే నడిచినట్టు ఎక్కడా దాఖలాలులేవు. ఈపీ, తీపీ దివాన్గిరీ చెలాయించిన వాళ్ళ తాతనుంచి పుణికి పుచ్చుకున్నట్టు ప్రవర్తించేది అమ్మ. పది కాలాలపాటు బతికి పదిమందిచేత చేయించుకోవాలనీ, పదిమందికీ తనివి తీరా పెట్టగలగాలనీ కోరిన అమ్మ మనసు, నాన్న తరవాతకూడా నిర్విఘ్నంగా సాగింది.

పదకొండుగురు అమ్మ సంతానంలో ఆఖరివాణ్ణి నేను. అందరికంటె అమ్మపాలు ఎక్కువకాలం తాగినవాణ్ణి నేను. ఉక్కిరి బిక్కిరి అయే అమ్మప్రేమ భరించలేక అందుకే కాబోలు ఇంట్లోంచి పారిపోవలసినవాణ్ణ అయాను నేను!

పెద్దన్నయ్య అనేవాడు ఒకడున్నాడని మా అన్న దమ్ములకయితే తెలుసుగాని మావూరి వాళ్ళెవరికీ తెలీదు. పెళ్ళయిందగ్గర్నుంచీ వాడు ఏ ఏడాది కొకసారోగాని మా యింటికి వచ్చేవాడు కాడు. మా అమ్మా నాన్న వాణ్ణ ఇరవై ఏళ్ళదాకానే పెంచేరు గాని ముప్ఫై ఏళ్ళయి పాపం వాడి అత్తమామలే భరిస్తున్నారామె.

రెండో వదిన ఒక సామాన్య గృహస్థు అయిదో సంతానం. ఎలాగో అయిదేళ్లు ముళ్ళమీద ఉన్నట్టు కాపురం చేసి చిన్నన్నయ్యకి వాళ్ళ ఊరే ట్రాన్స్ఫరు చేయించుకుని లేవదీసుకుపోయింది. ఇక మా చిట్టన్నయ్య పెళ్ళాం నోటితో ఏం మాట్లాడగా నే నెప్పుడూ వినలేదు. కట్టి పడెయ్యగల శక్తి ఆ కళ్ళకే యిచ్చాడు భగవంతుడు అంటుంది అమ్మ...కావచ్చు...లేకపోతే అంతగా గారడీ విద్య ప్రదర్శించలేదు. లేకపోతే అప్పటిదాకా ఊళ్ళో లా ప్రాక్టీసు చేస్తానన్న మనిషి పెళ్ళయిన నెల తిరక్కుండానే వేరే ఊళ్ళో ఏదో ప్రైవేటు కంపెనీకి లీగల్ ఎడ్వైజరుగా కుదిరిపోతాడా! ఇక మా నాలుగో వదిన లలితా, మా అమ్మా దెబ్బలాడుకోని రోజు ఉండేదికాదు. అవి మా నాన్నగారి కర్మలు జరుగుతున్న రోజులు. ఇంటినిండా ఇంతెడు జనం... ఏం అల్లరి జరిగిందో తెలీదు. మూడేళ్ళ పిల్లాణ్ణి చంక నెత్తుకుని రైలు కింద పడిపోతానని లలిత వదిన పరుగుతీసింది. మా రఘు అన్నయ్య ఆ సంగితి తెలిసి నెత్తీ నోరూ కొట్టుకుంటూ బయలుదేరేడు, ఆ తెల్లారు ఝామున వదిన్ని వెతుక్కుంటూ. అప్పటో వాళ్ళెవరూ మరి ఇంటికి తిరిగి రాలేదు. రైలుకిందపడనూలేదు, ఏకంగా లోపలే ఎక్కేరు మూడేళ్లపాటు ఏ కబురూ లేదు· తర్వాత పాపాయి పెళ్ళికి కాబోలు వచ్చారు. అందరు కోడళ్లూ ఎంత సాయం చేశారో అంతకన్న ఓ ఆకు ఎక్కువేచేసింది లలిత వదిన!

మా వూళ్ళో స్కూలు ఫైనలుదాకా ఉండేది · అప్పట్లో. అంటే పద్దెనిమిదేళ్ళు వెళ్ళేదాకా నేను మా అమ్మ కొంగు పట్టుకుని–మా అక్కలతోకూడా–తిరుగుతూ ఉండేవాణ్ణి· మా రెండో అక్కకి చిన్నప్పుడు మొగుడు పోవడంచేత నాకు జ్ఞానం వచ్చిందగ్గిర్నుంచీ మా యింట్లోనే ఉండేది. తక్కిన మా బావలందరూ నిక్షేపంలాగే ఉన్నారుగాని మా అక్కలు మాత్రం మా రెండో అక్క కాక మరి యిద్దరు ఎప్పుడూ నెలల తరబడి మా యింట్లోనే ఉండిపోతూ ఉండేవారు· అంటే అమ్మా, ముగ్గు రక్కలూ, ఓ వంటమనిషీ ఎప్పుడూ మా యింట్లో ఉండేవారు. వీళ్ళకాక– వీళ్ళతో పాటు నేనూ చాలా ఏళ్లు–కనీసం మిగిలిన అన్నల కంటె ఎక్కువగా ఇంటి పట్టున ఉన్నాను

'కోడళ్ళ వల్ల నువ్వు పడ్డ కోతలు చాలు, జీవితాంతం నేనే నీకు పాదసేవచేస్తాను' అనేవాణ్ణి అమ్మతో నేను అలాగే ఆమాట నిలబెట్టుకునే వాణ్ణి కూడాను, అమ్మ నాకు ఇరవై రెండో ఏటే పెళ్ళి చెయ్యకపోతే. పెళ్ళి అయాకకూడా 'అందరిలాగా

అనుకున్నావా అమ్మా నేను? నా పెళ్ళాం నీ ముందు నోరెత్తిందో, ఒళ్ళు చీరెయ్యనూ?' అని ప్రతిజ్ఞచేశాను. ఆ మాటకూడా నిలబెట్టుకుని తల్లి ఋణం తీర్చుకునే వాణ్ణి కూడాను. ఆ తరవాత మూణ్ణెల్లకే నాకు పునస్సంధానం ఏర్పాటు చెయ్యకపోతే...

నా తరవాత చదువూ, నాకు ఉద్యోగం వేయించే బాధ్యతా అన్నీ మా మావగారే నెత్తిన వేసుకున్నాడు. ఎలాగో అలా కృతజ్ఞత ప్రకటించక నాకు తప్పలేదు. ఆ పెద్దమనసుని నొప్పించకుండానే ఇల్లరికం ఉండిపోవడానికి నిశ్చయించేసుకున్నాను ..అక్షరాలా అమలులో పెట్టేసుకూడా...

ఊరికే తమాషాకి.. నాకు చేతనయిన కాస్త పైత్యం జోడించి మా ఆవిడ కజ్జికాయ అల్లినట్టు యిలా చుట్టూ తిప్పుకు అల్లుకొచ్చానుగాని నాకు ఆర్ద్రత కలిగించిన మా అమ్మ స్వరూపం వేరే వేరు. మఱ్ఱిచెట్టు లాంటి వెఱ్ఱితల్లి ఆమె. తొఱ్ఱ తొఱ్ఱలోంచి ఎఱ్ఱమూతి చిలకలు తొంగిచూడాలనే ఆవిడ కోరిక తీరనే లేదు. ఊరూ వాడా నొల్లుకుపోయే ఒకయ్య చేతిలో పెట్టిన కూతుళ్ళే తప్ప ఆ యింటి నట్టింట దీపం వెలిగించవలసిన కోడలు ఒక్కర్తయినా అక్కడ నిలదొక్కుకోలేదు. అమ్మ ఇచ్చే ప్రేమ, అమ్మకి నచ్చిన పద్ధతిలోనే స్వీకరించే కోడలు, ఒక్కర్తె అంటే ఒక్కర్తె అయినా లేకపోయింది. దీనికి తట్టుకోలేక ఆవిడ కొన్నేళ్ళపాటు మనిషి కాలేకపోయింది. మా తాత కాలంవరకూ మా ఆస్తి ఉమ్మడిగానే ఉండేది. మా నాన్న ఆయన అన్నలూ వేరుపడి పోయి ఎవరిది వాళ్ళు పంచేసుకున్నారు. మా నాన్న పోయేటప్పుడు ఇల్లూ, పొలమూ అంతా అమ్మపేరే పెట్టేశారు ఎవరిది వాళ్ళకి పారేసి ఏ తీర్థయాత్రలకో పోతుందేమో అనుకున్నారు అంతా. ఏ పిచ్చో ఎత్తిపోతుందేమో.. ఇల్లు చేరిన తల చెడిన కూతురు బతుకేమిటా అని బంధువులందరూ గిలగిల లాడేరు. ఎప్పట్నుంచో ఇంట చేరిన వంట పుట్టి సహా 'నాకేం దారిచూపేరు అమ్మగారూ?' అంటూ మొత్తుకుంది.

అందరూ ఆశ్చర్యపడేటంత నిబ్బరంతో అమ్మ మళ్ళీ మనిషయింది. ఆ ఏడాది మా పెద్దక్క రెండో కూతురి పెళ్ళి మా వూళ్ళో ఏర్పాటు చెయ్యడంతో మళ్ళీ మా యింటికి కళ వచ్చింది. అది మొదలు కనీసం రెండేళ్ళ కొకసారైనా మా యింట్లో ఏదో ఒక శుభ కార్యం జరిగేది. మా ఊరు ఆంధ్రదేశం మధ్యనుండడం చేత అందరూ రావడానికి అదో వీలుకూడా అయేది. కొంచెం దూరపు బంధువులయినా సరే. అడగడమే తడువు ఏ వేడుకకయినా మా ఇల్లు యిచ్చేది అమ్మ. ఇవ్వడమే కాదు, అన్ని పనులూ స్వయంగా పూనుకుని చేయించేది. పెళ్ళిళ్ళ ముహూర్తాలు కూడా సాధారణంగా వేసవికాలంలో పడేవి. మా పిల్లలు ఎవరికయినా శలవలు అప్పుడే కదా...'అమ్మమ్మ ఊరెడదాం, నాన్నమ్మ ఊరెడదాం' అని పిల్లలు గెంతులేసేవాళ్ళు. పోటీలుపడి పిల్లలందరూ ముసలమ్మ పక్కలో చేరేవారు. ఏ గుమ్మడి గింజలో ఒలుస్తూ అమ్మ కథలు చెప్పేది. చీమా చిలకా కథ, కాకీ పిచికా కథ, పిల్లీ ఎలకా కథ...ఇలా...ఇలా...ఎన్ని కథలో...చెప్పిన కథ చెప్పకుండా, చెప్పిన తీరులో చెప్పకుండా...

తరవాత్తరవాత మాకు తెలిసేది ... ఇంకా మేము కొన్నాళ్ళకి వస్తామనగానే అమ్మ తాపత్రయానికీ హడావిడికీ అంతు ఉండేదికాదు. ఓ కొడుక్కి తేగలు ఇష్టం. మరో కూతురికి తాటి ముంజెలు ప్రాణం... ఇంకో మనవడి ఊళ్లో లేత కొబ్బరికాయలు దొరకవు. మరొక మనవరాలి అత్తారింట్లో తాండ్ర అంటే ఏమిటో ఎరగదు. ఇంకో కోడలి ఊళ్ళో మంచి చెరుకులే అపురూపంట. ఏవరికేం కావాలో తెలిసిన అమ్మ ఉంది. ఆమెకి హృదయం ఉంది ఇంక ఎవరికేంలోటు?

ఇంక మావిడిపళ్ళ రకాలు...కావు చెల్లగా కావు... ఏరోజుకారోజ తీసి చూసి, పండినవన్నీ వేరే బుట్టలో పెట్టి.. అందులో కోత రకాలు కొన్ని, పిడుచుకు తినేవి కొన్ని...జీడి పిక్కలు కాల్పించేది. పనసపళ్ళు ఒలిపించేది ఊళ్ళకి తిరిగి వెళ్ళిపోతున్న వాళ్ళకి ఊరగాయలు .. పచ్చళ్ళు. చింతపండు అడలు, అప్పడాలు, ఒడియాలు, అరిసెలు చక్కిలాలు... అమ్మ అందజేసే మూటల జాబితా ఎన్ని తయారుచేసినా ఏదో ఒకటి మిగిలిపోతూనే ఉంటుంది. తిన్నంత తిని, పారబోసినంత పారబోసి, పట్టుకుపోగలిగినంత పట్టుకుపోయేటప్పుడు మా అమ్మ కడుపున పుట్టిన వాళ్లమే మళ్ళీ. మాలో కొందరు చేసే విమర్శలు ఇలా ఉండేవి:

“ఆ పట్నాల్లో ఓ రోజు తినీ, ఓ రోజు తినకా, నానా యాతనా అనుభవిస్తున్నాం. ఇంతగా ఒళ్లూపయీ తెలీకుండా రెండుచేతులా ఖర్చుచేసి తగలెయ్యకపోతే ఎవరిది వాళ్లకి పారెయ్య కూడదూ?”

'లంకంత కొంప...ఉండేది చూస్తే మళ్లీ ముగ్గురు మనుషులు... తనకో వాటా ఉంచుకుని మిగిలింది అద్దెకియ్యరాదుటమ్మా? మరీ ఇంత ఖర్చా ఎంతైనా!' 'అయినా ఆడదానికి పెత్తనం అప్పగించడమేమిటి. ముసలాయనికి మతిలేకపోతే!' 'ఎప్పుడో ఏ ఏడాదికో ఎవరో ఒకరు వస్తూ పోతూ ఉంటారని ఇంట్లో ఎప్పుడూ రెండు గేదెల పాడా? ఇల్లు గుల్లయిపోయిందంటే అయిపోదూ?'

'మా దగ్గరకివచ్చి ఉండకూడదూ, ఏం మేం వద్దన్నామా? ఓ కాలు కాటిలో ఉన్నా ఇంకా తనకిందే అందరూ అగ్గగ్గలాడాలంటే అదెలా కుదురుతుందీ?' ఇలాంటి సూటిపోటీమాటల్లో ఒకటయినా ఆవిడ చెవినపడలేదంటే అంతకంటె అసందర్భం ఉండదు. ఒకమాట అంటే పది జవాబు చెప్పేరకం మా అమ్మ. ఈగవాలితే జోడిచ్చి కొట్టే రకం మా అమ్మ. అలాంటిది వినీవిననట్టు ఎందుకూరుకుందో తెలీదు. ఆఖరి ఆ రెండేళ్లలోనూ ఆమెలో ఎందుకు ఆ మార్పు వచ్చిందో నాకిప్పటికీ అర్థంకాదు.

అంతేకాదు. అక్కడితో అలాసరిపెట్టి ఊరుకున్నా అదోమాట. అందరిచేతా 'ఓహో!' అనిపించుకోవాలనే ఆమెలోని తపన ఆ ఆఖరి కొద్దికాలంలో మరింత ప్రస్ఫుటం కాసాగింది. తెలిసిన వాళ్లకీ తెలియని వాళ్లకీ 'దోచిపెట్టే' ఆమె లక్షణం మరింతగా విజృంభించసాగింది.

'ఎవరే అదీ, బారిక సోముడి పెళ్లానివా నువ్వు ? దూరం, దూరం .. అలా మనిషి మీద కొస్తావేం, ఒళ్లెరగవూ ? ఏమిటీ, మీ అక్కకి పురుడొచ్చిందా, పాత బియ్యం కావాలా, మరి చెప్పవేం ఆ మాట ? ఇదిగో ఈ కుంచెడూ సరిపోతాయా ? అయిపోగానే రా, మళ్ళీ కొలుస్తాను. నా దగ్గిర భయమెందుకర్రా మీకు, వెర్రి పీనుగుల్లార !'

'బుచ్చెమ్మా, నిన్నా మొన్నా పుల్ల మజ్జిగ పట్టుకెళ్లడానికి వచ్చావు కాదుగదా అదంతా ఎవరి నెత్తి నేసుకు రుద్దుకోమన్నావు ?'

'ఏమిటీ చాకలి రామీ, ఏంకావాలి నీకు ? నీ మొగుడు పత్యానికా ? ఇంటో నిమ్మకాయ అయిపోయిందే ఏం చెయ్యనూ ? పోన్లే ఒలా చేస్తాను, ఇంకో గంట పోయాక రా... ఇంట్లో కరివేపాకు చెట్టుందిగా...వంట మనిషిచేత ఆట్టే కారం వెయ్యకుండా ఇంత పచ్చడి నూరిస్తాను... అవునుగాని వచ్చేటప్పుడు కొబ్బరి చిప్ప ఒకటి తెచ్చుకో. మళ్లీ ఏ గిన్నెలోనో పెట్టి సీకిస్తే తొలుచుకో లేక చావాలి

పిల్ల పెళ్లికి అంతలా బుర్ర బద్దలు కొట్టుకోడంఎందుకు శాస్త్రిల్లు గారూ! నేనింకా బతికే ఉన్నానుగా ... ఇంకా ఈ యిల్లంటూ ఉందిగా ... మట్టెలూ మంగళ సూత్రాలూ నేను చేయిస్తాను. మిగిలిన బాధేదో మీరు పడండి.'

'ఇంత జ్వరంతో నిన్నెవడు అంట్లు తోమడానికి రమ్మన్నారే అప్పలమ్మా ఆ మాత్రం బుద్ధిలేదూ, మళ్లీ ఎద్దులా ఉన్నావ్ ? అలా ఒదిలి పెట్టిపో .. పో పొమ్మంటే... సరే పొమ్మంటే పోవడమే కాబోలు, బలే చిక్కొచ్చిందే నీతో ! ఇంద ఈ రెండ్రూపాయలూ తీసికెళ్లి సూదిమందు వేయించుకో'

బాధకలిగించే విషయమేమిటంటే అమ్మలోని ఔదార్యాన్ని రక్తసంబంధీకులమైన మేమే ఏ ఒక్కరమూ హృదయ పూర్వకంగా అంగీకరించలేక పోయాము. విచ్చల విడిగా చేసే ఆమె ఖర్చూ, అర్థంలేని ఆమె మూఢాచారాలు మా మధ్య అడ్డంగా నిలిచాయను కుంటాను. పై కులం వాళ్లకి అమ్మ మా వంటింటో అన్నం వడ్డించడానికి ఒప్పుకునేది కాదు ఏ వరండాలోనో పెట్టించేది కాని దగ్గరుండి ఊరగాయ నుంచి పిండి వంట వరకూ అన్నీ తల్లిలా కనుక్కుని సకల అతిథి మర్యాదలూ చేసేది ! పిల్లల్ని నెత్తిమీద పెట్టుకుని లాలించేది, ఏ ఎండబెట్టిన మాగాయో ముట్టుకున్నారని చావగొట్టేది !

దూరాలు దగ్గర చెయ్యడానికి శబ్దాన్ని మించిన వేగంతో ప్రయాణించే సాధనాలు తయారవుతున్నాయి గ్రహాంతరయానాలు సహా సాధ్యమవుతున్నాయి. మనసునీ, మనసునీ దగ్గర చేసే మానవత్వం మాత్రం మనం పెంపొందించుకోలేమా ? మంచితోనే కాక బలహీనతలతో సహా తల్లినైనా మనం సహించలేమా !

రైలు ఎప్పుడో మా ఊరు దాటేసింది. నా మనసు మాత్రం ఇంకా అక్కడే ఉంది. లోకంలో చేదేకాక తీపి కూడా ఉందనడానికి ఎవరి అమ్మ వాళ్లకే సాక్ష్యం ★

ఉద్బోధ

పి. వి. ప్రసాదరావు

వేషమ్మం దలవాట్లయం దటుపయిన్ విశ్వాసమందున్, గడున్
భాషారీతి, మత ప్రసక్తి యెడ, శుంభద్భావనాదృష్టిలో
నీషణ్మాత్రము లేకపోయినను గానీ పోలికల్ దాన సం
తోషింపం హృది భారతీయ మొకడే దోచున్ విశేషమ్ముగా—

జాతి సర్వమ్ము బంధించు సర్వశక్తి
భారతీయతాతత్త్వైక ప్రాభవమ్ము-
ఆర్షసంస్కృతిదివ్యత్వ, మంతరించ
నంతవరకు లేదోయి- భయమ్ములేదు.

పూవు తావుల మైత్రిని బుద్ధి నిలిపి
ప్రకృతిపురుషుల సంబంధపటిమ నరసి
ప్రజ, ప్రభుత్వమ్ము కలసి మెలసి కరమ్ము
వ్యవహరించు టొక్కటియె గావలయు నేడు.

స్వప్రయోజనములకు దేశప్రయోజ
నమ్ముల సమాధి జేసెడి నైచ్యమెల్ల
తొలగి పోనిదె—లేదు లేదిలకు మిగుల
సంతసిలునట్టి ఏ భవిష్యత్తుగాని.

ప్రకటిత సాంఘికాభ్యుదయపర్వ ప్రభావ మనంత రీతులన్
ప్రకటన గావలెన్—బ్రతుకుబాట మరింత ప్రకాశమానమై
వికసితలీల వెల్లి, పృథివీస్థలి మంగళదివ్యతోరణ
ప్రకరమయూఖ సంతతికి, ప్రాణప్రతిష్ఠ నొనర్పగావలెన్.

ఆంధ్రప్రదేశ్‌లో మధ్యతరహా నీటి పారుదల పథకాలు

వ్యవసాయోత్పత్తిని అధికం చేయడానికి నీటిపారుదల వనరులను అభివృద్ధి పరచడం చాలా అవసరం. ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యావసాయక రాష్ట్రం. నూటికి 70 వంతుల జనాభా వ్యవసాయంపైననే ఆధారపడివున్నది. నీటివనరుల సహాయంతో ఇదివరటికన్నా యింకా యెక్కువ భూమిని సాగుచేయాలంటే నీటిపారుదల రంగంలో దీర్ఘకాలిక పథకాలను అమలుపరచవలసి వుంటుంది. భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులు, వ్యవసాయాభివృద్ధి విషయంలో చాలా కీలకపాత్ర వహిస్తాయి.

తృతీయ పంచవర్ష ప్రణాళికలో నాగార్జునసాగరు ప్రాజెక్టు మిగిలిపోయివున్న ప్రాజెక్టులతో కలుపుకొని 42 ఇతర పెద్ద ప్రాజెక్టులపైన పని జరిగింది. ఈ కాలంలో ఒక్క నాగార్జునసాగరు ప్రాజెక్టుపైన మాత్రమే రూ. 65 కోట్లు ఖర్చుపెట్టడం జరిగింది. ఇతర పెద్ద, మధ్యతరహా ప్రాజెక్టులపైన రూ 28 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. పెద్ద, మధ్యతరహా ప్రాజెక్టులక్రింద అదనంగా 3.75 లక్షల ఎకరాల భూమి సాగుచేయడానికి నీటిపారుదల సౌకర్యం కల్పించబడింది. వీటిక్రింద 2.54 లక్షల ఎకరాల భూమి సాగు అయింది.

ఆంధ్రప్రదేశ్‌లో మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టుల విషయమై ఇంతవరకు జరిగిన ప్రగతిని సమీక్షి చేద్దాం. చేపట్టిన 14 మధ్యతరహా ప్రాజెక్టులలో తృతీయ పంచవర్ష ప్రణాళిక అంతం నాటికి మూడు పథకాలు పూర్తి అయినాయి. అవి: తొర్రిగడ్డ పంపింగు స్కీం, రాజోలిబండ డైవర్షన్ స్కీం, మూసీప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుల విషయంలో మిగిలిపోయిన పనులు పూర్తిచేయడానికి భూమికి నష్టపరిహారం చెల్లించడానికిగాను 1970–71 సంవత్సరంలో రూ. 6 లక్షలు కేటాయించబడినాయి.

దిగువ పేర్కొన్న నాలుగు పథకాల విషయంలో హెడ్ వర్క్సు పూర్తి అయినాయి. వీటినుంచి సేద్యం కొరకు జలాలు కూడా విడుదల చేయడం జరిగింది. 1. పంపా రిజర్వాయరు, 2. నల్లవాగు ప్రాజెక్టు, 3. కోటిపల్లివాగు ప్రాజెక్టు, 4. లంకసాగరు ప్రాజెక్టు. ఈ నాలుగు ప్రాజెక్టుల విషయంలో మిగిలిపోయిన పనులను పూర్తిచేయడానికి 1970-71 సంవత్సరంలో రూ. 27 లక్షలు కేటాయించబడినాయి. మిగిలిన యేడు మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో వివిధ దశలలో పని జరుగుతూ వున్నది. వాటి వివరాలు ఇవి:

ఒట్టిగడ్డ ప్రాజెక్టు

శ్రీకాకుళం జిల్లాలో ఒట్టిగడ్డపైన ఒక జలాశయం నిర్మించి దానిక్రింద 16,670 ఎకరాల భూమి సాగుచేయడానికి ఈ పథకం తలపెట్టబడింది. ఈ పథకానికి రూ. 138.68 లక్షలు ఖర్చు అవుతుంది. ఇదివరకు నూటికి 86 వంతులు పనిపూర్తి అయింది. క్రెస్టు లెవెల్ వరకు స్పిల్‌వే పని పూర్తి అయింది. ఈ విషయంలో ఇంకా కొంత పని మిగిలిపోయింది. తూముల నిర్మాణం ఇంచుమించు పూర్తి అయింది. కుడికాలువ నిర్మాణంపని పంపిణీ కాలవలతోపాటు 1/4 మైలువరకు చురుకుగా కొనసాగుతున్నది. స్థానికంగా కూడా పనులు జరుగుతున్నాయి.

వరాహ రిజర్వాయరు

ఈ పథకానికి రూ. 111 91 లక్షలు ఖర్చు అవుతుంది. మట్టిడాము, ప్రధాన తూముల నిర్మాణం పని పూర్తి అయింది. 90 క్రాస్ డ్రైనేజి పనులలో 11 అయినాయి పూర్తి 3000 ఎకరాల భూమికి జలాలు విడుదల చేయాలని సంకల్పించబడింది. ఈ ప్రాజెక్టు క్రింద మొత్తం 8070 ఎకరాల భూమి సాగుఅవుతుంది.

తాండవ రిజర్వాయరు

సుమారు 45,900 ఎకరాలు సాగుకాగల ఈ పథకానికి రూ. 370.07 లక్షలు ఖర్చు అవుతుంది. ప్రధాన తూముల విషయంలో పనులు పూర్తి అయినాయి. 315 లెవల్ వరకు మట్టిడాము పూర్తి అయింది. కాలవల త్రవ్వకం పని చురుకుగా కొనసాగుతున్నది. ఎడమకాల్వ విషయంలో 8/1 మైలు వరకు త్రవ్వకం పని కొనసాగుతున్నది. కుడికాలువ విషయమై పరిశీలనా కార్యక్రమం కొనసాగుతున్నది.

గుంటూరు కాలవ

ఈ పథకానికి రూ. 170 లక్షలు ఖర్చు అవుతుంది. దీని క్రింద సుమారు 27,000 ఎకరాలు సాగు అవుతాయి. హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం దాదాపు పూర్తి అయింది. కవాటాల నిర్మాణం మాత్రం మిగిలిపోయింది. చివరి రెగ్యులేటర్‌కు షట్టర్లు అమర్చవలసివుంది. 46 క్రాస్ డ్రైనేజి పనులలో 17 పూర్తి

అయినాయి. మరొక 17 డ్రైనేజి పనులు కొనసాగుతున్నాయి. 22 రోడ్డు వంతెనలకుగాను 17 వంతెనల నిర్మాణం పూర్తి అయింది మరొక 3 వంతెనల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి 38 పంపిణీ కాలవలకు గాను 19 పంపిణీ కాలవల విషయంలో అలైన్‌మెంటు పనులు పూర్తి అయినాయి.

కనుపూరు కాలవ పథకం

ఈ పథకానికి రూ. 213.21 లక్షలు ఖర్చు కాగలదు. దీని క్రింద సుమారు 17,000 ఎకరాల భూమి సాగు అవుతుంది. ప్రధాన కాలవ త్రవ్వకం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి 56 క్రాసు మేసనరీ పనులకుగాను 26 పూర్తి అయినాయి. మరొక 9 పనులు కొనసాగుతున్నాయి.

స్వర్ణ ప్రాజెక్టు

ఈ పథకానికి రు. 115.61 లక్షలు ఖర్చు అవుతుంది. దీనిక్రింద సుమారు 7,000 ఎకరాల భూమి సాగుఅవుతుంది. 1969 డిశంబరు వరకు 60 శాతం రాతికట్టడం పనులు, 52 శాతం వరకు మట్టి డాము పనులు పూర్తి అయినాయి. మహారాష్ట్ర ప్రభుత్వంవారు వారి రాష్ట్రంలో మునిగిపోయే భూముల విషయంలో కొన్ని అభ్యంతరాలు చెప్పినందున, పని ముందుకు జరుగలేదు. అయితే 1970 వరకు పనిని పూర్తి చేసి ఆయకట్టులో కొంత ప్రాంతానికి ఉపకరించే విధంగా కాలవలోకి జలాలు విడుదల చేయాలని తలపెట్టబడింది 1969_70 లో ఈ ప్రాజెక్టు కొరకు రు. 5 లక్షల కేటాయించబడినాయి. ఈ పథకంవల్ల ఆశించిన లాభంచేకూర్చే ఉద్దేశంతో ఇదే సంవత్సరంలో మరొక రూ. 5 లక్షలు కేటాయించడం కూడా జరిగింది. 1970_71 సంవత్సరంలో ఈ పథకంపైన రూ. 8 లక్షలు ఖర్చు పెట్టబడుతుంది.

బాహుదా రిజర్వాయరు

ఈ పథకానికి రూ. 44.83 లక్షల ఖర్చు అవుతుంది. దీని క్రింద సుమారు 2880 ఎకరాలు సాగుఅవుతాయి. రెగ్యులేటరు తూముల నిర్మాణం పూర్తి అయింది. అయితే షట్టర్లు అమర్చవలసిన పని మిగిలిపోయింది. మంగలమర్రి ఆనకట్ట కూడా పూర్తి అయింది. చింతపర్తి ఆనకట్ట పూర్తి కావస్తున్నది. ఎడమవైపున 4 మైళ్ల 6 ఫర్లాంగుల కాలవకుగాను 2 మైళ్ల 7 ఫర్లాంగుల వరకు పనిపూర్తి అయింది. 1970_71 లో పనిలో ఎక్కువ భాగాన్ని పూర్తి చేసి ప్రాక్షకంగా జలాలు విడుదలచేయాలని ఒక కార్యక్రమం రూపొందించబడింది. 1969_70 లో ఈ ప్రాజెక్టు కొరకు రూ. 5 లక్షలు కేటాయించబడినాయి. ఇదే సంవత్సరంలో అదనంగా మరొక రూ. 5 లక్షలు కేటాయించబడినాయి. 1970_71 లో రూ. 10 లక్షలు కేటాయించాలని ప్రతిపాదించబడింది.

కొత్త పథకాలు

దిగువ పేర్కొన్న మధ్యతరహా ప్రాజెక్టులను పులివెందల కాలవ, గాజులదిన్నె ప్రాజెక్టు, గండిపాలెం ప్రాజెక్టు, రామకృష్ణపురం ఆనకట్టు, ఉకచెట్టివాగు ప్రాజెక్టు నిర్మించాలని సంకల్పించబడింది.

పులివెందల కాలవ పథకం

ఈ పథకానికి రూ 294 లక్షలు ఖర్చు అవుతాయి. దీని క్రింద సుమారు 55,000 ఎకరాల భూమి సాగు అవుతుంది. ఈ ప్రాజెక్టు మంజూరీకై కేంద్ర జల విద్యుచ్ఛక్తి సంఘానికి నివేదిక పంపబడింది. అడ్వాన్సు అభివృద్ధిపన్నులో మొదటికిస్తు వసూలైన తరువాత పని ఆరంభం కాగలదని ఆశింపబడుతున్నది.

గాజులదిన్నె ప్రాజెక్టు

ఈ పథకానికి రూ. 96.36 లక్షలు ఖర్చు అవుతుంది. దీని క్రింద 12,500 ఎకరాలు సాగు అవుతాయి. ఈ ప్రాజెక్టును గురించి సమగ్ర పరిశీలన పూర్తి అయింది రూ. 251 లక్షల ఖర్చుతో ప్రాజెక్టును నిర్మించి, దీనిక్రింద 25,000 ఎకరాల భూమిని సాగు చేయడానికి రూపొందించిన పథకం ఇప్పుడు ప్రభుత్వ పరిశీలనలో వున్నది. 1969_70 లో రూ. 3 లక్షలు కేటాయించబడినాయి. ప్రాథమిక పనులుకూడా ఆరంభమైనాయి. 1970_71 సంవత్సరంలో ఈ పథకం కొరకు రూ. 10 లక్షలు కేటాయించాలని ప్రతిపాదించబడింది.


గండిపాలెం ప్రాజెక్టు

ఈ పథకానికి రూ. 97 లక్షలు ఖర్చు అవుతుంది దీనిక్రింద సుమారు 10,000 ఎకరాల భూమి సాగు అవుతుంది. ఈ పథకం విషయమై ఇంకా సమగ్ర పరిశీలన జరగవలసివుంది. సమగ్ర పరిశీలన ముగిసిన తరువాత 1970_71 సంవత్సరంలో ఈ పథకాన్ని చేపట్టేందుకు రూ. 5 లక్షలు కేటాయించాలని ప్రతిపాదించబడింది.

రామకృష్ణాపురం ఆనకట్టు

ఈ పథకానికి రూ. 60 లక్షలు ఖర్చు అవుతుంది. దీనిక్రింద 6 700 ఎకరాలు సాగు అవుతాయి. ప్లానులు, అంచెనాలు తయారు చేయబడుతున్నాయి. ప్రాథమిక పనులు ఆరంభమైనాయి. ఈ పథకం కొరకు 1970_71 సంవత్సరంలో రూ. 5 లక్షలు కేటాయించబడినాయి.

సీరియల్



త్యాగరాజు సంగీత సాధన జీవనది ప్రవాహంలా సాగిపోతున్నది. వర్ణములు, పురందరదాసు కీర్తనలు, రామదాసు కీర్తనలు, అష్టపదులు మొదలగునవి శీఘ్ర కాలములోనే నేర్చుకొన్నాడు. త్యాగరాజు తనను మించిన వాడౌతాడని మహదానందం జెందాడు తండ్రి.

రామబ్రహ్మం ఆరోగ్యం సన్నగిల్లుతున్నది. తండ్రిని చూడ నుద్యుక్తుడై యింటికి పయనమయ్యాడు. త్యాగరాజుకు కల్యాణం చేయవలెననే తండ్రి ఆలోచనకు తల ఒగ్గాడు. గురువుగారి ఆశీర్వచనం పొంది యిల్లు చేరాడు.

తల్లి దండ్రులు నిర్ణయించిన పార్వతి అనే కన్యను వివాహ మాడాడు.

అదివరకే పంచాప కేశుడు (జపేశయ్య) వివాహమయింది. రెండవ సోదరుడు రామనాథం గతించాడు.

వివాహం నాటికి త్యాగరాజు వయస్సు పదునెనిమిది వత్సరాలు

కుటుంబ భారము

రామబ్రహ్మం దివంగతుడైనాడు. సీతమ్మ సహగమనం చేస్తానని పట్టుబట్టింది. కుమారుని మంచి చెడ్డలు నీవే చూడాలి. పంచాపకేశయ్య త్యాగరాజుని సక్రమంగా చూస్తాడనే నమ్మకం లేదు. కాబట్టి అతని భారం నీవు వహింపక తప్పదు అని హితవు చెప్పారు పెద్దలు.

తండ్రి కర్మ క్రతువులు యథావిధంగా పూర్తి చేశారు.

పంచాపకేశుని యిక జపేశయ్య అనే పిలుద్దాము. జపేశయ్య తెచ్చే జీతం యింటి ఖర్చులకు చాలదు. త్యాగరాజు కూడా కుటుంబ భారాన్ని ఆదుకోవలసి వచ్చింది. పంతులుగారి వద్ద సంగీతాభ్యాసానికి అడ్డు యేర్పడింది. లాభం లేదనుకొని యేకలవ్యునివలె గురువుగారి చిత్రం ముందిడుకొని ధ్యానించుచూ సంగీత సాధన ప్రారంభించాడు. అంతేగాక దైవంమీద భారంవేసి కుటుంబ పోషణ కూడా చేయడానికి పూనుకొన్నాడు.

కాని ఎట్లా? ఒకరివద్ద ఉద్యోగము చేయడం యిష్టం లేదు. నలుగురికీ సంగీతం నేర్పి ప్రతిఫలం పొందుదామన్నా అంతటి పాండిత్యం రాలేదు. ఒకవేళ వున్నా శిష్యులవద్ద తీసుకోవడానికి మనస్కరించలేదు. దూరమాలోచించి ఉంఛ వృత్తిని స్వీకరించాడు త్యాగరాజు.

కర్మసాక్షి మేల్కొనే ముందుగానే లేచి కావేరిలో స్నానమాచరించి సూర్య భగవానునికి అంజలి ఘటించి వేదాధ్యయనం చేస్తూ యింటికి చేరి గాయత్రి జపమాచరించి రామునికి పూజసల్పి భిక్షకై బయలుదేరే వాడు.

త్యాగరాజు కంఠం ప్రతి యొక్కరిని ఆకర్షించేది. త్యాగరాజు దివ్యనామ సంకీర్తనలన్నీ రాముని పరంగా వుండేవి. శ్రీరాముడు తన యిష్టదైవం. కులదైవం కూడాను.

దీన జనావన శ్రీరామ – దానవహరణ శ్రీరామ
వీన విమాన శ్రీరామ – మీన శరీర శ్రీరామ
నిర్మల హృదయ శ్రీరామ – కార్ముక బాణ శ్రీరామ
దశముఖ మర్దన శ్రీరామ – దశరథ నందన శ్రీరామ
భాగవత ప్రియ శ్రీరామ – ఆగమమూల శ్రీరామ
నాగ సుశయన శ్రీరామ – త్యాగ రాజార్చిత శ్రీరామ

(పై దివ్యనామ సంకీర్తన రాగం భూపాలం – ప్రాతఃకాలమున పాడే రాగము.)

త్యాగరాజు యిలా గానం చేస్తూ వీధి వీధి తిరిగి, లభించిన వస్తు సముదాయముతో యింటి భారాన్ని అన్నతో బాటు పంచుకొనే వారు. అన్న జపేశయ్యకు యిష్టం లేకపోయినా యేమి చేయలేక వూరకుండేవారు.

త్యాగరాజు భార్య వివాహ మయిన కొద్దికాలానికే దివంగతురాలు కావడంతో, యింకా యవ్వన దశలో వున్న త్యాగరాజు మరొక వివాహం చేసుకోక తప్పింది గాదు. పెద్దల మాట ప్రకారం పార్వతమ్మ చెల్లెలయిన కమలాంబను భార్యగా స్వీకరించాడు.

త్యాగరాజు గానం దిన దిన ప్రవర్ధమాన మౌతూ వచ్చింది. ఒక రిద్దరు శిష్యులు చేరారు కూడా.

స్వరార్ణవము

భిక్షకు పోయినపుడు, దైవారాధన, సంగీత సాధన, శిష్యులకు సంగీతం నేర్పుట దప్ప అన్య విషయాలు పట్టించుకొనేవాడు కాదు. ఇంటి పనులన్నీ జపేశయ్యే చూచుకొనేవాడు ననుకొంటూనే.

సంగీతానికి అంతమెక్కడిది. వినీలాకాశానికి ఆది, అంతము యెవరు చెప్పగలరు. సంగీతానికి ఆది తెలిసినా, అంత మెక్కడో? అనంత వాహినిలో గ్రుక్కెడు తియ్యటి నీటిని త్రాగిన వానికి తృప్తి యెక్కడిది? సంగీతసాగర సామీప్యానికి యింకా చేరుకోలేదని ఒక వంక మదన పడేవాడు పంతులుగారివద్దకు పోలేని కుటుంబస్థితి శ్రీరామునిపై భారంవేసి పెద్దల కచేరీలు యెప్పుడయినా జరిగితే రసాస్వాదితుడై సంగీతసాధన చేసుకొనేవాడు.

ఒకనాడు త్యాగరాజు పాడుతున్న దివ్యనామ సంకీర్తన విని మహదానందంజెంది అతని పాండిత్యానికి మెరుగులు దిద్దవలెనని త్యాగరాజుయింటికి వేంచేశారు రామకృష్ణానందస్వామి.

త్యాగరాజు స్వామికి పాదపూజగావించాడు. కమలాంబ భర్తననుసరించింది. సకలోపచారములు జేసి తన జన్మ ధన్యమయ్యే మార్గం జూపమని ప్రార్థించాడు.

స్వామి త్యాగరాజు సద్భక్తికి మెచ్చుకొన్నారు. త్యాగరాజుని తోడ్కొని పంచనదీశ్వర ఆలయానికి బయలుదేరారు. భగవంతునికి నమస్కారం చేయమన్నారు. తాను శిరస్సు వంచి నమస్కరిస్తూ, త్యాగరాజు స్వామి చెప్పినట్లు కండ్లు మూసుకొని పంచనదీశ్వరుణ్ణి ధ్యానించసాగాడు. రామకృష్ణానంద స్వామి త్యాగరాజు చెవిలో నారదోపాస్తి మంత్రముపదేశించి ఓ పవిత్ర తాళపత్ర గ్రంధాన్ని త్యాగరాజు హస్తాలలోవుంచి, యీ గ్రంధం ఆమూలాగ్రం పఠించి నీ జీవితం ధన్యం చేసుకో—అంటూ అంతర్ధానమయ్యారు.

కొలది సేపటికి కండ్లు తెరిచి చూచేటప్పటికి స్వామి కనిపించలేదు. చేతిలో గ్రంధం కనిపించింది. నారదోపాస్తి మంత్రం కర్ణపుటంచులలో మ్రోగింది. ఆత్రుతతో గ్రంధాన్ని విప్పి పరికించాడు.

ఆ గ్రంధం సామాన్యమైనది గాదు
సంగీత ప్రబంధము
సామాన్యులకు లభించేది కాదా గ్రంధము
కారణ జన్ములకు లభించే గ్రంథము.

అలనాడు కాళీమాత దాసుని జిహ్వాపై బీజాక్షరాలు వ్రాసినట్లే యీనాడు స్వామి త్యాగరాజు జిహ్వాపై సంగీత స్వర రహస్యాక్షరిని వ్రాసినట్లయింది. వచ్చిన వారు రామకృష్ణానందస్వామి గాదని, నారద మహర్షియని, మౌని రూపంలోవచ్చి తనకీభాగ్యం లభింప జేశారనీ, అసలు రామకృష్ణానంద స్వామియే నారదుడని తలంచి నారద మౌనికి భక్తితో నమస్కరించాడు.

ప్రాతఃకాలమున ఆరుగంటల నుంచి తొమ్మిది గంటలలోపు పాడదగ్గ భైరవి రాగంలో " రాజిల్లు వీణ కల్గు గురురాజా " యని నారదమౌనిని ప్రథమంగా స్తోత్రం చేశాడు

నారదా! మహతి పవిత్రమయినది నీ విపంచిక ఆ విపంచికతో ముజ్జగాల సంతుష్టపరచిన మహాత్ముడవు నీ దర్శనముతో నా జన్మ ధన్యమయింది ఇది నా పూర్వజన్మ సుకృతము. ఈ శిష్యుడు నీకు మనసా వాచా నమస్కరిస్తున్నాడు

తనివి తీరలేదు త్యాగరాజుకు. విజయశ్రీ రాగంలో " వర నారద నారాయణ స్మరణానందానుభవముగల " అనే కృతిని గానం చేశాడు.

నారదా! నీ సేవాభాగ్యం నాకు లభించింది నా అజ్ఞానాన్ని తొలగించావు. జ్ఞానము నొసంగువాడు నారదుడు (నృణాల సంబంధి-నారం: మనుజుల విశేషగుణము జ్ఞానము, తందదాతి = ఇచ్చువాడు, అనగా జ్ఞానము నొసంగువాడు) రామనామశబ్దాన్ని మానవులకందించి అందుగల మాధుర్యమును చవిజూపిన వాడవు సకలలోక సద్గుణశాలివి నన్ను నీ శిష్యుణ్ణిగా స్వీకరించి నన్ను కరుణించావు అని ప్రస్తుతించాడు.

అంబను కూడా స్మరించాడు. తల్లీ నిన్నే నమ్ముకొన్నాను. నీవు కృష్ణసోదరివి. పంచమస్వరములో పలికే కోయిల ధ్వనిమించు స్వరమధురిమవు. సంగీతము నీ సొత్తు. గీర్వాణివి, ప్రణయ స్వరూపిణివి నాకు సంగీత భిక్షనొసంగు.

శ్రీకృష్ణా! నీవు సకలకళా కోవిదుడవు. నీ వేణుగానముతో ముల్లోకాలను మురిపించావు. ధీరత్వానికి, ప్రేమకు నీకు నీ మురళియే ఆయుధము. ఆ ఆయుధాన్ని నాపై ప్రయోగించు. నీవద్దను నీ అష్టమహిషుల వద్దను సంగీతం నేర్చుకొనిన నారద మహర్షి నాకు స్వరార్ణవ గ్రంధం బహూకరించారు నీ గీతార్ధమునే సంగీతార్ధంగా పలువురికి పంచేటట్లు నాపై కరుణ జూపు.

చివరగా యిష్టదైవం రాముని ప్రస్తుతించాడు. రామా! నీవు సకల జనుల రక్షకుడవు. నీవు లేనినాడు పంచభూతములు లేవు. నీవు లేనినాడు త్యాగరాజు గానమేలేదు.

నారదుడు నన్ను కరుణించాడు నారదుని తల్లి సరస్వతిని, సంగీత గురువు శ్రీకృష్ణుని నన్ను దయజూడమని కోరినాను. మూలపురుషుడవు. మాయమర్మములు లేనివాడవు ఒకేమాటకు బద్ధుడైన వాడవు నిన్ను సంకీర్తనంజేసి పారవశ్యంచెంది నాదబ్రహ్మానుభవం సంపాదించి ముక్తికాంతను పొందదలంచన్న నాకు కావలసినదేమున్నది. సకల ప్రపంచమూ నీవుగానే కనబడుతావు సజ్జన సాంగత్యము సకల కళోపాసనల నిశ్చలదైవప్రస్తుతి ద్వారానే లభిస్తాయి. కాన నన్ను ఆదరించి సంగీత సాధనలో నన్ను కృతార్థుణ్ణి చేయి—అని రాముని ధ్యానించాడు.

ఇంటికి వెళ్ళి తన తల్లి కీవార్తను తెలుపుదామని బయిలు దేరాడు.

నిద్ర లేచేప్పటికి భర్త మంచంమీద లేకపోవడం జూచి ఆశ్చర్యపడింది కమలాంబ. అంతలో వచ్చాడు త్యాగరాజు. కావేరి జలంతో గాదు, నీలమణివలె ప్రకాశిస్తున్న స్వరార్ణవంతో.

భర్త ముఖంలో తానెన్నడూ చూడని తేజస్సును జూచింది. లోనికి వెళ్ళి కాళ్ళు కడుక్కోడానికి నీరు తెచ్చింది.

కాళ్ళు కడుక్కొని పూజామందిరం కేసి వెళ్తూ అమ్మా అని పిలిచాడు. సీతమ్మ యేమిటి నాయనా అంటూ త్యాగరాజు వద్దకు వచ్చింది. త్యాగరాజు చేతిలో గ్రంథంతో ప్రకాశిస్తుండటం జూచింది. సీతమ్మ పాదాలకు నమస్కరించాడు. "అమ్మా! నారద మౌని నన్ను కరుణించారు స్వరార్ణవమనెడి సకల రహస్య సంగీత ప్రబంధాన్ని నాకు యిచ్చారు. నా జన్మ తరింపజేశారు. ఈ గ్రంథం ఆమూలాగ్రం చదివి అందలి విశేషాలను అవగతం జేసుకొనే శక్తి నాకు లభించేట్లు నీ చల్లటి చేతులతో నన్నాశీర్వదించు" అని తల్లిని కోరాడు

సీతమ్మ ఆనందాశ్రువులు త్యాగరాజు శిరస్సుపై బడ్డవి త్యాగరాజు దేహం పులకరించింది. ఇందుకేనేమో నే జీవించి యున్నది అంటూ త్యాగరాజు ఫాలభాగాన్ని ముద్దిడు కొన్నది.

ఆ దృశ్యం చూచిన కమలాంబ తన్మయత్వం చెందింది.

తనభర్తతోబాటు తన జన్మకూడా సార్ధకమైనదని తలంచింది. అత్తగారికి పాదాభివందన మొనర్చింది. భర్త పాదాలనుకూడా స్పృజించింది. సీతమ్మ కుమారుని, కోడలిని మనసారా కౌగలించుకొంది. తనుమెట్టిన గడప తనకింత ఖ్యాతి కలుగజేసిందని సంతసించినా, తన అక్కకా భాగ్యం కలుగనందుకు కొద్దిగా చింతించింది.

కమలాంబ పూలతో చక్కగా అలంకరించింది శ్రీరామ పంచాయితన విగ్రహాలను పవమానసుతుడు భక్తితో నమస్కరిస్తున్నాడు శ్రీరాముని పాదాల వద్దకూర్చొని.

గ్రంధాన్ని శ్రీరాముని పాదాలవద్ద వుంచాడు. నిశ్చలమైన మనస్సుతో ధ్యానించసాగాడు

ఈ వార్త చల్లగా ప్రజలకందించారుశిష్యులు. త్యాగరాజు యింటిముందు యిసుకవేస్తే రాలనంత జనం ప్రోగయ్యారు. పండితులు, శౌత్రులు పూజామందిరంలోకి వచ్చారు. స్వరార్ణవ గ్రంధానికి త్యాగరాజు పూజప్రారంభించగానే వేద పఠనం, మంత్రోచ్చారణలతో త్యాగరాజు యిల్లు మార్మోగింది.

మరోవైపు సంగీత విద్వాంసులు రామగానం చేయడం మొదలుపెట్టారు. నాదస్వరం వీనుల విందుగా వాయించాడు మరో విద్వాంసుడు. త్యాగరాజు యిల్లు రామనామోచ్చారణతో నిండిపోయింది.

స్వరార్ణవ గ్రంధానికి పూజ పూర్తిజేశాడు. తన వీణనందుకొన్నాడు. ఎక్కడివారక్కడ నిస్తబ్ధులైనారు. నిశ్శబ్దంతో నిండిపోయింది యిల్లంతా.

శ్రీ వినాయకుని ప్రథమంగా కీర్తించాడు. "సకల జనులు శ్రీ గణపతిని సేవించను రండి. బ్రహ్మ పూజల నందుకొనిన మహానుభావుడు గణపతి. ఆయన రీవి, నడక, వర్తన అన్నీ కళలే. సుఫలముల భుజించి మంజీర ధ్వనులు వినుపించుచుండగా తండ్రిని ధ్యానించి, హృదయములో ఆ మూర్తిని నిలుపుకొని నృత్యము చేయుచున్న శ్రీ విఘ్నేశ్వరుని సేవించండి. ఈ త్యాగరాజు కూడా వినాయకుని హృదయ పూర్వకంగా స్తుతిస్తూ ఆశీర్వదించమని కోరుతున్నాడు" (శ్రీ గణపతిని సేవించరారె శ్రిత మానవులారా - సౌరాష్ట్ర రాగం) అని హృద్యమంగా వీణ వాయిస్తూ గానం చేశాడు. తరువాత బిలహరి రాగాలాపన చేశాడు. (బిలహరి రాగం ఉదయం 6 గంటలనుండి 9 గంటల వరకు పాడదగిన ముఖ్యరాగాల్లో ఒకటి) భక్తి పారవశ్యంతో అవధులు లేని ఆనందాన్ని పంచిపెట్టాడు వింటున్న వారికి త్యాగరాజు.

రామా! నీవుదప్ప నన్నెవరు కాపాడుతారు నా కోరికలు తీర్చి, నన్ను కరుణించే తల్లివి. తండ్రివి నీవే. రామతారక మంత్రము లభించుట నా పుణ్యం గాదు. నా తల్లిదండ్రులు చేసిన పుణ్యము, మా పెద్దలార్జించిన ధనమూ నీనామ సంకీర్తనే. గంగానది పుణ్య తీర్థాది స్నానఫలము నీనామ సంకీర్తనతోనే. లభిస్తుంది. నేనింతకుదప్ప అన్యం కోరను.

(నీవేగాని నన్నెవరు గాతురురా నీరజదళనయనా-బిలహరిరాగం-)

త్యాగరాజు స్వరార్ణవమునకు, శ్రీరామ పంచాయతన విగ్రహములకు హారతి యిచ్చి, ప్రసాదాన్ని వచ్చిన సద్భక్తులకు, పండితులకు, తదితరులందరికి పెట్టి సంతుష్టాంతరంగుడయ్యాడు.

త్యాగరాజు కుటుంబానికి మరువనిదినమది.

(సశేషం)

నల్గొండ జిల్లాలో
సన్నకారు రైతుల ప్రయోగాత్మక పథకం

నల్గొండ జిల్లాలో రు. 7.65 కోట్ల ఖర్చుతో సన్నకారు రైతుల అభివృద్ధికి సంబంధించిన ప్రయోగాత్మక పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ మొత్తంలో రు. 1.5 కోట్లను కేంద్రప్రభుత్వం అందజేస్తుంది. మిగతా మొత్తాన్ని సహకార సంఘాలు వాణిజ్య బ్యాంకులు దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక ఋణాల రూపంలో అందజేస్తాయి. 1970–71 సంవత్సరం నుండి నాలుగు సంవత్సరాలలో దశలవారీగా యీ పథకాన్ని అమలు జరుపుతారు.

ఆర్థికంగా వెనుకబడిన సన్నకారు రైతులు, యీ పథకం ద్వారా అదనపు ఋణాలు, సాంకేతిక సహాయం స్వీకరించి తద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరిస్తూ ఆర్థికంగా పుంజుకోవడానికి దోహదం కలుగుతుంది. జిల్లా కలెక్టరు అధ్యక్షతన చిన్న రైతుల అభివృద్ధి ఏజన్సి, నల్గొండ అనే పేరుతో ఒక సంస్థ, సంఘాల రిజిస్ట్రేషను చట్టం క్రింద నమోదు చేయబడుతున్నది. ఈ పథకాల అమలుకు ఇది బాధ్యత వహిస్తుంది. ఈ పథకం రామన్నపేట, నల్గొండ, సూర్యాపేట తాలుకాలలో అమలు పరచబడుతుంది. రెండు నుంచి పది ఎకరాల ఖుష్కీ భూమి, 2 నుంచి 5 ఎకరాలవరకు తరి భూమిగల రైతులు ఈ వర్గం క్రిందికి వస్తారు. వీరికి ఈ పథకం క్రింద సహాయం లభిస్తుంది. ఈ ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు 50,000 మంది చిన్న రైతులకు దీనివల్ల లాభం చేకూరుతుంది. చిన్నకారు రైతుల సంక్షేమం కొరకు సమీకృతమైన ఆర్థికాభివృద్ధి ప్రణాళిక ఒకటి రూపొందించబడింది. వ్యవసాయాభివృద్ధి, బావుల త్రవ్వకం, స్టోరేజి సౌకర్యాలు, మార్కెటింగు, నీటిపారుదల సౌకర్యాలు, పశుగణాభివృద్ధి, కోళ్ళ పరిశ్రమ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి మున్నగు విషయాలపై శ్రద్ధవహించబడుతుంది.

పరపతి సౌకర్యాలు

ఈ ప్రాజెక్టు ప్రాంతంలో రైతులకు స్వల్ప మధ్య, దీర్ఘకాలిక రుణాల క్రింద సుమారు 6.53 కోట్లు అవసరమవుతాయని అంచనా వేయబడింది. సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకులు ఈ డబ్బును సమకూర్చుతాయి.

నీటిపారుదల

వ్యవసాయానికి నీటిపారుదల చాల ముఖ్యం. చిన్న రైతుల ఆర్థిక ప్రగతికి ఇది చాలకీలకపాత్ర వహిస్తుంది. భూగర్భజల సంపదను వినియోగించే దృష్టితో రూ. 40 లక్షల ఖర్చుతో నాల్గేండ్ల కాలంలో క్రొత్తగా 1300 బావులు త్రవ్వించాలని ప్రతిపాదించబడింది. కొత్తబావుల త్రవ్వకానికి రైతులకు సబ్సిడీ క్రింద 25 శాతం ఖర్చు ఇవ్వబడుతుంది. రూ. 60 లక్షల ఖర్చుతో 3000 బావులను లోతుగా త్రవ్వించడానికి కూడా ప్రతిపాదించబడింది. ప్రాజెక్టు ప్రాంతంలోని సన్నకారు రైతులకు 4,000 ఎలెక్ట్రిక్ మోటార్లు, ఆయిల్ ఇంజనులు సరఫరాచేయడానికి ప్రాజెక్టు నివేదికలో రూ. 1.2 కోట్లు ప్రత్యేకించబడినాయి. మొత్తంమీద అదనంగా 15,000 ఎకరాలు సాగు అవుతాయి. దీనివల్ల రూ. 2.50 లక్షల పెట్టుబడి పైన చిన్నరైతులకు సాలీనా అదనంగా రూ. 5 లక్షల ఆదాయం వస్తుంది.

మిస్ట్ బౌలర్స్

మొక్కల రక్షణ కార్యక్రమం క్రింద ప్రాజెక్టు ప్రాంతంలోని ప్రతిపంచాయతీకి చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ 50 శాతం సబ్సిడీ పైన మిస్ట్ బౌలర్స్‌ను సర్ఫరా చేస్తుంది ఈ ప్రాజెక్టు ప్రాంతంలో 335 పంచాయతీలు వున్నాయి. వీటిల్లో ప్రతి ఒకదానికీ ఒక మిస్ట్ బౌలరు, చేతితో నడిపే స్ప్రేయరు సరఫరా చేయబడుతాయి.

పశుగణాభివృద్ధి

చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ ప్రాజెక్టు ప్రాంతం మధ్యలో నెలకొని వున్న చిట్యాల గ్రామానికి సమీకృత పాల ప్రాజెక్టు పథకం విస్తరించబడుతుంది. నల్గొండ, రామన్నపేట తాలుకాలలో చాలాభాగం ఈపథకం క్రిందికి వస్తాయి. చిట్యాలలో పాలశీతల కేంద్రం ఒకటి నెలకొల్పబడుతుంది. రామన్నపేట, మునుగోడు, నల్గొండ బ్లాకులలోని అనేక గ్రామాలకు ఈపథకం వర్తింపచేయబడుతుంది. రైతులకు రూ. 30 లక్షల ఖర్చుతో 2,000 పాడిపశువులు సరఫరా చేయబడుతాయి. పశుగ్రాసం అభివృద్ధిని కూడా ప్రోత్సాహపరచేందుకు సంకల్పించబడింది. వాణిజ్య పద్ధతిపైన పశుగ్రాసం ఉత్పత్తి చేయదలచుకొన్న చిన్న రైతులకు ప్రత్యేక రుణాలు ఇవ్వబడుతాయి.

కోళ్ల పరిశ్రమ

చిన్న రైతుల ఆదాయం పెంచడానికి వీలుగా ప్రాజెక్టు నివేదికలో కోళ్ళు, బాతుల పరిశ్రమ కూడా చేర్చబడింది. హైదరాబాదు, బొంబాయి కలకత్తా, బెంగుళూరు నగరాలలో గుడ్లకు, కోళ్ళకు మంచి మార్కెటు వుంది. ఎన్నుకోబడిన గ్రామాలలో సుమారు వెయ్యిమంది రైతులకు గ్రామీణ కోళ్ల

పరిశ్రమ కార్యక్రమం క్రింద ఒక్కొక్కరికి రూ. 500 ల రుణం ఇవ్వాలని ప్రతిపాదించింది. బాతు పరిశ్రమను లాభసాటిగా నిర్వహించడానికి మంచి అవకాశాలు వున్నందువల్ల 1000 మంది రైతులకు మొత్తం రూ. 10 లక్షల మేరకు రుణాలు ఇవ్వబడుతాయి.

గ్రామీణ గోదాములు

శాస్త్రీయ పద్ధతులలో స్టోరేజి సౌకర్యాలు, మార్కెటింగు సౌకర్యాలు కల్పించడానికి ప్రాజెక్టు ప్రాంతంలో 10 గ్రామీణ గోదాములను నిర్మించడానికి నిధులు కేటాయించబడినాయి. ఆహార ధాన్యాలు నిలవచేయడానికి 25 శాతం సబ్సిడీపైన 1000 పుస్సాబిన్స్ కూడా సరఫరా చేయబడుతాయి. చిన్న రైతుల స్టోరేజి సమస్యలు తీర్చడానికి ఇవి చాలా ఉపకరిస్తాయి. అంతేకాకుండా వీటివల్ల ఆహార ధాన్యాలు ఎలుకలు, పందికొక్కులవల్ల నష్టపోకుండా వుండడానికి వీలు కలుగుతుంది.

యాంత్రిక సేద్యం

యంత్రాల సహాయంతో సేద్యం చేయడం చిన్న రైతుల శక్తిస్తోమతులకు మించిన భారం కనుక భూములను చదును చేయడం, సేద్యంచేయడానికి పాత బావులను ఉద్ధరించడం, క్రొత్తగా బోరింగు బావులు త్రవ్వడం మున్నగువాటికి అవసరమైన యంత్రములు, ట్రాక్టర్లు సరఫరా చేయబడుతాయి. అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషనువారు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీటికొరకు రూ. 5 లక్షలు ప్రత్యేకించబడినాయి.

స్వాతంత్ర్య యోధుడు

కీ. శే. మొసలికంటి తిరుమలరావు



శ్రీ ఎం. తిరుమలరావు, 1970 నవంబరు 29 వ తేదీన దివంగతులు కావడంతో దేశం ఒక గొప్ప పార్లమెంటేరియన్ను, ప్రముఖ రాజకీయవేత్తను కోల్పోయింది. తన నాల్గు దశాబ్దాల ప్రజాజీవితంలో ఆయన అనేక ఉన్నత పదవులను నిర్వహించారు.

పార్లమెంటులో అందరి ఆదరాభిమానాలను అందుకున్న శ్రీ మొసలికంటి తిరుమలరావు 1901 జనవరి 29 వ తేదీన తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురంలో జన్మించారు. 1921 లో చదువుకు స్వస్తి చెప్పి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య పోరాటం కాలంలో 1922, 1930, 1932, 1940, 1942 లలో జైలు శిక్షలు అనుభవించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో శ్రీ టంగుటూరి ప్రకాశం, డా. పట్టాభిసీతారామయ్య, శ్రీ వి. వి. గిరి వంటి అగ్రనాయకులతో కలిసి పనిచేశారు.

1937–1940 మధ్యకాలంలో శ్రీ రావు, కేంద్ర శాసనసభ సభ్యులుగాను, 1945 నుండి 1947 వరకు కౌన్సిల్ ఆఫ్ సేట్స్ సభ్యులుగాను, వ్యవహరించారు. 1948–50 లో రాజ్యాంగసభ సభ్యులుగా ఉన్నారు. 1957 నుండి 67 వరకు లోక్‌సభ సభ్యులుగా ఉన్నారు. 1967 లో కాకినాడ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నుకోబడినారు.

శ్రీ తిరుమలరావు 1950 నుండి 52 వరకు కేంద్ర ప్రభుత్వ ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖల డిప్యూటీ మంత్రిగాను, 1956 లో వింధ్యప్రదేశ్ లెఫ్టినెంట్ గవర్నరుగాను వ్యవహరించారు. 1950 లో ఆహారధాన్యాల విచారణ సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. 1957 లో ఆరోగ్య సర్వేసంఘం, ఆహారధాన్యాల విచారణ సంఘం సభ్యులుగా ఉన్నారు. విదేశ వ్యవహారాలు, ఆహార, వ్యవసాయం, రవాణా, షిప్పింగ్, ఉక్కు, గనుల స్థాయీ సంఘాల సభ్యులుగా కూడా పనిచేశారు.

శ్రీ రావు, 1961–66 వరకు ప్రణాళికా ప్రాజెక్టులు, ప్రణాళికా సంఘం చిన్నతరహా నీటి పారుదల బృందానికి నాయకత్వం వహించారు. ప్రస్తుత లోక్‌సభ స్థాయీ సంఘం అధ్యక్షులుగా కూడ వ్యవహరించారు. ఆయన కొంతకాలంపాటు మద్రాసు నుండి వెలువడే ఇంగ్లీషు దినపత్రిక సంపాదకత్వం వహించారు. మెహర్‌బాబా రచించిన 'గాడ్‌స్పీక్స్' గ్రంథాన్ని ఆయన తెలుగులోకి అనువదించారు. పార్లమెంటరీ ప్రతినిధి వర్గాల సభ్యులుగా ఆయన అనేక విదేశాలను సందర్శించారు. ★

నా జీవితానుభవాలు

చెప్పినది: **కోలవెన్ను రామకోటేశ్వరరావు**

వ్రాసినది: **అక్కిరాజు రమాపతిరావు**

మా స్వగ్రామం కోలవెన్ను. అటు తరువాత బందరు దగ్గర మొలవర్రుకు చేరుకున్నాము. మా తాతగారు బందరులో షావుకార్ల దగ్గర లెక్కా డొక్కా వ్రాసిపెట్టి జీవయాత్ర సాగిస్తుండేవారు. వారి హయాంలో మొట్ట మొదట మా కుటుంబం అతి మామూలు మధ్య తరగతి కుటుంబమే. మా నాన్నగారు బందరులో హైస్కూలు చదువు పూర్తిచేసుకుని, నోబుల్ కాలేజీలో ఎఫ్. ఏ. చదవాలని చేరారు. కాని చదువూ, సంసారమూ రెండూ ఏక కాలమందే నిర్వహించుకొనటంలో కష్టం తోచి, చదువుకు స్వస్తి చెప్పి, గుంటూరుకు చేరుకుని గవర్నమెంటు హైస్కూలులో ఉపాధ్యాయుడిగా ప్రవేశించారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మా తండ్రిగారు ప్రైవేటుగా సెకండ్ గ్రేడ్ పరీక్ష ప్యాసై ప్లీడరు పట్టా పుచ్చుకున్నారు. కాని గుంటూర్లో ప్రాక్టీస్ ప్రారంభించ లేదు. అప్పటికే బాగా పేరు ప్రఖ్యాతులు పొందిన పెద్ద పెద్ద న్యాయవాదులు అక్కడ చాలామంది వున్నారు.

ఆ కాలంలో పల్నాడు తాలూకా కారంపూడిలో డిస్ట్రిక్ట్ మునిసిఫ్ కోర్టు వుండేది. అందువల్ల గుంటూరులో కాకుండా, కారంపూడిలో మా నాన్నగారు ప్రాక్టీస్ ప్రారంభించారు. 1905 వ సంవత్సరం దాకా గుంటూరు జిల్లా, కృష్ణాజిల్లాలో అంతర్భాగంగానే వుండేది కాని, వేరుగా రూపొందలేదు. కాబట్టి మా నాన్నగారు కృష్ణా జిల్లా కారంపూడిలో మున్సిఫ్ కోర్టులో, న్యాయవాద వృత్తిని ప్రారంభించారన్న మాట.

1894 వ సంవత్సరం అక్టోబర్ 22 వ తేదీన, నేను నరసారావుపేటలో జన్మించాను. అంటే అప్పటికే మేము కారంపూడినుంచి నరసారావుపేట వచ్చాము. అప్పటికే డిస్ట్రిక్ట్ మున్సిఫ్‌కోర్టు నరసారావుపేట చేరింది. మా నాన్నగారు ప్రాక్టీస్ ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే పేరు ప్రఖ్యాతులున్న గొప్ప ప్లీడరుగా రాణించారు. మధ్య తరగతి కుటుంబాలలో సంపన్నమైన కుటుంబంగా మాకు కుదురు ఏర్పడింది. నాకన్నా పద్నాలుగేళ్ళు పెద్దవాడైన అన్నగారు నాకుండేవారు. ఆయన పేరు శ్రీరామ గోపాలకృష్ణారావు. మా అన్నగారు సెకండ్‌గ్రేడ్ పరీక్ష ప్యాసై 1902 లో ప్లీడరీ పట్టా పుచ్చుకుని నాన్నగారికి సాయంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. ఆరోజుల్లో మా అన్నగారూ నాన్నగారూ కలిసి కోర్టుకు వెళ్లుతుంటే, అందరూ మా నాన్నగారి అదృష్టాన్ని అభినందిస్తూ వుండేవాళ్ళట. 'వియ్యన్న పంతులుగారు అదృష్టవంతులు, కొడుకు చేతి కందివచ్చాడని' అనే వాళ్ళట. కాని మా కుటుంబం దురదృష్టంవల్ల, మా అన్నగారు, రెండు సంవత్సరాలైనా ప్రాక్టీస్ చేశారో లేదో 1904 వ సంవత్సరంలో అకాల మృత్యువు వాతపడ్డారు. మా కుటుంబాని కిది పిడుగుపాటే అయిపోయింది. మా నాన్నగారు పూర్తిగా కుంగిపోయినారు. చాలా రోజులవరకూ ఈ దెబ్బనుండి మేము కోలుకోలేక పోయాము

మా అన్నగారి అకాలమరణంతో నన్ను మా ఇంట్లో అతి గారాబం చేసేవాళ్ళు. నేను స్కూలుకు వెళ్ళుతున్నాకూడా, మా అమ్మగారు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ, వెళ్ళవద్దనేది. ఆమెకు నేనెప్పుడూ కళ్ళముందు కనపడుతూ వుండాలి. నేనెక్కడకు వెళ్ళేందుకూ ఆమె యిష్టపడేది కాదు.

చదువు సంధ్యలు నేర్చి ప్రయోజకుడై ఎదిగి చేతికందిన కొడుకు ఇట్లా అకాలమృత్యువు వాత పడటంతో ఇంటిల్లిపాదినీ వొక విరక్తి, మహా దుఃఖమూ ఆవహించుకొని వుండేవి. చదువులో కాని, సంపాదనలోకాని, ఇంకా ఏ యితర విషయాల్లో కాని, ఇంట్లో ఎవరికీ ఆసక్తి వుండేది కాదు. చిన్నతనంలో అంతా కాలుకింద పెడితే కందిపోతానేమో అన్నంత గారాబంగా పెరిగాను, పెరిగి పెద్దయిన తరువాత కూడా, నాపనులు ఎవరైనా చేసిపెడితే బాగుండునన్న దృక్పథం. బహుశా చిన్ననాడే నాలో అలవడి వుంటుందను కుంటాను. చిన్నతనాన చాలా సుకుమారంగా పెరిగాను. అవే అభిరుచులు, అలవాట్లు, పెద్దయిన తర్వాత కూడా విడిచి పెట్టుకోలేక పోయాను.

నా ఎలిమెంటరీ స్కూలు చదువు ఒకటో తరగతిలో చేరటంతో ప్రారంభమైంది.

ఆ బళ్లో కోట సుబ్బారావుగారూ, అన్నంభొట్ల విశ్వనాథం గారూ ఉపాధ్యాయులుగా వుండేవాళ్ళు. చదువు బాగానే చెప్పినా, శిక్షణ కఠినంగా వుండేది. అప్పుడు మా నరసారావుపేటలో లోవర్ సెకండరీ స్కూలు మాత్రమే వుండేది. లోవర్ సెకండరీ పరీక్ష కాగానే గుంటూరు వెళ్ళి హైస్కూల్లో చదుకోవాల్సి వచ్చేది. తరవాత తరవాత డిస్ట్రిక్టు బోర్డు రాజకీయాల్లో బాగా పేరు ప్రఖ్యాతులు పొంది, మంచి వ్యవహర్తగా చెలామణి అయిన గాదె సింహాచలం పంతులుగారు ఆరు, ఏడు, ఎనిమిది తరగతులలో నాకు సహాధ్యాయిగా వుండేవారు.

మానాన్నగారు శుచి శుభ్రతల్లోనూ, హుందాగా వుండడంలోనూ, అమితమైన శ్రద్ధాసక్తులూ, పట్టుదలా కనపరచేవారు. ఆయన గారిది పరమార్ద్రమైన, సుకుమారమైన మనస్తత్వం. చిన్నపిల్లల పట్ల అమితమైన ప్రేమాదరాలు చూపేవారు. నేను ఎప్పుడూ కూడా శుచిగా, శుభ్రంగా, తల చెరగకుండా, బట్ట నలగకుండా కనపడాలని మానాన్నగారు కోరుతుండేవారు.

ఆ రోజుల్లో క్లబ్బులో అప్పుడప్పుడు టీ పార్టీలు జరుగుతుండేవి. మా నాన్నగారితో పాటు నేను కూడా అప్పుడప్పుడు క్లబ్బువిందులకు హాజరవుతుండేవాణ్ణి. మానాన్నగారి ఆర్ద్రస్వభావం గురించి నాకొకటి జ్ఞాపకం వస్తున్నది. క్లబ్బులో ఏదో ఉపన్యాసమో, ఉత్సవమో పురస్కరించుకొని, పెద్దల సమావేశమూ, అటు తరువాత టీ పార్టీ జరిగినప్పుడు, పెద్దలతో వచ్చిన చిన్న పిల్లలందరికీ, వాళ్ళు పార్టీలో పాల్గొని తినుబండారాలు తిన్నప్పటికీ, మళ్ళీ ఇళ్ళకు వెళ్ళేప్పుడు, ముందే కట్టించి వుంచిన పొట్లాలను, చిన్న పిల్లలందరికి మా నాన్నగారు ఇచ్చేవారు. అట్లా యిస్తేగాని ఆయనగారికి తృప్తి కలిగేది కాదు. ఆ కాలంలో మీటింగులు తరుచూ జరుగుతూవుండేవి. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ కూడా యీ మీటింగులు జరుగుతుండేవి. అంటే ఇంగ్లీషు ప్రసంగాలూ, తెలుగు ప్రసంగాలూ అన్నమాట. తెలుగు మీటింగులు విధిగా టీపార్టీతో ముగిసేవి. ఇంగ్లీషు మీటింగులట్లాకాదు. అందువల్ల మీటింగుల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు, నేను ఇంగ్లీషు మీటింగా, తెలుగు మీటింగా అని పెద్దవాళ్ళను అడుగుతూ వుండేవాణ్ణి. ఇంగ్లీషు మీటింగైనా తెలుగు మీటింగైనా, చాలా ఉత్సాహంతోను. ఆసక్తితోను వెళుతూవుండేవాణ్ణి.

నాకు 7. 8, సంవత్సరాల వయస్సున మా ఊరికి జయంతి రామయ్య పంతులుగారు డిప్యూటీ కలెక్టరుగా వచ్చారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తును స్థాపించి, గ్రాంథిక భాషోద్యమానికి నాయకత్వం వహించి చెన్నపట్నంలో ప్రెసిడెన్సీ మేజస్ట్రేట్ పదవి నిర్వహించి, రామయ్య పంతులుగారు తిరువాత చాలా ప్రసిద్ధి పొందారు. రామయ్య పంతులుగారు వచ్చిన కాలానికి మా ఊళ్ళో డిస్ట్రిక్ట్ మునిసిఫ్‌గా గొల్లకోట గంగాధర సోమయాజులుగారుండేవారు. రామయ్య పంతులుగారూ, సోమయాజులు గారూ, ఇంకా ఊళ్ళోని సంపన్నులూ, ఇతర అధికారులూ, పేరుప్రఖ్యాతులున్న వకీళ్ళూ నాన్నగారికి మిత్రులై, వారిపట్ల గౌరవాదరాలు చూపుతుండేవారు.

జయంతి రామయ్య పంతులుగారు మా ఇంటికి వచ్చి "ఏమయ్యా ఇవాళ తెలుగు మీటింగు వుంది. సిద్ధంకా" అని నవ్వుతూ హెచ్చరించేవారు. మా ఇంటి వెనకాలనే డిస్ట్రిక్టు మున్సిఫ్‌గారు కాపురం వుండేవారు. ఏ మున్సిఫ్ వచ్చినా ఆనవాయితీగా, అలవాటుగా, ఆ ఇంట్లోనే కాపురం వుండేవారు. గంగాధర సోమయాజులుగారి కుంటుబానికీ, మా కుటుంబానికీ, సన్నిహిత మైత్రి వుండేది సోమయాజులుగారి కూతురు సీతమ్మ, మా అక్కయ్యకీ నాకూ, ఆటపాటలలో స్నేహంగా వుండేది. ఒక చిన్న విషయం ఇక్కడ జ్ఞాపకం వస్తున్నది గంగాధర సోమయాజులుగారికి మా ఊరి నుంచి బదిలీ అయి వెళ్ళిపోయిన తరవాత, కొద్ది రోజులకు మా అక్కయ్య పేరున సీతమ్మ వొక జాబు వ్రాసింది. ఆ జాబులో మా ఆటపాటల ప్రస్తావన తరవాత, మా ఊళ్ళో, తాము బదిలీ అయిపోక ముందు తాను వేసిన బంతి చెట్లు ఎట్లా వున్నాయనీ, పూలు పూస్తున్నాయా అనీ, ఆ పూల మొక్కలను గూర్చి ఆమె ఎంతో ఆసక్తిగా వాకబుచేసింది. ఆమె యీ మృదువైన భావ సౌకుమార్యం ఆనాడే నా మనస్సును ఎంతగానో స్పందింప చేసింది. ఈ భావన ఎంతో మధురంగానూ, ముగ్ధంగానూ, నా మనస్సును ప్రభావితం చేసింది. అనంతరకాలంలో కూడా ప్రతి చిన్న మృదుభావనకూ అమితంగా స్పందించి పోవటమూ, మనస్సు ఊరికే అర్ద్రమై పోవటమూ జరిగేది. చిన్న తనములోనే, నా ఈ స్వభావానికి ఆలంబనమైన కొన్ని సన్నివేశాలూ, వాతావరణమూ చోటుచేసుకొని వుండి వుంటాయని ఇప్పుడు నా కనిపిస్తున్నది.

మానాన్నగారికి నాటకాలన్నా, నటులన్నా చాలా ఆసక్తి వుండేది. ఆ రోజుల్లో గుంటూరులో వెలసిన ఫస్ట్ కంపెనీ తాలూకు ప్రసిద్ధులైన నటులంతా మా నాన్నగారికి మిత్రులే. తరుచు ఆ నటకులు గుంటూరునుంచి మా వూరు వచ్చి మా ఇంటనే బసచేస్తుండేవాళ్ళు. మానాన్నగారూ అప్పుడప్పుడు నాటకాలు చూడటానికి గుంటూరు వెళుతుండేవారు. అప్పుడు నాన్నగారితో నేనూ గుంటూరు వెళుతుండే వాణ్ణి.

కారంపూడిలో నాన్నగారు ప్లీడరుగా ప్రాక్టీస్ చేస్తూ వున్నప్పుడు, బెల్లంకొండ లక్ష్మీనారాయణగారని, నాన్నగారిదగ్గర వొక గుమాస్తా వుండేవారు. నాన్నగారు కారంపూడి వదలి నరసరావుపేట రాగానే, లక్ష్మీనారాయణగారు కూడా కుటుంబంతోపాటుగా నరసారావుపేట తరలి వచ్చారు. బెల్లంకొండ సుబ్బారావుగారు, ఈ లక్ష్మీనారాయణగారి కొమారులే. పాండవోద్యోగ నాటకాలలో కృష్ణపాత్రధారిగా, ఆంధ్రదేశమంతా అఖండ ఖ్యాతి నార్జించుకున్నారు సుబ్బారావుగారు. ఆరోజుల్లో "అదుగో ద్వారక," "అలుగుటయే యెరుంగని," "అయినను పోయిరావలయు," మొదలైన పద్యాలన్నీ సుబ్బారావుగారి ద్వారా ఎంత ప్రచారాన్ని పొందాయో ఆంధ్ర దేశానికి తెలుసు.

నా చిన్నతనంలో మాఊళ్ళోకూడా నాటక ప్రదర్శనలు జరుగుతూ వుండేవి. మాఊరు జమీందారీ గ్రామం. మా ఊరి జమీందార్లకు రాజాగార్లన్న వ్యవహారం వుండేది. పూర్వకాలపు పద్ధతిలో, ఆ ఫక్కీలో, వొంటి స్తంభం మేడలూ, కోటలూ, శిథిలావశేషాలుగా ఇప్పటికీ మిగిలి వున్నాయి. ఇప్పటికీ కోటబజారనీ, రాజాగారి కోట అనీ, ఆ ప్రాంతాలకు మా ఊళ్ళో వాడుక వుంది. నా చిన్నతనంలో రాజాగారి కోటకు దగ్గర సువిశాలమైన ఆవరణంలో పందిళ్ళూ, పాకలూ వేసి, నాటకాలు ప్రదర్శిస్తూ వుండేవారు. ఈ నాటకాలకు నేను యథేచ్ఛగా వెళ్ళటానికి వీలుండేది కాదు. కొన్ని కట్టుబాట్లుండేవి. అప్పటి జమీందారైన మల్రాజు నరసింహారాయణింగారూ, వారి జనక సోదరులైన సింగయ్యారావుగారూ నాన్నగారికి ఆప్తమిత్రులు. ప్రతిరోజూ, సాయంకాలం గుర్రపు

కోచీమీద మా యింటికి వచ్చేవారు. తరవాత రైల్వే స్టేషన్‌దాకా షికారు వెళ్ళేవారు. నేను ఏ రోజైనా నాటకం చూడాలంటే, జమీందారుగారు, మా యింటికివచ్చి, షికారు వెళ్ళి, మళ్ళీ తిరిగి వచ్చేసరికి, నేను భోజనమూ అదీ చేసి, నీటుగా ముస్తాబయివుంటే, వాళ్ళు రెండు గంటలు కూచుని కబుర్లు చెప్పుకుని, ఆ తరవాత నన్ను కోచీలో ఎక్కించుకొని కోటకు తీసుకొని వెళ్ళేవాళ్ళు. ప్రత్యేకంగా వారికై ఏర్పరచిన సీట్లలో వారిసరసనే కూచుని, నాటకాన్ని చూసి, ఆ రాత్రి వాళ్ళ భవనంలోనే విశ్రమించి, పొద్దున్న వాళ్ళు మనిషినిచ్చి పంపితే, యిల్లుచేరేవాణ్ణి.

ఈ విధంగా చిన్నతనంలో మేముకూడా జమిందార్ల సమాన స్థాయిలో తులతూగుతున్నామనీ, జమీందార్లకన్నా తక్కువ కామనీ, వొక ఆధిక్యతా భావం నా మనస్సులో మెదులుతూ వుండేది. అదీ కాక, సహ వయస్కులై నాతో చదువుకునే పిల్లలు, ఎవరి ఇంట్లోనో వుండి, ఎవరి పుస్తకాలో బ్రతిమిలాడి చదువుకుంటూ వుంటే, నేను వీళ్ళందరికన్నా అధికుణ్ణనీ, సంపన్నుడననీ వొక భావం మనస్సుని గాఢంగాపట్టి వుండవచ్చును. చిన్నతనపు ఈ భావంవల్ల, తరవాత జీవితంలో యితరులతో కలివిడిగా వుండలేకపోవడం, ఘనంగా ప్రత్యేకంగా వుందామనుకోవటం నాకలవడి వుంటాయి. చిన్నతనంలో నాస్నేహితుల, ఇరుగు పొరుగు కుటుంబాల, బంధువుల, యిళ్ళలోకన్నా ప్రత్యేకమైన హోదాఏదో మా కుటుంబం అనుభవిస్తున్నట్లు నాకనిపించేది. కాబట్టి, నా వ్యక్తిత్వం తరవాత తరవాత యీవిధంగా రూపు దిద్దుకుని వుండవచ్చు.

ఆ రోజుల్లో గుంటూరో చాలా పెద్ద లాయర్లుగా పేరు ప్రతిష్టలుపొందిన పత్రి శ్రీనివాసరావుగారు, కొండా వెంకటప్పయ్య పంతులుగారు, మా ఊరు వస్తూ మా ఇంట్లో బస చేస్తూ వుండేవారు. ఈ విధంగా మధ్య తరగతి కుటుంబాలలో చాలా పై ఎత్తున మేమున్నా మన్న వొకా నొక అమాయకమైన భావన, చిన్నతనాన నన్ను గాఢంగా పట్టుకొన్నది ఒక ప్రత్యేకత, ఒక గొప్పతనం. అందువలన అనవసరంగా నాకు నేను ఆ చిన్నతనంలోనే ఆపాదించుకొన్నాను. ఆ తరువాత జీవితంలోనూ, అది నిలుపుకొనే ప్రయత్నమే అవిదితంగానో, ప్రయత్న పూర్వకంగానో, నన్ను విడిచి పెట్టలేదు.

నా చిన్నతనంలో నటులందరూ మా ఇంటికే వచ్చి మా నాన్నగారితో స్నేహం పాటిస్తూ వుండేవారు కదా. అందులో ఇవటూరు వియ్యన్నగారు ముఖ్యులు. తరవాత కాలంలో అర్జునుడు మొదలైన పాత్రలు ధరించి మా ప్రాంతాలలో చాలా ప్రసిద్ధులైన చోరగుడి దాశరథి గారికి యీ వియ్యన్నగారు బావగారు. ఈ వియ్యన్నగారు మున్సిఫ్ కచేరిలో అమీనాగా చిన్న ఉద్యోగమే చేస్తున్నా మంచి వ్యవహార జ్ఞానం కలవారు. ఇంటి ప్లాను గీయడం దగ్గరుండి కట్టించటం నేర్పుగా చేస్తుండేవారు. మా ఇంటి ప్లాను కూడ వీరే గీశారు. మా ఊళ్ళో మా నాన్నగారిని పెద్ద వియ్యన్న పంతులుగారనీ ఇవటూరి వియ్యన్నగారిని చిన్న వియ్యన్న పంతులు గారనీ వ్యవహరించేవాళ్ళు. గుంటూరు నుంచి వచ్చిన కోపల్లె హనుమంతరావు (ఈయనగారు నటుడు) హరిప్రసాదరావు మొదలగు వాళ్ళు మా ఊళ్ళో నాటకాలాడేవారు కోపల్లె హనుమంతరావు గారు దమయంతి వేషం వేసే వారు. హరిప్రసాదరావుగారు నటుడు. ప్రసాదరావుగారి రాజఠీవి చాలా ఆకర్షణీయంగా వుండేది. నాటకం చాలా రక్తి కట్టేటట్లుగా ప్రదర్శించేవారు. ఈ నాటకం ఆ రోజుల్లో చాలా ప్రసిద్ధిని పొందింది. మా నాన్న గారు చాలా గొప్ప పద్ధతులు అలవడిన వారు. నేను వారితో మాత్రమే నాటకాలు చూడాలి. ఎప్పుడూ నీటుగా వుండాలి. ఎవరి పుస్తకాలూ తీసుకోకూడదు.

ఏం కావాల్సివచ్చినా అది కొనుక్కోవాలి కాని, యితరుల వస్తువు అడిగి తీసుకుని పనిగడుపుకో కూడదు. బట్టలు కుట్టించుకోవాలంటే, బట్టలకొట్లనుంచి తానులు తానులు ఇంటికి తెచ్చి చూపించే ఏర్పాటు. అందులోంచి ఎన్నిక, బజారుకు వెళ్ళడం, వెచ్చాల ధరలు తెలుసుకోవడం, ఏ వస్తువైనా బేరమాడడం బయట ప్రపంచంలో మధ్యతరగతి కుటుంబాల జీవన సరళి, తాపత్రయాలు, ఆసక్తులు ఏమీ తెలియకుండా పెరిగి పెద్దవాణ్ణైనాను. కనుక పెద్దయిన తరవాత నాకది ఒక అసౌకర్యంగా పరిణమించింది.

నాటకాలప్రదర్శనకు సంబంధించిన వొకచిన్న విషయం జ్ఞాపకం వస్తున్నది, ఆ రోజుల్లో చిత్రనళీయం బాగా ప్రసిద్ధికెక్కిన నాటకం. దాన్ని ఆడుతూ వుండేవారు. దమయంతి పినతల్లి ఇంట్లో సైరంధ్రీ వృత్తిలో చేరింది. ఆమెకు వొకరోజున ఎడమ కన్ను అదరడం లాంటి శుభశకునాలు అనుభూతమవుతవి. స్థలచలనం, శుభావాప్తి మొదలైనవి ఆ శకునానికి సూచనలు సద్యః ఫలితాలు. ఆమెవిరక్తితో నాకు స్థలచలన మేమిటి, శుభోదర్కమేదటని పెదవి విరుస్తూ అనుకుంటుంది. ఒకవేళ తాను చేయవలసిం పనిలో దుఃఖోద్వేగంవల్ల ఏమరు పాటుకలిగితే అప్పుడు స్థలచలనః ఎలాగూ తప్పదు, పనిలోంచి నిర్దయగా వెళ్ళగొట్టేస్తారు, యజమానులు. అని వెక్కసంగా తన అదృష్టాన్ని నిందించుకునే ఘట్టంవుంది చిత్రనళీయం నాటకంలో. "తీయవలసిన గంధమ్మె తీయకున్న, పురము వెడలించుటది తిరమ్మె..." మొదలైన భావంతో ఆమె పద్యం చదువుతుంది. గంధమాల్యాను లేపనాదులను సమకూర్చే దుస్థితికి ఆమె దిగజారింది. నాటకంవాళ్ళు మా ఇంటో మంచి గంధం చెక్కకాస్తా తీసుకొనిపోయి. గంధం తీసితీసి ఆ చెక్కకాస్తా ఎక్కడో పారేశారు. వీళ్ళ నాటకం కాదుకాని, బంగారంలాంటి మాగంధం చెక్క, అశ్రద్ధగా, నిర్లక్ష్యంగా, అరగ తీశారో, పట్టుకుపోయారో, పారేశారో, అని మావాళ్ళు అనుకోవటం నాకిప్పుడు గుర్తొస్తున్నది.

చిన్నతనంలోనే పాఠ్య పుస్తకాలు కాక, ఇతర పుసకాలు చదవాలన్న ఆసక్తి, అభిలాషా నాకు ఎక్కువగా వుండేవి. ముఖ్యంగా ఇంగ్లీషు పుస్తకాలు చాలా ఆసక్తిగా చదివేవాణ్ణి, ఆటల్లో అంతగా ఆసక్తి వుండేదికాదు. ఇంగ్లీషు, తెలుగు, హిష్టరీ అభిమాన విషయాలు. మంచి మార్కులే వచ్చేవి. లెక్కలు గండకత్తెర. బొటాబొటీ మార్కులతో పాసయ్యేవాణ్ణి. లెక్కలంటే భయంగా వుండేది. ఈసప్స్ ఫేబిల్స్, సాన్ ఫర్ట్ అండ్‌మర్టన్, రాబిన్సన్ క్రూసో, గలివర్స్‌ట్రావెల్సు, ఆ రోజుల్లో నన్నాకర్షించి నేను ఆసక్తితో చదివిన గ్రంథాలు.

తెలుగు పుస్తకాలు ఎక్కువగా చదివేవాణ్ణి కాను. కాని, ఎవరన్నా చదువుతుంటే చాలా ఆసక్తితో వినేవాణ్ణి. డిస్ట్రిక్ట్ మున్సిఫ్ గంగాధరసోమయాజులుగారి ఇల్లాలు, బాగా చదువూ విజ్ఞానమూ కల దొడ్డ ఇల్లాలు. అప్పుడప్పుడు తీరికవేళల్లో ఇరుగు పొరుగు వారిని సమావేశపరచి భారత భాగవతాదులు ఆమె చదివి వినిపిస్తూ వుండేవారు. మాఅమ్మగారితో ఆ పురాణ కాలక్షేపాలకు నేనూ హాజరయ్యే వాణ్ణి. నాకిప్పటికీ జ్ఞాపకమే. ఆమెగారు నల చరిత్ర చదువుతూవుంటే, ఆ కథాఘట్టాలు వ్యాఖ్యానిస్తుంటే, ఆ నలదమయంతుల కష్టాలు భరించలేక నేను ఏడుస్తూవుండే వాణ్ణి. ఆమె గారూ, ఇంకా అక్కడ చేరిన వాళ్ళూ నన్ను విచిత్రంగా చూస్తుండే వాళ్ళు. నాసున్నితమైన మనస్సుని చూసి ఆశ్చర్యపడే వాళ్ళు. చిన్నతనం నుంచీ నాలోని యీ మన స్సౌకుమార్యం నన్ను బలహీనుణ్ణి చేసిందేమోనని అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది.

చిన్నతనంలో తలంటిపోసుకోవడమంటే చెప్పలేని విసుగు, తలనొప్పి అనిపించేది నాకు. తలంటుకోవడం, వొంటికి నూనె పట్టించుకోవడం. నలుగుపెట్టుకోవడం ఇట్లా యీకార్యక్రమం చాలా విసుగనిపించేది. మాఅమ్మగారు గొప్పగా చదువుకున్నది కాకపోయినా మంచి వినుకలి. అంటే శ్రుత పాండిత్యం కలిగిన దొడ్డ ఇల్లాలు. బందరు దగ్గర కంకటావ అనే పల్లెటూరి కరణం గారి బిడ్డ అమె. మా మాతామహులది మంచి సంస్కారం, చదువు సంధ్యలు గల కుటుంబం, ఈ సంస్కారం మాతల్లిగారికక్కడ అలవడి వుంటుంది. నాకు తలంటుపోయడానికి మాఅమ్మగారు వొక సౌలభ్యం కనిపెట్టారు. నెమ్మదిగా ఏ భారతం కథనో ప్రారంభించి, వొక్కొక్క ఘట్టాన్ని ఆసక్తిని, ఉత్కంఠను పెంపొందిస్తూ, తలంటి పోసేవారు. నాచిన్నతనమంతా గారాబంగా గడచిపోయింది.

మాఇంట్లో మానాన్నగారి వేపు బంధువొకామె వుండేవారు. ఆమె నిష్ఠగా సదాచారంగా ఎప్పుడూ పూజా పురస్కారాలు నిర్వహిస్తూ వుండేది. పూలన్నీ మాలలు కట్టటం, గంధాక్షతలతో పూజలు చేయటం, ఆమె నిత్య కృత్యం. ఒకరోజున ఆమెపూజ చేస్తున్నప్పుడు నేనక్కడ వుండటంచూసి. "ఇదుగోబాబూ ఇన్ని పూలూ, పత్రీ. భక్తిశ్రద్ధా కలిగి పూజలుచేస్తున్నానుకదా నాకు పుణ్యం వస్తుందా" అని నన్నడిగారామె. ఒక్కక్షణం ఆలోచనలో పడి నేను నీపుణ్యం సంగతి నాకుతెలియదుకాని, నాకు పరమాన్నం మాత్రం తప్పకుండా వస్తుందని చెప్పాను. నా ఆసక్తి ప్రసాదగతంగావుండేదన్నమాట.

మంచి మార్కులలో పరీక్షలు ప్యాసు కావటమే నాబాధ్యత అని కర్తవ్యపాలన అనీ, అప్పటి నాభావన. నాజీవితం, ఆదర్శాలు నిర్వహించ వలసినపనులు అన్నీ పెద్దలచే ముందే నిర్ణయమై వున్నాయనీ. ఆమార్గంలో చిత్తశుద్ధితో ఏకాగ్రతతో ముందంజ వేయటమే నాబాధ్యత. ఇతర విషయాలు నాకు సంబంధం లేనివనీ, ఒక భావన అంతరాంతరాలలో, మెదిలి కదిబలపడుతూ వుండేది. పెద్దయిన తరువాత కూడా నాటి భావనల ప్రాబల్యం, ప్రభావం నన్నువిడిచి పెట్టలేదు.

అప్పటికే గోపాల కృష్ణగోఖలే, సురేంద్ర నాథ బెనర్జీల భావాలూ, ఉపన్యాసాలూ, దేశాన్ని బాగాప్రభావితం చేశాయి. రాజకీయ చైతన్యం దేశంలో బాగా వ్యాప్తిని పొందింది. ఏమిటి నా కర్తవ్యం అని ప్రశ్నించుకుంటే, పరీక్షలు ప్యాసు కావటం ప్లీడరీ చదవటం గవర్నమెంటు ఉద్యోగం చేయకపోవటం స్వతంత్ర వృత్తినవలంబించి దేశసేవ-ఇవన్నీ మెట్లుగా కనపడేవి బాగా డబ్బు సంపాదించాలని కానీ కీర్తి ప్రతిష్టలు సంపాదించాలని కానీ విశేషమైన ఆసక్తి కలగకపోవటంవల్ల ఉత్సాహోద్రేకాల ప్రదర్శనకనువైన సందర్భాలు జీవితంలో ఎక్కువగా లభించలేదు. అందువలన నైష్కర్మ సిద్ధికలిగిందో లేదో కాని, వొక విలక్షణత మాత్రం స్పష్టంగా ముద్రపడింది.

మా కాటూరి వెంకటేశ్వర రావుగారూ, అడివిబాపిరాజు గారూ విశ్వనాథ సత్యనారాయణగారూ, నండూరీ, బసవరాజూ, మల్లంపల్లీ అందరూనాకు ఆప్తులూ సన్నిహితులూ అయినప్పటికీ నేను వాళ్ళను కానీ, వాళ్ళునన్ను కానీ నువ్వు అని మన్నించుకోవటం దాకా, మాసాన్నిహిత్యం పెరగలేదు. ఇట్టే పరిచయమైన కొద్దిరోజులకే వాళ్ళు వొకరినొకరు, నువ్వు అని మన్నించుకొనేవారు. కాని ఎవ్వరూ నన్నుమాత్రం నువ్వుఅనే వారు కారు. నేను ఎవరినీ అట్లా అనే వాణ్ణి కాదు కాబట్టే నేమో? మళ్ళి వాళ్ళతో ఆత్మీయత తక్కువైందే మీకాదు. అరమరలు లేని అచ్చమైన మైత్రీబంధమే వుండేది. అయినా ఏదోవొక ప్రత్యేకత నాలోవుందేమో! మా బాపిరాజు వోసారినవ్వుతూ, ఏమండీ మీరు ఎవ్వరినీ నువ్వనటం నేను చూడలేదు. ఇంటిదగ్గర ఇల్లాలిని కూడా మీరనేమన్నిచేస్తారా ఏమిటి అన్నారు. నేను చెప్పాను కదా మీరనను కానీ. ఒసే ఏమే అని మాత్రం అనను అని. ఇందువలన ఏమిటి చెప్పదలచుకున్నది అంటే, అత్యంత సన్నిహితులైన. ఆత్మీయులైన, మిత్రుల వ్యక్తుల మధ్యకూడా వొకసంస్కారాన్నీ, వొకనడవడినీ. వొక వొద్దికనూ వొక దిద్దితీర్చిన సుందర భావాన్నీ కాంక్షిస్తాను. అది బాగా అలవాటయింది. అందువలన జీవితంలో రాజీపడే సందర్భాలలో కొంత మానసికమైనశ్రమ, అలసట, నిరుత్సాహం అనుభూతమైనాయి అని.

ఈవిధంగా 1906 వ సంవత్సరం దాకా. లోవర్ సెకండరీ పరీక్ష పాసై గుంటూర్లో హైస్కూల్లో చేరేదాకా, చిన్నతనమంతా వొక ప్రత్యేకమైన వాతావరణంలో గడిచిపోయింది. మేము బందరు నుంచి నరసారావుపేట వచ్చి స్థిరపడ్డాం కాబట్టి బందరుతో నాచిన్నతనంలో సన్నిహిత సంబంధాలుండేవి. బందరు నుంచి మా కుటుంబంతో పాటుగానే, తాడేపల్లి ఆంజనేయశాస్త్రిగారూ. కొండుభొట్ల గోపాలకృష్ణయ్యగారూ, రాళ్ళభండి కృష్ణమూర్తి గారూ మొదలైన వకీళ్ళందరూ, బందరు ప్రాంతాల నుంచే నరసారావుపేట వచ్చి స్థిరపడిన వాళ్ళు కాబట్టి, బందరు నుంచి ఏ కుటుంబాల వాళ్ళు రాకపోకలు గావిస్తున్నా మా ఇల్లుకూడా సందడిగా వుండేది. మేమూ వాళ్ళ వాళ్ళ బంధువులు వచ్చినపుడు వాళ్ళ ఇళ్ళకు వెళ్ళుతూ వుండే వాళ్ళం. ఉదయగిరి ఆంజనేయులుగారూ, వంకాయల శేషావతారంగారూ వైశ్యులలో

పేరెక్కిన వకీళ్ళు మా ఊళ్ళో. వీళ్ళు గూడా బందరు నుంచి వచ్చిన వాళ్ళే.

మానాన్నగారు చుట్టుపక్కల గ్రామాల్లోని భూమితగాదాలు, మాఊరికి దగ్గరేవున్న ముప్పాళ్ళషావుకార్ల వ్యాజ్యాలు, జమీందారీ సంబంధమైన లావాదేవీలు ఎక్కువగా చూస్తుండేవారు.

1906 వ సంవత్సరానికే వందేమాతరం ఉద్యమం దేశాన్ని బాగా ప్రభావితంచేసింది. ఈ ఉద్యమం చిన్నతనంలోనే మమ్మల్ని కూడా ఆకర్షించింది. అంటే ఇవన్నీ నాకు పన్నెండేళ్ళ వయసు రాకముందే గడచిన విశేషాలన్న మాట. తరువాత పై చదువుకు గుంటూరు చేరాను.

1906 వ సంవత్సరంలో ఫోర్తుఫారంలో చేరాను. మాఅమ్మగారూనేనూ, గంగావఝ్ఝల హనుమయ్యగారనే ప్లీడరు గారింట్లో వుండేవాళ్ళం అద్దెకు. శలవులకు గుంటూరునుంచి నరసారావుపేట వస్తూ పోతూవుండే వాళ్ళము. ఆ రోజుల్లో ఆ ఇంటికి ఐదురూపాయలు అద్దె ఇచ్చే వాళ్ళము. అప్పుడు నరసారావుపేట రైల్లో పోవాలంటే టిక్కెట్ ఖరీదు పావలాపైన మూడు కాన్లుండేది. మూడేళ్ళు గుంటూర్లో హైస్కూలు చదువుకేకాక, బందరులో ఇంటర్మిడియట్ చదివేటప్పుడు కూడా మా అమ్మ నాతో ఉండేది. మానాన్నగారు అప్పుడప్పుడు వచ్చిమమ్మల్ని చూసి పోతూవుండేవారు గుంటూర్లోవున్న మొదటి మూడేండ్లలోనూ మా కుటుంబానికి చాలాపెద్ద ఆపత్తులు వచ్చిపడ్డాయి.

1907 వ సంవత్సరంలో మా రెండో అక్క చని పోయింది. అప్పటికి ఆమెకు వయస్సు పది హేడేళ్ళు మాత్రమే అప్పటికి మాఅక్కయ్యకు ఇద్దరు పిల్లలుకూడా ఉన్నారు. మామేనత్త కొడుకే అయిన మాబావతుర్లపాటి సుబ్బారావు మాఊళ్ళోనే ప్లీడరీ చేస్తుండే వారు. ఆ తరువాత కొద్ది రోజులకే మాఅక్కయ్య పిల్లలిద్దరూ చనిపోయారు.

1908వ సంవత్సరంలో మాపెద్దక్కయ్య భర్తను పోగొట్టుకుంది. మాఅన్నయ్య 1904 వ సంవత్సరంలో చనిపోయిన తరవాత ఆరు నెలలకు ఆయన కొక కొమారుడు కలిగాడు. ఆ పిల్లవాడి పేరు రాజ గోపాలరావు. బహుసూక్ష్మగ్రాహి. బుద్ధిమంతుడు. చాలా తెలివి తేటలతో చదువు తూండేవాడు. మా కలలన్నీ కల్లలు చేసి ఆశలన్నీ అడియాసలుచేసి, బందరులో ఫిఫ్తుఫారం చదువుతూ తరవాత చనిపోయినాడు.

మానాన్నగారికీ అమ్మగారికీ జీవితంలో అన్నీ కష్టాలే. అన్నీదుఃఖాలే. పరంపరగా వచ్చి పడ్డ యీ మహాపదలతో ఎప్పుడు మృత్యువు మా కుటుంబానికీ, మా ఇంటికి సమీపస్థంగా తిరుగాడుతూవుండేదని అనిపిస్తూవుండేది.

(సశేషం)

సర్. సి. వి. రామన్

గగనము వెల వెల బారినది
విజ్ఞాన శరత్పూర్ణిమకు
శాస్త్రపుటుదీచీప్రత్యూషానికి,
మృత్యుగ్రహగ్రస్తముతో తమోపూర్ణమయింది.

శాస్త్రయుగాభ్యుదయానికి
వైతాళిక గీతాధ్యాయము గరపిన
సర్ రామన్ చరమ గద్యతో, యుగ సంకేతం సడలింది.

ఓ మహాజ్ఞాన యశశ్వీ,
భౌతికశాస్త్రామ్నాయబృహస్పతీ
ప్రపంచమహాశాస్త్రవిదుల
శిఖామణీ! చంద్రశేఖర!
తరచిన సాహిత్యాంబుధి
జనియించిన జైవాతృక!

డాల్ఫిన్ ఉల్కాపాతముతో
జాగృతమగు జిజ్ఞాసయై
నోబుల్ సర్. రామన్ ఎఫెక్టులకు
ధ్రువకీర్తికి కరదీపికయైనది.

జగదీశప్రఫుల్లచంద్రుల
విజయోత్సుక జయగీతలు—నినదించిన వినువీధిన
ధ్వనియింతువు-శాశ్వతముగ.

నిగూఢ సాహితీ పిపాసతో—అవలిగట్టుకు చేరిన మనీషి
నీ జ్ఞానరోచిస్సులతో—మానవ మేధాశిలోచ్చయాల
శిఖరాగ్ర పతాకకీర్తిని స్పృశించావు.

ప్రపంచ విజ్ఞానం సమర్పిస్తున్న—తుదిశ్రద్ధాంజలి కార్యక్రమంలో
సశ్రుత్యశ్రుల సేచనముగ-ఇదె సమర్పిత కృతజ్ఞతాంజలి.,
హృదయార్పిత కుసుమాంజలి.

శేషం రామానుజాచార్యులు

ఆంధ్రపితామహ 'మాడపాటి'



—ఉమ్మెత్తల కేశవరావు

ఆంధ్రపితామహులు శ్రీ మాడపాటి హనుమంతరావుగారి సంస్మరణ తెలంగాణా వాసులకు అతి ప్రధానమగు విషయము. వారివల్లనే తెలంగాణములో రాజకీయ జీవితము ప్రారంభమైనది. తెలంగాణములోగల సాంఘిక, రాజకీయ జీవిత మంతయు, వారి ఆశీర్వాదము, ఆలోచనలలోనై యున్నది. తెలంగాణము యొక్క ప్రత్యేకతను వారు గుర్తించినట్లు మరెవ్వరు గుర్తింపలేదని చెప్ప వచ్చును. వారి సేవ తెలంగాణము వరకే పరిమితముకాదు. జాతీయ దృష్టితో వారి సేవ మన దేశములో కలిగిన చైతన్యములో ఒక భాగమై యున్నది.

నిజాం పాలనలోగల హైదరాబాదు రాష్ట్రము మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతములతో కూడి యుండెను. పరిపాలన మహమ్మదీయులది. అందువల్ల హైదరాబాదు నగరము వివిధ సంస్కృతులను మేళవించుకొన్న ఒక అచ్చమైన భారత జాతీయతకు ప్రత్యక్ష చిహ్నమై యుండెను. ఇట్టి భాగ్యము భారతావనిలో ఇతర ఏ నగరము కలిగిలేదు. ఆ కాలములో జాతీయ సేవకు నాయకత్వము వహించిన అగ్రశ్రేణులలో మొదటివారు శ్రీ వామన్ నాయక్ గారైతే, జస్టిసు పండిత కేశవరావుగారు రెండవవారుగా యుండిరి. మూడవ శ్రేణి శ్రీ మాడపాటి హనుమంతరావుగారిదై యున్నది.

మాడపాటివారు స్వయముగా ఒక సంస్థగాయుండిరి. వాక్ సంయమము నెమ్మదిగా మాటలాడుటలో వారు కుశలులు. అర్థశుద్ధి వారిలో నేర్చుకో తగినది వారు విద్యార్థులకు, వైవాహిక సంబంధాలు, సాంసారిక జీవనములో కలిగెడు ఒడుదొడుకులు అవసరాల గురించి అనేకులకు చక్కని సలహాలిచ్చెడివారు. వారి సలహా పొందిన వారికి మేలే కల్గింది. వారు ఈ విధముగా నిస్వార్థ సమాజ సేవకులు. వారు న్యాయవాదిగా యుండిరి. నిరాడంబర జీవనము; సంపూర్ణ ఖద్దరు వేషధారి. వారి సంపాదన సామాన్యమే. వారి ఖర్చు మితంగాను, క్రమబద్ధంగానుండుటచే లేమిడిరాకుండ, కదలని నిండుకుండవలె 86 సం॥ తమ జీవితాన్ని నిగ్గదీసిరి—వారి జీవితము, నడవడి

"తగిన వేషంబు, తను దానపొగడు కొనమి,
నొచ్చియును, కీడు పలుకమి, ఇచ్చి వగవ కునికి,"

అను భారతీయ నడవడికి సాక్షీ రూపము. వారికి సమాజసేవ యొక్క ప్రతిరంగములో పరిచయమేగాక ఆ రంగములలో పని చేయుటకు తగిన కార్యకర్తలను సృష్టించవలెనని ఆసక్తి ఉండేది. ఆంధ్ర ప్రాంతం కృష్ణా, గుంటూరు జిల్లాలలో చైతన్య వంతంగా సాంఘిక, విద్యావిషయక, కార్యక్రమాలు జరుగుచున్నను, వాటితో ఎంతమాత్రము సంబంధము పెట్టుకొనేవారుకారు. తెలంగాణావారికి అవి మేలు చేకూర్చవని కూడ చెప్పేవారు.

వారిది నిర్మాణాత్మకదృష్టి. అందరిని కలుపుకొనిపోవలెనని చింతన గలవారు. సలహాలివ్వడము, సమన్వయము కోరడము వారి ధ్యేయమైయుండెను. మావంటివారిని పట్టుకొని జైలుకు పంపినట్టు, వారిని పట్టుకొనుధైర్యము యెవరికి లేకుండెను నిజాంగారి పాలనలో అవినీతి పెరుగుటచే చక్కబెట్టుటకు ఫ్రెంచి, టాస్కరు అను ఇద్దరు ఆంగ్ల ఉన్నతోద్యోగులు, రెవెన్యూ, పోలీసు శాఖ మంత్రులుగా వచ్చియుండిరి రాజకీయాలకు నిలయమైనా, ఆ ఆంగ్లేయులు, పంతులుగారి మాటనే హెచ్చుగా విశ్వసించేవారు. వారిలోగల నమ్రత, విషయ వివేచనా శక్తి యెదుటి వారిని నమ్మించేది, ముగ్ధులను చేసేది.

వేయి మాసములు నిండుగా జీవించిన వారికి పుణ్యలోకము లభ్యమగునను ప్రతీతి గలదు—వారు (86)సం॥లు జీవించిరి— కార్తిక శు॥ 13లు, శరదృతువు, సమకాలము సంధ్యావేళ వారికి మరణ మాసన్నమైనది. వారు శరీరముయొక్క క్షుద్రత్వాన్ని జరయను దుఃఖముచే బాగా అనుభవించి, గుర్తించి, శరీరముపై ఆసక్తి వదలి, తెలిసి, తెలియనట్టు, అసువులను, అనాయాసముగా, వదిలినట్టు వారి అంతిమయాత్ర తెలుపుచున్నది. కావున వారు పుణ్యచరితులలో ఒకరు— ఇట్టి వారికి స్వర్గధామమే నివాసమని ధర్మగ్రంథములు చెప్పుచున్నవి. ★

జనాభా లెక్కల సేకరణ ఆవశ్యకత

టి. వేదాంతం,

ప్రభుత్వ విధానానికీ, పరిపాలనా నిర్వహణకు వాస్తవ విషయాలను ప్రాతిపదిక చేయాలనేదే జనాభా లెక్కల సేకరణ ప్రధానోద్దేశం. ప్రణాళికా రచయితలు ప్రణాళికలను తయారు చేసేటప్పుడు వారికి ప్రాతిపదిక సమాచారాన్ని సేకరించడానికి యీ జనాభా లెక్కలు తోడ్పడతాయి గనుక వీటికి చాలా ప్రాధాన్యంవుంది. జనాభా లెక్కల వల్ల పరిపాలనా సంబంధమైన లెక్కలతోపాటు ప్రజలసాంఘిక, ఆర్థిక విషయాలు సమగ్రంగా తెలియడంచేత జనాభా పెరుగుదల, ఆహారోత్పత్తుల పంపిణీ మొదలైన అనేక విషయాలను సశాస్త్రీయమైన దృక్పథంతో పరిశీలించడానికి వీలవుతుంది. పైగా దీనివల్ల సమాజ వ్యవస్థ యొక్క స్థూలరూపం అవగాహన అవుతుంది. దాన్ని ప్రాతిపదికగా చేసుకుని యితరరంగాలకు సంబంధించి కొన్నిరకాల ప్రత్యేక సమాచారాన్ని తెలుసుకోవడానికి వీలవుతుంది.

జనాభా లెక్కల సేకరణ అప్పుడు వేసే ప్రశ్నలు సాధ్యమైనంత సులభంగా, చిన్నవిగా వుండడం అవసరమని ప్రపంచంలోని జనాభా లెక్కల నిపుణులందరూ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భారత దేశం వంటి దేశాల్లో యిది అక్షరాలా పాటించడం అవసరం. ఎందుకంటే సాధ్యమైనంత తేలికగా ప్రశ్నలు వుంటేనే ఇక్కడి నిరక్షరాస్యులనుంచి సరియైన సమాధానాలు రాబట్టడానికి వీలవుతుంది, 1. ఇళ్ళజాబితా 2. సంస్థల జాబితా 3. వ్యక్తి జాబితా 4. జనాభా రికార్డు అనినాలుగు షెడ్యూళ్ళను 1971 జనాభా లెక్కల సేకరణలో ఉపయోగించాలని భావించబడింది. వీటిలో మొదటి రెండింటినీ 1970 ఫిబ్రవరిలో అమలులో పెట్టారు. మిగిలిన రెండింటినీ 1971 ఫిబ్రవరిలో అమలుపరుస్తారు.

జనాభా లెక్కలను సేకరించేటప్పుడు అమలుపరచే వ్యక్తి జాబితాలోని విషయం, ఆ యా ప్రశ్నల ప్రాధాన్యం యిక్కడ పేర్కొనడమైనది.

1 వ ప్రశ్న : పేరు :

ఈ వివరాలను జనాభా లెక్కల పట్టిక గురించి మాత్రమే వుపయోగిస్తారు. అంటే గ్రామం/వార్డు/తహశీలు/జిల్లాస్థాయిలో జనాభా వివరాలను తెలుసుకోడానికే వుపయోగిస్తారు. ఆ స్థాయిలో వ్యక్తిగత ప్రాధాన్యత వుండదు.

2 వ ప్రశ్న : ఇంటి యజమానితోగల సంబంధం ;

ఇంటిలో సభ్యుల సంఖ్యను బట్టేగాక ప్రతిసభ్యుని వయస్సు, వైవాహికస్థాయి మొదలైన వాటినిబట్టి కూడా గృహవసతి అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడానికి యీ సమాచారం వుపయోగపడుతుంది. ఇప్పటికీ పల్లెల్లోనూ, పట్టణాలలోనూ సమిష్టి కుటుంబ వ్యవస్థ విధానం ఎంతవరకు అమలులో వున్నదో యీ సమాచారం ద్వారా తెలుసుకోడానికి వీలవుతుంది.

3 వ ప్రశ్న : ఆడా ? లేక మగా ?

వృత్తి విధానాలలో, వైవాహిక విషయాలలో, యింకా అనేక విషయాలలో యీ రెంటికీ వ్యత్యాసం వున్నందుచేత జనాభా లెక్కల పట్టీలలో విడివిడిగా వీటిని వర్గీకరించి వేయడం వల్ల చాలా వుపయోగంవుంది.

4 వ ప్రశ్న : వయస్సు :

విద్యావసరాలు, వృద్ధాప్యపు పింఛనులు మొదలైన వాటిని కల్పించే పథకాలను, చేయడానికి పాఠశాలలకు వెళ్ళే వయసులో వున్న పిల్లలు ఎంతమంది వున్నారు ? ఆ పై వయసులో పిల్లలు ఎంతమందివున్నారు మొదలైన వివరాలు తెలియడం అవసరం.

5 వ ప్రశ్న : వైవాహిక స్థితి :

యీ ప్రశ్నవల్లా, యింతకు ముందు వయస్సుకు సంబంధించిన ప్రశ్నవల్లా కుటుంబనియంత్రణ కార్యక్రమాలను రూపొందించడానికి అవసరమయ్యే సమాచారం లభిస్తుంది.

6 వ ప్రశ్న : 1. ఇటీవలే పెళ్ళయిన మహిళలకు పెళ్ళయినప్పటి వయస్సు ? 2. గత ఏడాదిగా సంతానం కలిగినదా ?

జనన మరణాల విషయంలో తగిన సమాచారం సరిగ్గా లభించక పోవడంవల్ల జనాభా పెరుగుదల రేటు, సంతానోత్పత్తి శక్తి మొదలైన విషయాలు అంతగా తెలియడంలేదు. ఈ ప్రశ్నలవల్ల ఆ సమాచారం లభిస్తుంది. ఒక్క జనాభా లెక్కల సమయంలోనే పెళ్ళయిన మహిళలందరి సంతానోత్పత్తి శక్తిని

అంచనా వేయడం సాధ్యంకాదు. కాని కొత్తగా పెళ్ళయిన మహిళలకు ఎప్పుడు పెళ్ళిఅయిందీ తెలుసుకొని, గత ఒక ఏడాదిగా సంతానోత్పత్తి విషయంలో ఆమె దృక్పథం ఎలావున్నదీ అర్థం చేసుకోడానికి యీ సమాచారం వీలు కలిగిస్తుంది.

7 వ ప్రశ్న : జన్మస్థలం :

1. పుట్టిన వూరు
2. గ్రామమా ? లేక పట్టణమా ?
3. జిల్లా
4. రాష్ట్రం/దేశం

ఒక చోటు నుంచి మరోచోటుకి వలస పోవడం, లేదా మరోచోటునించి వలస రావడం— వీటివల్ల కూడా జనాభా సంఖ్యలో మార్పులు వస్తాయి. జనన మరణాలు కాక దీనివల్ల కూడా జనాభా పెరగడం, లేదా తగ్గడం జరుగుతుంది. ఈ సమాచారం యీ విషయాన్ని తెలుసుకోడానికి తోడ్పడుతుంది.

8 వ ప్రశ్న : ఇంతకుముందు నివసించిన ప్రాంతం :

1. ఇంతకుముందు నివసించిన ప్రాంతం
2. గ్రామమా ? లేక పట్టణమా?
3. జిల్లా
4. రాష్ట్రం/దేశం

ఈ ప్రశ్న క్రింద లభించే సమాచారం ఏడవ ప్రశ్నకు కూడా సరిపోతుంది. అందువల్ల అందులోవలె ప్రజల వలస రాకపోకల వివరాలు తెలుసుకోవడానికి యిది తోడ్పడుతుంది.

9 వ ప్రశ్న : జనాభా లెక్కలు సేకరించే గ్రామంలో నివాసకాలం :

ఎనిమిదవ ప్రశ్నవల్ల వలసవివరాలు తెలిసినవాటినిబట్టి ఆయా ప్రాంతాలలో వారిని చేర్చడానికి వీలవుతుంది. పైగా ప్రతి యేటా, ప్రతి అయిదేళ్ళకు, ప్రతి పదేళ్ళకు ప్రజలు ఎంతమంది వలసపోతున్నారో వివరాలు తెలుసుకోవడానికి యీ సమాచారం తోడ్పడుతుంది.

10 వ ప్రశ్న : మతం :

దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆయా మతాలకు సంబంధించిన ప్రజలు ఎంతెంతమంది వున్నారో తెలుస్తుంది. మత విషయకంగా అల్పసంఖ్యాక వర్గాలవారి విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోడానికి యిందువల్ల వీలవుతుంది.

11 వ ప్రశ్న : షెడ్యూలు కులాలు, షెడ్యూలుతరగతులు:

విద్య, పారిశ్రామిక విషయాలు, వృత్తి సౌకర్యాలు మొదలైన వాటి విషయంలో యీ వర్గాలవారి అభివృద్ధికి ప్రణాళికలు, పథకాలు రచించడానికి యీ సమాచారం తోడ్పడుతుంది.

12 వ ప్రశ్న : అక్షరాస్యత :

నూటికి నూరుపాళ్ళు అక్షరాస్యత సాధించాలన్నది సంక్షేమ రాజ్యం లక్ష్యం. దేశంలోని వివిధ ప్రాంతాలలో అక్షరాస్యత ఏ స్థాయిలో వున్నదో దీనివల్ల తెలుసుకోవచ్చు.

13 వ ప్రశ్న : విద్యా ప్రమాణాలు :

పైన 12 వ ప్రశ్నకు యీ సమాచారం తోడ్పడుతుంది విద్యాప్రమాణాలను బట్టి చదువుకున్న వాళ్ళను దీనివల్ల వర్గీకరించడానికి వీలవుతుంది.

14 వ ప్రశ్న : మాతృభాష :

భారతదేశంలో మాట్లాడే భాషలు ఎన్నివున్నవో, ఆయా భాషలను మాట్లేడే వారి సంఖ్య ఎంతవుందో తెలుస్తుంది.

15 వ ప్రశ్న : ఇతర భాషలు :

ఒక భాషకన్న ఎక్కువ భాషలు మాట్లాడ గలిగే వారి సంఖ్య ఎంతుందో తెలుసుకోవచ్చు. ద్విభాషా సిద్ధాంతానికి యిది తోడ్పడుతుంది.

16 వ ప్రశ్న : ప్రధానవ్యాపకం :

విస్తృత విభజన :

1. కార్మికుడా ? కార్మికేతరుడా ?

ప్రతి మనిషిని – స్త్రీ అయినా, పురుషుడైనా, బాలుడైనా బాలికైనా ప్రధానంగా యీ రెండు వర్గాలలో–అంటే కార్మికుడో? కాదో వర్గీకరించవచ్చు. దీనివల్ల ప్రతిగ్రామంలో, పట్టణంలో కార్మికశక్తిని భేరీజు వేసుకోవచ్చు.

(అ) పనిచేసే ప్రాంతం :

పని గురించి రోజూ పరాయి ప్రాంతాలకు ఎంతమంది వెళ్తున్నారో తెలుస్తుంది. ముఖ్యంగా పట్టణాలలో యిది కనిపిస్తూ వుంటుంది. పట్టణంలో రాత్రి జనాభాకు, పగటి జనాభాకు మధ్య తేడావుంటుంది: పట్టణాల పరిసరగ్రామాల నుంచి రోజూ వుదయం పని నిమిత్తం పట్టణానికి వచ్చి రాత్రిళ్ళు తిరిగివెళ్ళి పోవడం కద్దు. ఈ ప్రశ్నవల్ల వచ్చే సమాచారాన్నిబట్టి రవాణా సౌకర్యాలు, టౌన్ ప్లానింగు మొదలైన వాటికి పథకాలు రూపొందించుకోవచ్చు.

(ఇ) పనిచేసే సంస్థపేరు :

కార్మికుడు పనిచేసే సంస్థ వివరాల్నిబట్టి ఆ రంగానికి సంబంధించిన ఆర్థిక కార్యకలాపాల స్వరూప స్వభావాలు అర్థమవుతాయి.



1



4



2



5




జనాభా లెక్కల సేకరణ



3










1. దేశమంతటా యిండ్లకు నెంబర్లు వేస్తారు.
2. ఎన్యూమరేటర్ వ్యక్తి వివరాలు తీసుకుంటాడు.
3. జనాభా లెక్కల "పంచింగ్ విభాగం"
4. ఎన్యూమరేటర్ యిండ్ల జాబితా షెడ్యూలు వివరాలు పూర్తి చేసుకుంటాడు.
5. కుటుంబంలో జనన మరణాల వివరాలు
6. సాంకేతిక విభాగంలో పని జరిగే తీరు
7. "వర్గీకరణ" విభాగం
8. "ఎడిటింగ్" విభాగం
9. జిల్లాల నుండి యిండ్ల జాబితా షెడ్యూళ్ళు జనాభా లెక్కల కార్యాలయానికి వస్తాయి.
10. "శాంప్లింగ్" విభాగం





(ఈ) పరిశ్రమ, లేక వృత్తి, లేక ఉద్యోగం స్వభావం :

పైన పేర్కొన్న ప్రశ్నకు కావలసిన సమాధానాన్ని ఇది పూరిస్తుంది. ఒక వ్యక్తి పనిచేస్తున్న సంస్థ స్వభావ స్వరూపాలు పూర్తిగా దీనివల్ల తెలుస్తాయి. జాతీయ స్థాయిన పారిశ్రామిక వర్గీకరణకు యీ సమాచారం తోడ్పడుతుంది.

(ఉ) పనితీరు :

ఒక వ్యక్తి ఏ పనిచేస్తున్నాడో, పరిశ్రమలో వున్నాడో, వృత్తి, లేక వ్యాపకం చేపట్టాడో మొదలైన అతను చేస్తున్న పనితీరుగురించి తెలుసుకోడానికి వీలవుతుంది.

(ఊ) కార్మికుని హోదా :

ప్రతి కార్మికుని హోదా తెలుసుకోడానికిది తోడ్పడుతుంది. ఉపాధి సౌకర్యాల కల్పనకు సంబంధించిన పథకరచనకు యిది చాలా అవసరం.

17 వ ప్రశ్న : సహాయక వృత్తి :

(అ) విస్తృత వర్గీకరణ

(ఆ) పనిచేస్తున్న ప్రాంతం (గ్రామం/వూరుపేరు)

(ఇ) సంస్థపేరు

(ఈ) పరిశ్రమ, వ్యాపారం, వృత్తి, ఉద్యోగం స్వభావం

(ఉ) పనితీరు

(ఊ) కార్మికుని హోదా

పదహారవప్రశ్న వ్యక్తి ప్రధాన వ్యాపకం గూర్చి అడుగగా యీ ప్రశ్న సహాయక వృత్తిని గూర్చి ప్రశ్నించడానికి ఉద్దేశించినది పై మాదిరిగానే యిందులోని ఉప ప్రశ్నలు కూడా ఆ వ్యక్తి ఆర్థిక కార్యకలాపాలను గూర్చి వివరంగా తెలుసుకోడానికి వీలు కలిగిస్తాయి.

ఇళ్ళ జాబితాలో సేకరించిన సమాచారాన్నిబట్టి ఛార్జిలిస్టులు రూపొందింపబడతాయి. 1. వ్యక్తి జాబితా, 2. జనాభా రికార్డులను తయారుచేయడానికిగాను జనాభా లెక్కల సేకరణ సూపర్‌వైజర్లకు వారికి సంబంధించిన ఆయాప్రాంతాల పరిధులను మార్కు చేయడానికి పైన పేర్కొన్న ఛార్జిలిస్టులు తోడ్పడతాయి. జనాభా లెక్కల సేకరణ కర్తలకు, సూపర్‌వైజర్లకు గట్టి శిక్షణ —ప్రయోగపరంగానూ, బోధనాపరంగానూ—యివ్వడం అవసరం. జిల్లా స్థాయిలో జనాభా లెక్కల సేకరణ అధికారులయిన కలెక్టర్లకూ, డివిజనల్ సెన్సస్ అధికారులైన రెవెన్యూ డివిజనల్ అధికార్లకూ, తాసిల్దార్లకూ 1970 సెప్టెంబరు—అక్టోబరుల్లో జనాభా లెక్కల సేకరణ కార్యక్రమానికి సంబంధించిన డైరెక్టరూ, డిప్యూటీ డైరెక్టరూ జిల్లా హెడ్ క్వార్టర్సులో శిక్షణ యిచ్చారు.

ప్రతి తాలూకాలోను మునిసిపాలిటీలోనూ అనువైన కేంద్రాలలో జనాభా సేకరణదార్లకు, సూపర్‌వైజర్లకు 6 తరగతులను నిర్వహించి ఛార్జి సూపరెంటెండెంట్లు గట్టి శిక్షణ యిస్తారు. హైదరాబాదు కార్పొరేషన్ పరిధిలో జనాభా లెక్కల సేకరణ కార్యక్రమానికి హైదరాబాదు పురపాలక సంఘ ప్రత్యేక అధికారి ఆధ్వర్యం వహిస్తారు. 1971 ఫిబ్రవరి - మార్చి కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో జనాభా లెక్కల సేకరణకుగాను మొత్తం 70,000 మంది జనాభా లెక్కల సేకరణదార్లకు, 15,000 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ యివ్వబడుతుందని అంచనా.

జనాభా లెక్కల సేకరణప్పుడు అడిగిన సమాచారాన్ని యివ్వడానికి ఏ వ్యక్తీ భయపడనక్కరలేదు. ఎందుకంటే యీ సమాచారాన్ని రహస్యంగా వుంచడం జరుగుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయస్థానాల్లో దీనిని వెల్లడి చేయడం జరగదు ప్రజలు తెలియజేసే సమాచారాన్ని పన్నులు విధింపు తదితర పరిపాలనా సంబధమైన చట్టాలను అమలుపరచడానికి ఉపయోగించడం జరుగదు. సరియైన సమాచారాన్ని యివ్వనప్పుడు ఆ వ్యక్తిమీద చర్యతీసుకొనే హక్కు వుంటుంది. ప్రజలందరి వద్దనుంచి పూర్తి సహకారం లభించడానికి వీలుగా చదువుకున్నవారు, తెలియని తోటి సోదరులకు యీ విషయాన్ని తెలియ జేయడం తమ విధిగా భావించాలి. జనాభా లెక్కల ప్రధాన్యాన్ని వారికి నచ్చజెప్పాలి. భారత జనాభా లెక్కల చట్టంద్వారా సంక్రమించే అన్ని విధాల రక్షణావారు వెల్లడిచేసే సమాచారానికి వుంటుందని అర్థమయ్యేట్టు తెలియజెప్పాలి. ★

జనాభా పెరుగుదల ప్రగతికి ప్రతిబంధకం.

మహాభారతము

తెన్నపగంటుల లక్ష్మణశాస్త్రి

బ్రాహ్మణులందరు అష్టావక్రుని వద్దకు వచ్చి నమస్కరించి అతనిని పూజించిరి. తరువాత అష్టావక్రు డిట్లనెను:

"మహారాజా ! ఈ బందియే పూర్వము పండితులైన అనేక బ్రాహ్మణులను శాస్త్రములో నోడించి వారిని జలములో ముంచియుండెను. అందుచేత, నితనికికూడ ఆగతియే యిప్పుడు పట్టవలయును. కనుక నితనిని పట్టుకొని నీటిలో ముంపజేయుడు." అది విని బంది యిట్లనెను

బంది:— మహారాజా ! నేను వరుణ రాజుయొక్క పుత్రుడను. నా తండ్రి, యింటిలోకూడ నీవు ఇప్పుడుచేయు యజ్ఞమునకు సమానమైన ద్వాదశ వార్షిక యజ్ఞము జరుగుచుండెను. ఆ యజ్ఞానుష్ఠానముకొరకే జలములో ముంచెడు నెపముతో శ్రేష్ఠులైన కొందరు బ్రహ్మణులను నేను వరుణ లోకమునకు పంపియుంటిని. వారందరు వరుణుని యజ్ఞమును చూచుటకు పోయినారు. ఇప్పుడు తిరిగి ఈ లోకమునకు వచ్చుచున్నారు. పూజనీయుడైన అష్టావక్రుని నేను ప్రశంసించెదను. ఎందుకనగా అతని కారణమున నేను నా తండ్రితో ఇప్పుడు కలియబోవు చుంటిని.

అష్టా:— రాజా ! బంది తనయొక్క వాక్పటుత్వము చేతనే విద్వాంసులను ఓడించి సముద్రజలములో ముంచెను. అతనియొక్క వాక్శక్తిని నా బుద్ధి శక్తిచేత ఏ విధముగా ఊడబెరికి పారవైచితినో అది అంతయు ఈ సభలోని విద్వాంసులు కనులార కనుగొనియే యున్నారు. అగ్ని దహించు స్వభావము కలదైనను తెలిసికొనదగిన విషయము అని వెంటనే తెలిసికొనగలరు. కనుక పరీక్షా కాలమునందు సత్ప్రవర్తకుడు, సత్యవాది అయిన వ్యక్తిని కనిపెట్టి ఆ యగ్ని వారిశరీరములను వదలి తక్కినవాటినే దహించును. ఆ విధముగనే వినమ్ర భావముతో మాట్లాడు బాలకుని మాటలలో ఉన్న సత్యమును హితమును సత్పురుషులు గ్రహించగలరు. అనగా నేను బాలకుడని తలచక నా మాటలలోని భావమును గ్రహించవలెను అని భావము. రాజా ! నీవు శ్లేష్మాతక (పత్రములందు భోజనమైనను చేసి యుండవలెను. లేక దాని ఫలములనైనను తిని యుండవలెను. అందుచేతనే నీ తేజస్సు క్షీణించినది. అందువలన నీవు బంది చెప్పు మాటలను వినుచున్నావు. ఈ బందిచేసిన స్తోత్రములకు నీవు ఉన్మత్తుడవైనావు. అందువలననే అంకుశము దెబ్బతినిన తరువాతగూడ చెప్పినట్లు నడచుకొనని మదపుటేనుగువలెనీవు ఈ నా మాటలను కున్నావు.

జనకుడు: మహాత్మా ! నేను నీ యొక్క దివ్యమైన అలౌకిక వాక్కును వినుచున్నాను నీవు సాక్షాత్తు దేవతాస్వరూపుడవు. శాస్త్రార్థములో బందిని జయించితివి. నీ యిచ్ఛను ఇప్పుడే పూర్తి చేసెదను. ఇదిగో నీ చేతిలో ఓడిపోయిన బంది. నీ యిష్టము వచ్చినట్లు చేసికొనుము.

అష్టా: రాజా ! ఇతడు జీవించినందువల్ల ఎట్టి ప్రయోజనము కూడ నాకు సిద్ధించదు. ఇతని తండ్రి వరుణదేవుడే అయినచో అతనివద్దకు పంపుటకుగాను ఇతనిని సముద్రములో ముంచుము.

బంది:- రాజా ! నేను వాస్తవముగా వరుణరాజు కుమారుడను. అందువలన జలములో ముంచబడుదునను భయము నాకు లేదు. ఈ అష్టావక్రుడు చాలకాలమునుండి అదృశ్యుడైన తన తండ్రియగు కహోడుని చూడలేదు. కనుక నిప్పుడే అతనిని చూడగలడు.

'ధర్మరాజా ! అటుతరువాత వరుణరాజుచేత పూజితులైన బ్రహ్మణులందరు (బందిచేత జలములో ముంచబడిన వారు) అకస్మాత్తుగా జనకుని సమక్షమున ప్రత్యక్షమైరి. అని లోమశుడు చెప్పి తరువాతికథను యిట్లు చెప్ప దొడగెను.'

అట్లు వచ్చినవారిలో ఉన్న కహోడుడు ఇట్లనెను: "జనక రాజా! నేను చేయజాలని పనిని నా పుత్రుడుచేసి చూపించెను. కనుక లోకములో సత్కర్మల ద్వారాసత్పుత్రులను కనవలెనని కోరు

చుందురు. ఒక్కొక్కప్పుడు దుర్బలునికి బలవంతుడు మూర్ఖునికి పండితుడు అజ్ఞానికి జ్ఞానియునగు పుత్రులు పుట్టుచుందురు. అట్లే అజ్ఞానియైన నాకు జ్ఞానియైన పుత్రుడు పుట్టెను. రాజా! యమరాజు స్వయముగానే తన పదునైన గండ్ర గొడ్డలిచేతనే శత్రువుల శిరస్సులను ఖండించు గాక, నీకు మేలు కలుగు గాక. నీ ఉత్తమయైన యజ్ఞమునందు ఔక్థ్యము (ఉక్థము అను యజ్ఞాము నందు గానము చేయదగిన సామవేదము) అను సామగానము చేయ బడుచున్నది విధి పూర్వముగా సోమరస పానము జరుగుచున్నది. ఇంద్రాది దేవతలు ప్రత్యక్షముగావచ్చి నీయజ్ఞములో తమ హవిర్భాగములను తీసికొను చున్నారు.

ఆ తరువాత లోమశుడు యుధిష్ఠిరునితో నిట్లనెను:—

బందిచేత జలములో ముంచబడిన బ్రాహ్మణులందరు అచట కనబడగనే బంది రాజాజ్ఞగొని తాను స్వయముగా సముద్ర జలములో ప్రవేశించెను అష్టావక్రుడు తండ్రిని పూజించెను, తాను, మేనమామ, తండ్రి ముగ్గురు తమ ఆశ్రమమునకు పోయిరి. కహోడుడు తన భార్య యెదుట పుత్రునితో. "పుత్రా నీవు వెంటనే యీ 'సమంగా నదిలో స్నానముచేయుటకు దిగుము" అని అనెను. తండ్రి ఆజ్ఞప్రకారము అతడు నదిలో దిగెను. జలస్పర్శ మాత్ర మున అతని శరీరములోని వంకరలన్నియు పోయి చక్కగా ఆయెను ధర్మరాజా అందువలననే ఈ నదికి 'సమంగా' అని పేరు వచ్చినది. అనగా 'అంగములను సమముగా చేసినది' అని యర్థము. ఇది పరమ పవిత్రమైన నది. ఇందులో పత్నీసోదర సహితుడవై స్నానము చేసి ఈ రాత్రి ఇచటనివసించి ఉదయము ఇతర తీర్థయాత్రలు చేయుటకు బయలుదేరుము అని చెప్పెను. రాజా! ఈ 'సమంగా' నదికే 'మధువిలా' అని మరి యొకపేరు గలదు. ఈ క్షేత్రమునకు 'కర్దమిల' అనిపేరు. ఇక్కడ భర తునకు పట్టాభిషేకము చేయబడినది. వృత్రాసుర వధానంతరము ఇంద్రునకు సంపదలు తొలగి పోయినపుడు ఈ సమంగానదిలో స్నానముచేసి అతడు సర్వపాప విముక్తుడయ్యెను. రాజా! ఈ మైనాక పర్వతము నందే 'వినశన' తీర్థము ఉన్నది. ఇచట పూర్వము దేవమాత యగు 'అతి' పుత్రప్రాప్తి కొరకు ఉపాస్య దేవతలకు అన్నము సిద్ధపరచి యుండెను (ఈ యన్నమునకు 'బ్రహ్మోదనము' అనిపేరు అనగా 'బ్రహ్మయొక్క అన్నము' అని యర్థము. దీనికి వేదప్రమాణము—"సాధ్యేభ్యో దేవేభ్యో బ్రహ్మౌదనమపచత్" అని కలదు.) కనుక ధర్మరాజా! మీరీ పర్వతముపైన ఎక్కి నీకు సంభవించిన అకీర్తికరము, అనిర్వచ నీయమునగు ఈ సంపద్విహీనతను తొలగించుకొనగలరు. ఈ సమీపమునందు 'కనఖల' పర్వతపంక్తులున్నవి. ఇచట గంగ ప్రవహించును. ఇచట సనత్కుమారుడు యోగసిద్ధిని పొందెను. మీరుకూడ నిందులో స్నానముచేసి పాపవిముక్తులు కండు. నేటికిని కనఖలము అను పేరుగల ఒకరేవు గంగానదిలో హరిద్వారము నందు ఉన్నది.) ధర్మరాజా! ఈ కనఖలములోని 'భృగుతుంగ పర్వతము' ఉష్ణ గంగతీర్థమును" సేవించుము. ఇచట 'స్థూలశిరస్', అను పేరు గల మునియొక్క ఆశ్రమముగలదు దానిని దర్శించి అహంకారమును క్రోధమును విడువుము. దీని తరువాత రైభ్యుని ఆశ్రమముగలదు. ఇచటనే పూర్వము భరద్వాజ పుత్రుడగు "యవక్రీతుడు" నశించెను.

ఆమాట విని ధర్మరాజు "మహాత్మా! భరద్వాజుడు ఎట్లు యోగిఅయ్యెను. అతని కొడుకు యవక్రీతుడు ఎందుకు నాశము పొందెను చెప్పుము"అని లోమశుని అడిగెను. లోమశుడిట్లు ఆ వృత్తాంతము చెప్ప దొడగెను.

యవక్రీతుని చరిత్ర

పూర్వము 'భరద్వాజుడు', రైభ్యుడు అను ఋషులు మిత్రులుగ ఈ ఆశ్రమములో నివసించుచుండిరి. రైభ్యునకు "అర్వావసుడి, పరావసు" అని యిద్దరు కొడుకులు ఉండిరి. భర ద్వాజునకు 'యవక్రీ' లేక యువక్రీత' అను పేరుగల ఒక కొడుకు ఉండెను. రైభ్యుడు, అతని పుత్రులు గొప్ప విద్వాంసులుగ నుండిరి. భరద్వాజుడు సర్వదా తపస్సులో నిమగ్నుడై యుండెను. ఈ యిరువురు మహాత్ముల కీర్తి దేశమంతట వ్యాపించియుండెను. ఒకనాడు యవక్రీతుడు "తపశ్శాలియగు నా తండ్రి కన్న పండ తులగు రైభ్యుడు అతని పుత్రులకు లోకములో అధిక సత్కారము ఆదరము జరుగుచున్నది." అని విచారపడుచుండెను. ఇట్లుండి యవక్రీతుడు వేదజ్ఞాన సంపాదనార్థమై మండుచున్న అగ్నిలో తన శరీరమును హింసింపచేయుచు ఘోరమైన తపస్సు చేయుచుండెను. అది చూచి ఇంద్రుడు పరితాపపడి యవక్రీతుని కడకు వచ్చి "నీవేల ఈ ఘోర తపస్సు చేయుచున్నా"వని అడిగెను. ఆమాట విని యవక్రీతుడు "చదువకుండగనే ద్విజులకు వేదజ్ఞానము కలుగవలె నని తపస్సు చేయుచున్నాను. తపస్సుద్వారా సర్వజ్ఞత్వము సాధించదలచినాను. గురువు వద్ద నేర్చుకొనుటకు చాల కాలము పట్టును." అని చెప్పెను. ఆమాట విని యింద్రుడు "మహర్షీ! నీవు అవలంభించిన మార్గము సరియైనదికాదు. గురుముఖముగానే అధ్యయనము చేయుము. పొమ్ము" అని చెప్పి వెడలిపోయెను.

ఆ తరువాతకూడ యవక్రీతుడు విడువక తపస్సునే చేయుచు ఇంద్రుని మిక్కిలి తపింపచేసెను. ఇంద్రుడు తిరిగివచ్చి తపస్సు చేయవద్దని యవక్రీతుని కోరి "నీవు చేయు ఈ ప్రయత్నము వ్యర్థమైనది. ద్విజులందరికి చదువకుండగనే వేదజ్ఞానము కలుగుట అసంభవము. ఈ నీ తపస్సువలన నీకు నీ తండ్రికి మాత్రమే అధ్యయనము చేయక వేదములు అవగతములు అగును" అని చెప్పెను. యవక్రీతుడు దానికంగీకరించక యింద్రునితో "యింకను కఠినముగా తపస్సు చేయుటనారంభించెదను. నీవు నా కోర్కెను నెరవేర్చనిచో ఈ మండుచున్న అగ్నిలో నా ఒక్కొక్క అవ యవమును ఖండించి హోమము చేసెదను"అని చెప్పెను.

ఆ తరువాత ఇంద్రుడు ఏలాగైనను అతనిని తపస్సు నుండి మాన్పించ దలచి క్షయరోగ పీడితుడైన ఒక వృద్ధ బ్రాహ్మణ రూపమును ధరించి యువక్రీతుని ఆశ్రమము కడకు పోయి అచటి గంగలో యిసుకతో వంతెనకట్టుటకు ఆరంభించెను. అది చూచి యువక్రీతుడు "బ్రాహ్మణా, ఎందుకు ఈ వ్యర్థ ప్రయత్నము చేయుచున్నావు. ఇసుకతో వంతెన కట్టుట నీకు సాధ్యమగునా" అని యనెను. అది విని ఇంద్రుడు గంగనుదాటుటకు జనులు కష్టపడుచున్నారు. కనుక వారి సౌఖ్యము కొరకై గంగపై

సేతువు నిర్మించుచున్నా" ననెను. ఆ మాటకు యవక్రీతుడు "వడిగా పారుచున్న గంగా ప్రవాహము బంధించుట నీకు సాధ్యము కాదు. ఈ కార్యమును మానుకొని సాధ్యమైన మరియొక పని జేయుము" అనెను. దానికి ఇంద్రుడు "నీవు చదువకుండగనే వేదములను సాధించవలెనని తపస్సు చేయుచున్నావు. అట్లే నేను కూడ ఈ కార్యసాధనమునకు ప్రయత్నము చేయుచున్నాను". ఆ మాట విని అతడు ఇంద్రుడు అని తెలుసుకొని యవక్రీతు డిట్లనేను". ఇంద్రా! నీవిపుడు చేయు కార్యము వ్యర్థమైనట్లే నేను చేయు తపస్సు కూడ వ్యర్థమైనచో నా ఉద్దేశము సిద్ధించుటకు మార్గాంతరమును చూపుము, లేదా వరముల నిమ్ము" అని యడిగెను. ఆ మాటకు సంతుష్టుడై యింద్రుడు "నీకు,నీ తండ్రికి వేద జ్ఞానము పరిపూర్తిగా లభించగలదు. ఇది గాక నీకు గల వేరుకోరికలు కూడ సిద్ధించగలవు. నీవు తపస్సు విడిచి ఆశ్రమమునకు పొమ్ము "అని చెప్పెను.

ఈ విధముగా కోర్కెలు నెరవేర్చుకొని యవక్రీతుడు తండ్రి కడకు పోయి యిట్లనెను. "మనకిరువురకు సంపూర్ణ వేద జ్ఞానము గలిగి మనము ఇతరులకన్న ఉన్నత స్థితిలో ఉండునట్లు వరమును సంపాదించి తెచ్చినాను అని యనెను. ఆమాట విని భరద్వాజుడు "ఈ విధముగా నీవు కోరిన వరములను పొందుట చేత నీకు అహంకారములుగలుగును. దాని వలన నీవు నాశనము చెందెదవు. ఈ విషయమై నీకొక కథ చెప్పెదను వినుము.

మేధావి చరిత్ర

పూర్వము మహా సమర్థుడగు 'బాలధి' అను మునియుండెను అతడు పుత్ర శోకము చేత సంతప్తుడై "దేవతలతో సమానుడగు పుత్రుడు తనకు కావలెను" అను నుద్దేశముతో ఘోరముగ తపస్సు చేసెను. అట్టి పుత్రుడే అతనికి కలిగెను. దేవతలు బాలధికి పుత్రుని ప్రసాదించిరి. కాని ఆ పుత్రునికి అమరత్వమును ఈయలేదు. ఆప్రకారమే బాలధికి 'మేధావి' యను మరియొక కొడుకు పుట్టెను. అతడు దీర్ఘాయుష్మంతుడు. కాని చాల కోపిష్ఠుడుగ నుండెను. తనకు దీర్ఘాయుష్యము కలదని తెలిసికొని గర్వించినవాడై మేధావి అంతట సంచరించుచు మునీశ్వరుల నవమాన పరచుచు బాధించుచుండెను. ఒకనాడు మహా శక్తి సంపన్నుడగు 'ధనుషాక్షి' అను మునివద్దకు పోయి అతనిని తిరస్కరించుచు అవమాన పరచెను. ఆ ముని కోపించి అతడు కాలి భస్మ మగునట్లు శపించెను. ఐనప్పటికిని మేధావి భస్మము కాలేదు. అపుడు ధనుషాక్షుడు యోగ దృష్టి చేత మేధావి ఆయుష్యమునకు కారణము పర్వతములు అని తెలిసికొనెను. పర్వతములు స్థిరముగా నిలిచి ఉన్నంతకాలము అతని ఆయుస్సు స్థిరమై యుండునట్లు దేవతలు అతనికిచ్చిన వరమును తెలిసికొని ధనుషాక్షుడు మహిషములచేత పర్వతములను భేదింపచేసెను. మేధావియొక్క ఆయుస్సునకు కారణమగు పర్వతములు నశించగనే అతడుగూడ మరణించెను. అప్పుడతని తండ్రియగు బాలధి మిక్కిలి దుఃఖించెను. అతని దుఃఖమునుజూచి అచటి మునులు నిట్లనిరి:-

"మానవునకు మరణ ధర్మము స్వాభావికము. కనుక నతడు ఏ విధముగగూడ దైవవిహితమగు కారణమును తప్పించుకొనజాలడు. అందువలననే ధనుషాక్షుడు ఈ బాలకుని ఆయుస్సునకు కారణభూతములగు పర్వతమును దున్నపోతులచేత భేదింపజేసి యతనిని నశింపజేసెను.

అనియిట్లు భరద్వాజుడు యవక్రీతునను మేధావి చరిత్ర చెప్పి "నాయనా వరములను పొందిన నీకుకూడ గర్వమువచ్చి మేధావికి పట్టిన గతిపట్టును జాగ్రత్తగా నుండుమని నీకు సూచించుచున్నాను. ఈ రైభ్యముని, ఇతని యిద్దరు కొడుకులు మహాశక్తి సంపన్నులు. కనుక నీవు రైభ్యునివద్దకు ఎప్పుడును పోవకుము. జాగ్రత్తగా నుండుము. రైభ్యుడు సమర్థుడు. కనుక క్రుద్ధుడై నిన్ను పీడించగలడు; అని భరద్వాజుడు యవక్రీతునకు ఉపదేశించెను ఆ మాటకు యవక్రీతు డంగీకరించి, తండ్రీ నిన్నువలెనే రైభ్యునికూడ పితృభక్తితో గౌరవించుచుండెదను. నీవు చింతించకుము" అని తండ్రికి మెరమెచ్చు మాటలుచెప్పి యవక్రీతుడు నిర్భయముగా భూమండలములో సంచరించుచు మునీశ్వరులను బాధించుచు అదియే తనకు ఆనందముగా భావించుచుండెను.

ఇట్లు నిర్భయముగా సంచరించుచు యవక్రీతుడు వైశాఖ మాసములో నొకనాడు రైభ్యుని యాశ్రమమునకు పోయెను. అనేక ఫలపుష్ప వృక్షశోభితమైన రైభ్యాశ్రమములలో కిన్నర స్త్రీవలె అందముగా తిరుగాడుచున్న రైభ్యుని కోడలిని యవక్రీతుడు చూచెను. సిగ్గుతో తలవంచుకొనియున్న ఆమె నతడు నిర్లజ్జుడై సేవించి రమింపజేయుము. అని కోరెను. ఆమె అతని కోర్కెను నెరవేర్చనిచో నతడు శపించునను భయముచేతను, తన మామయగు రైభ్యుని తపః ప్రభావముచేత తరిగి తనకు ఉన్నతి, యవక్రీతునకు నాశము తప్పక సిద్ధించునని తలంచుటచేతను, యవక్రీతుని కోర్కెకు అంగీకరించి ఏకాంతమునకు తోడుకొని పోయి మోహసముద్రములో ముంచెను.

ఆ తరువాత ఆమె దుఃఖించుచు నాశ్రమములో కూర్చొని యుండగా రైభ్యముని వచ్చిచూచి ఆమె దుఃఖకారణమును గూర్చినడిగెను. ఆమె జరిగిన సంగతియంతయు చెప్పెను అప్పుడు రైభ్యుడు అగ్నివలె మండుచు తనజట నొకదానిని ఊడబెరికి అగ్నిలో హోమముచేసెను. వెంటనే ఆ యగ్నికుండమునుండి ఆమెవంటి రూపసౌందర్యముగల యొక స్త్రీ (కృత్య) పుట్టెను. రైభ్యుడు మరియొక జటనుపెరికి తిరిగి అగ్నిలోవేయగా దానివలన ఘోరాకారముగల రాక్షసుడు జనించెను. యిరువురు రైభ్యునితో మాకు ఏమియాజ్ఞ ?' అని ప్రశ్నించిరి. వెంటనే మీరు యవక్రీతుని సంహరించిరండు. అని రైభ్యుడు ఆజ్ఞాపించెను. వారు యవక్రీతుని వద్దకుపోయిరి. ఆ స్త్రీ అతనిని మోహపరచి, యతని కమండలమును లాగుకొనెను. జలపాత్రము తొలగినంత మాత్రమున యవక్రీతుడు అపవిత్రుడయ్యెను. ఆయదను కనిపెట్టి రాక్షసుడు త్రిశూలముగొని యతనిని వధింపబోయెను. అతడు భయపడి నీటివద్దకు పోయి ఆచమనాదులుచేసి పవిత్రుడై రాక్షసుని ఎదిరింపవచ్చునని ఆ సమీపమునందలి కొలనువైపు పరుగెత్తిపోయెను. అందులో

నీరు లేకుండెను. అది చూచి యతడు భయపడి అన్ని నదులకు పరుగెత్తిపోయెను. రైభ్యుని తపః ప్రభావముచేత నదులన్నియు నెండిపోయియుండెను అప్పుడు యవక్రీతుడు గత్యంతరములేక తనతండ్రి యొక్క అగ్నిహోత్రగృహములోనికి జలమునకై దూరుటకుపోగా ఆ ద్వారమునందు కావలిగాయుచున్న అంధుడగు ఒక బంట్రౌతు అతడు భరద్వాజ సుతుడని తెలియక అతనిని ఆపి పట్టుకొనెను. అంతలో రాక్షసుడు సమీపించి శూలముతో రొమ్ములో పొడిచి యవక్రీతుని చంపెను. పిదప ఆ రాక్షసుడు ఆ స్త్రీతోపాటు అచటనే నివసించుచుండెను.

భరద్వాజుడు స్నానసంధ్యాదులు ముగించుకొని తన ఆశ్రమమునకు తిరిగి వచ్చెను. పూర్వమువలె అగ్నులు తనకు స్వాగతము చెప్పకుండుటనుచూచి యిచట నున్న అంధసేవకునితో 'ఏమి నేడు ఆశ్రమమిట్లున్నది? నీవు గూడ పూర్వమువలె కనపడుటలేదు నా పుత్రుడగు యవక్రీతుడొకవేళ రైభ్యునికడకుపోయి ఆపదపాలాయెనాయేమి?' అని ప్రశ్నించెను. దానికి సేవకుడు 'మహాత్మా! నీ కొడుకు మందబుద్ధిచేత రైభ్యునివద్దకు పోయెను. రైభ్యునిచేత సృష్టింపబడిన రాక్షసునిచేత తరుమబడి జలము కొరకు ఈ యాశ్రమములో దూరుచుండగానే పట్టుకొంటిని. అంతలో రాక్షసుడు, వచ్చిచంపెను. పుత్రమరణముచేత నీకు అశౌచము కలిగెను గనుక అశుచివగు నీకు అగ్నులు నేడు స్వాగతము చెప్పలేదు.' అని చెప్పెను.

భరద్వాజుడు పుత్రుని తలచి మిగుల దుఃఖించి పుత్రమరణమునకు కారణమగు రైభ్యుడు అతని జ్యేష్ఠపుత్రునిచేత చచ్చుగాక యని శపించెను. "అపుత్రకులకు పుత్రశోకము ఉండదు కనుక సపుత్రకులకన్ననూ వారే సుఖులు. పుత్రులుగల నావంటివారు పుత్రమరణముచేత దుఃఖించుటయేగాక రైభ్యునివంటి యిష్టమిత్రులనుగూడ శపించవలసివచ్చెనుగదా'అని భరద్వాజుడు మిగుల చింతించి పుత్రునకు దహనసంస్కారాలుచేసి తానుగూడ పుత్రశోకమును భరించజాలక అగ్నిప్రవేశముచేసెను.

ఆ సమయమునందే 'బృహద్‌ద్యుమ్నుడు' అను మహారాజు ఒక గొప్ప యాగము చేయదలచెను. ఆ రాజు రైభ్యునకు యజమానుడుగా నుండెను గనుక రైభ్యపుత్రులగు 'అర్వావసు-పరావసు'వులను ఆ యాగములలో సహాయకులనుగా వరించెను. దానికి రైభ్యుడంగీకరించి పుత్రులను యాగనిర్వహణార్థమై పంపి తాను, తన కోడలగు పరావసువు భార్యతోపాటు ఆశ్రమములో నివసించుచుండెను. ఆ తరువాత కొంతకాలమునకు పరావసువు తన యింటినిచూచుటకు పోవుచు దారిలో మృగచర్మము కప్పికొని వనములో సంచరించుచున్న తండ్రిని చూచెను. పరావసువు తండ్రియని తెలియక అది మృగమని తలచి వేకువచీకటిలో అంధుడై ప్రాణభీతి చేత తండ్రిని హత్యచేసెను. ఆ తరువాత తండ్రియని తెలిసి మిగుల దుఃఖించి యతనికి ప్రేతకార్యములు చేసి తిరిగి యాగనిర్వహణార్థమై బృహద్ద్యుమ్నుని యాగశాలకు పోయెను.

అచటనున్న తన సోదరుడగు అర్వావసువుతో జరిగిన సమాచారమంతయుచెప్పి 'సోదరా! హింసకమృగమని తలచి నేను పితృహత్య చేసితిని. నీవొక్కడవీయాగమును జరిపించజాలవు. కనుక నీవు నాకు గలిగిన బ్రహ్మహత్యా నివారణార్థమై వ్రతముల నాచరించుటకుపొమ్ము, నేనొక్కడనే యీ యాగమును పూర్తిగా నిర్వహించగలిగెదను. నాకు ఆ సామర్థ్యము గలదు, అని చెప్పి అర్వావసువును పంపెను. అతడంగీకరించి సోదరుని బ్రహ్మహత్యకు నియతేంద్రియుడై ప్రాయశ్చిత్తము చేయుటకు పోయెను. ఆ వ్రతమును ముగించి తిరిగి యజ్ఞశాలకు వచ్చెను'.

అట్లు వచ్చిన అర్వావసువునుచూచి సోదరుడగు పరావసువు ద్రోహచింతనముతో బృహద్ద్యుమ్న మహారాజుతో నిట్లనెను:— 'రాజా! ఈ అర్వావసువు బ్రహ్మహత్యా దోషదూషితుడు. అందుచేత ఇతనిని యజ్ఞశాలలో ప్రవేశింపజేయకుము. ఇతని దృష్టి పడినంతమాత్రముచేత నీవు అనేక కష్టములకు లోనగుదువు. కనుక ఇతనిని రానీయకుము.

ఆ మాటలు విని రాజు తన సేవకులతో అర్వావసువును లోపలికిరానీయక బయటికి గెంటించెను. 'బ్రహ్మహత్య చేసినవాడు పరాసువుగాని నేనుకాను. ఇతని దోషమునకు ప్రాయశ్చిత్తము చేసి నేను ఇతనిని ఆ దోషమునుండి విముక్తుని చేసివచ్చినాను'అని యెంత చెప్పినను వినిపించుకొనక రాజసేవకులు 'బ్రహ్మహంతవు నీవు' అని దూషించుచు అర్వావసువును వెలుపలికి గెంటిరి. అప్పుడా బ్రహ్మర్షి యాగశాలను వీడి అడవికిపోయి ఘోర తపస్సుచేత సూర్యునారాధించగా సూర్యుడు సంతుష్టుడై అర్వావసువునకు దర్శనమిచ్చెను. దానితో సూర్యాదిదేవతలందరు అర్వావసువునెడల అనుగ్రహముగలవారై యతనిని తిరిగి యాజకుడుగా నియమించిరి.

(సశేషము)

మాధవీయం

— దేవులపల్లి ప్రభాకరరావు

చిరంజీవి సౌభాగ్యవతి
చెల్లెలు అరవిందకు ఆశీస్సులు—
ఇక్కడంతా క్షేమం అని
ఒక్క ముక్కలో చెప్పేస్తాను,
పేరు పేరునా ప్రతి వొక్కరిని గురించి
ప్రస్తావించి వ్రాసే ఓపిక లేదు !
నిజానికి నిన్ను అందరూ జ్ఞాపకం చేస్తున్నారు,
రోజా పాపతో కలుపుకొని నీ
ముగ్గురు కోడ ఆరుగురు అల్లుళ్లూ
అత్తయ్య అరవింద ఎప్పుడొస్తుందని
ఒక్కటే కలవరిస్తున్నారు,
తాబట్టిన కుందేటికి మూడే కాళ్లని
నిప్పుతో చెలగాటం ఆడి
ముప్పులో మునిగిపోయి
తుప్పు పట్టిన భావాల బరువు మోయలేక
జీవితంలో ఓడిపోయిన మాధవి
వాడిపోయిన మల్లె పువ్వులా ఉంది !
చిన్నపాప కేరుమని ఏడిస్తే
చికాకు పడిపోతున్నది,
ఆన్నా 'అమ్మా ఆకలే' అంటే
అంతులేని కోపం ఆవహిస్తున్నది,
చిన్నా వచ్చి చిన్నబోయి ప్రక్కన కూర్చుంటే
చిరుబురు మంటున్నది,
వెన్న ముద్దల దొంగవలె కన్నా
వెక్కి వెక్కి ఏడ్చుకుంటూ వెన్ను మీద వాలబోతే
విసుగును విసురుతూ రుస రుస లాడుతున్నది,
నీ ఒదినె మాధవిలో నాటి నయగారాలు
వెనుకటి వాడి లేవిప్పుడు !
వేదన, నైరాశ్యపువేడి ఆమెలో విపరీతాలను సృష్టిస్తున్నవి,
ఓటమి తనను చాటుమాటుగా కాటేసినట్టు కుమిలిపోతున్నది !
అస్తమానం అనారోగ్యంతో బాధ పడుతున్న అంజిబాబు
పుస్తకాలు లేక బడిమానుకున్న పెద్దబాబు
పీడ కలల భయంకర దృశ్యాలుగా
అన్ని వైపుల నుంచి ఆమె మీద దాడి చేస్తున్నారు !
అరవిందా, అందమైన భవిష్యతును
చేజేతులా చిందర వందర చేసుకోవద్దని
ఎన్నిసార్లు నువు హెచ్చరించలేదు ? !
పల్లవించనున్న జీవిత పారిజాతాన్ని
కల్లోలపు పెనుగాలి బారినుంచి
పదిలంగా కాపాడుకొమ్మని
ఎన్నిసార్లు నువు విన్నపాలు చేయలేదు
గడుసుగా, బిరుసుగా
'నీకు నీ మాటల నీతులకూ ఓ నమస్కారం' అంటూ
మాధవి తన జీవిత మందారం చుట్టూ
ముళ్ళ పొదలను పెంచుకున్నది !
స్వయం కృతాపరాధం వల్ల సరీసృపాలుగా
బుసలు కొడుతున్న ఈ అక్షయ సమస్యలను
నీకేమని వల్లించాలి !
పశ్చాత్తాపంతో గుండె పెకిలిపోతున్న మాధవి
చకోర పక్షివలె నీ కోసం ఎదురు చూస్తున్నది,
నీ ఒడిలో తలను వాల్చి, కన్నీరు మిన్నేరుగా ఏడ్చి
గుండె బరువు దింపు కోవాలని నీ కోసం
వేయి కళ్ళతో వెదికి చూస్తున్నది,
అందమైన లోకాలకు ఆహ్వానం పలికే
ఆధునిక భావాల హారతీ,
సుందర స్వప్నాలు రూపించిన భారతీ
అరవిందా, ఆలస్యం చేయకుండా రా ! !

మన జానపద సాహిత్యం
కార్మిక గేయాలు

ఏంజమూరి సితాదేవి

ఆంధ్రుల వాఙ్మయచరిత్రలో, జానపద సాహిత్యానికి ప్రత్యేక స్థానం వుంది. జానపద సంగీతప్రభావం. క్షేత్రయ్య, రామదాసు, అన్నమాచార్యులు, త్యాగరాజు వంటి వాగ్గేయకారుల కృతులలోలాగే, జానపద సాహిత్యప్రభావం. మన ప్రాచీన, నవీన కవులెందరి రచనల్లోనే విశేషంగా కనబడుతుంది. అసలు ఆటా పాటా మాటలేనిదే మానవత్వమేలేదు. సాహిత్య కృషిచేసిన వారైతే, తెలిసి కవిత్వం చెప్పుతారు. సాహిత్యంతో ఏ సంబంధమూలేని కోట్లాది గ్రామీణులనుంచి, ఆలా కాక, వాళ్ళకే తెలియకుండా వెలువడే పాటలు, జానపదసాహిత్యం అయింది. తెలిసి వ్రాసిన కవితలో "ఇదిగో; ఈ పద్యం. ఈ పాటా వ్రాసింది నేనే" అంటూ రచయితే పైకి పొక్కుతుంటాడు. తెలియకుండా పుట్టుకొచ్చిన జానపద గేయాలకు రచయిత అనామకుడు అదృశ్యుడు అసలు జానపదగేయం అనేది. వేదాలలాగే పాడినదే కాని వ్రాసినదికాదు. ఏ ఒక్క జానపదగేయానికీ రచయిత ఒక్కడు కాడు, అది బృందరచన ! ఒక గ్రామపు వ్యవస్థయొక్క సమిష్టి రచన.

జానపదసాహిత్యంలో కవి మాటా పాటా పెనవేసుకుని వుంటాయి. త్రివేణిలాగా, జానపదగేయాలు గ్రామస్థుల నిత్య జీవితాల అలజడి నుంచి, వాళ్ల వృత్తుల ఒత్తిడినుంచి, కష్టసుఖాల రాపిడినుంచి ఉద్భవించిన సజీవరచనలు. వాటిలో గ్రామసుల ఆశయాలూ, అభిరుచులూ ప్రవృత్తులూ ప్రకోపాలూ ప్రతిబింబిస్తూ వుంటాయి. అందుచేత అవి పాత పడడం తుప్పుపటడం అంటూ వుండదు. అవి నిత్యనూతనమైనవి.

తెలుగువారి జానపథ సాహిత్యం ఒక మహాసముద్రం. మద్రాసు నుంచి బరంపురం వరకూ వున్న వేలాది గ్రామాలలోని ప్రజలు తమ హృదయ తంత్రులు స్పందించినప్పుడల్లా పాడుకునే పాటలు ఎన్నివేలో లక్షలో ఎన్నిరకాలో చెప్పలేము. మహాకవుల పద్యాల్లాగ పాటల్లాగ జానపథ గేయాలుకూడా ఆడుకునే పిల్లలాగ, నునుసిగ్గుముగొత్తిగించి చూసే ముగ్ధలాగ ఈదురోమని ఈదే రహదారి పడవలాగ, కదం త్రొక్కే గుర్రంలాగ ఎన్నెన్నో లయ విన్యాసాలతో నడుస్తాయి. వీటిలో జోలపాటలు పిల్లల ఆటపాటలు పెళ్ళిపాటలు, ప్రేమగీతాలు, విరహగీతాలు, వృత్తిపాటలు, పండుగలపాటలు, తత్వాలు–ఇలాఎన్నో రకాలున్నాయి.

ఈ పాటల్లో అసంఖ్యాకులైన గ్రామీణుల హృదయాలకు సన్నిహితమైనవి. ఎక్కువగా వ్యాప్తి పొందుతున్నవి వృత్తిపాటలు, గ్రామస్తులు వివిధవృత్తులుచేసి జీవిస్తూంటారు. వ్యవసాయ వృత్తి చేసే వారందరినీ, కార్మికులనీ కర్మాగారాల్లో పనిచేసే వారందరినీ కార్మికులనీ సామాన్యంగా అంటుంటాం. ఈ రెండు ప్రధాన వత్తులవారూ కాక దంపుళ్ళవాళ్లు, పడవవాళ్లు, పాములవాళ్లు, రోడ్డుపనివాళ్లు, సాలెవాళ్లు, వడ్రంగులు, జాలరులు, ఎరుకలు కమ్మరులు, కంసాలులు ఇలాగే చిన్నవృత్తులు చేసుకుని బ్రతికే వారు ఎందరోవున్నారు. ఇలా ఏదోవృత్తి–కర్మ చేసుకునే వారందరినీ కలిపి, మొత్తంమీద 'కార్మికులు' అనీ, వాళ్ల పాడే పాటల్ని 'కార్మికగేయాలు' అని అంటుంటాం.

జానపదులకు ఏవృత్తీ ఆటపాటలు లేకుండా సాగదు: ఏ వృత్తి శ్రమ లేకుండానూ సాగదు. అంతో ఇంతో చెమటోడ్చకుండా సంపాదించే వృతులు, బహు అరుదు. కార్మికులకు, తాము పడేశ్రమ అను నిమిషం జ్ఞాపకం వస్తూంటే, పని సక్రమంగా సాగదు. కాబట్టి ఆ శ్రమను మరచిపోవడం కోసం ఏ వృత్తివారు ఆ వృత్తికి సంబంధించిన పాటలు పాడుకుంటూ పనిచేస్తారు. అప్పుడు వారి అలసట ఆనందంగా ఆరోగ్యంగా మారుతూంటుంది.

కార్మికగేయాలంటే ఇన్ని వృత్తులకు చెందినవి కనుక జానపదగేయాల రకాలన్నింటిలో వీటికి చిన్నెలూ వన్నెలూ ఎక్కువ. ఒక్కొక్కవృత్తి ఒక్కొక్క లయలో సాగుతుంది. కాబట్టి కార్మికుల పాటలు ఆయా వృత్తుల ప్రత్యేక లయల్లోనే వుంటూంటాయి. అంటే వృత్తిలయా, దానికి సంబంధించిన పాట లయా ఒక్కటే అన్నమాట. ఉదాహరణకు:—

"గోదారీ తల్లికీ గొజ్జంగి పూదండ

అని కళాసులు రహదారి పడవను ఈడుస్తూ పాడేపాట వాళ్ళునడిచే 7 మాత్రల మిశ్రచాపు తాళంలోనే నడుస్తుంది.

"ఎయిర సిన్నోడైరా ! ఎయిరా, నీ జోరుగాల !"

అని పడవల్లోకి బస్తాలుమోసే కూలీలు, ఒగరుస్తూపాడే పాట, వాళ్ల బస్తాలు ఎత్తిపడేసే త్రిశ్ర (3 మాత్రలు) చతురశ్ర (4 మాత్రలు) గతుల్లోనే నడుస్తుంది, అలాగే:—

"కొడుకంటూపుట్టాడు, కొత్తాకోరంగీ ఓలమ్మా"

మొదలైన దంపుళ్ళపాటలు. వాళ్ళు దంచే లయ త్రిశ్రం కనుక అందులోనే నడుస్తాయి. అందువల్ల కవుల వృత్తాల్లాగే కార్మికుల వృత్తిపాటలు వివిధ గతుల్లో నడుస్తాయి. ఎటొచ్చీ కవులు సాహితీపరులు కనుక కలం పట్టుకుని నడిపిస్తారు. జానపదులు, వారిలాగ చదువుకున్నవారు కారు, అయినా వారి వృత్తుల లోని శ్రమ, ఆవృత్తులు నడిచే లయలు–వీటి రాపిడికి ఉద్రేక పూరితమైన గేయాలు, అయాచితంగా పుట్టుకువస్తాయి.

నిత్యజీవిత సంఘర్షణల నుంచి అవతరించిన ఈ కార్మిక గేయాల్లో యతి, ప్రాస, అంత్యప్రాస వంటి రకాలెన్నో అప్ర

యత్నంగా దొర్లుతూంటాయి. రచయిత ఆలోచించి వ్రాసే పాటలైతే ఈ రక్తులు బుర్రకి తట్టుతాయి. కాని, జానపద గేయం వ్రాయబడినదీకాదు, ఏ ఒక్కడి రచనాకాదు. అవి వేదాలు సంత చెప్పుకొన్నట్లు, ఒకరినోట మరొకరికి (Oral tradition) సంక్రమించవలసినవే. జానపదగేయమనేది కొందరు కలిసి తలో మాటో, తలో వాక్యమో కేవలం ఉద్రేకంవల్ల ఆశుధారగాపైకి అనేస్తూంటే ఎన్నో నీటిబిందువులు కలిపి మేఘమైనట్లు దానంతట అదే తయారైన బృందరచన కాబట్టి జానపదగేయాల్లో యతులు, ప్రాసలు అంత్యప్రాసలు మొదలైనవి అక్కడక్కడ దొర్లాయంటే అవి ఆ జానపదుల తలల్లో ఇమిడివున్న ఏదో ఒక ప్రేరేపణ—Instinct బట్టి అప్రయత్నంగా వచ్చిపడ్డవే అలాంటి రక్తులు కొన్ని సూచిస్తూ ఉదాహరణలిస్తాను.

"కొడుకంటూపుట్టాడు, కొత్తాకోరంగి—ఓలమ్మా!
కోడలంటూ వచ్చింది, రవ్వల్లారాణీ! హూం హూం హూం హూ!

ఇదొక దంపుళ్ళ పాట పల్లవి. ప్రతి జానపదగేయానికీ యతి, ప్రాసలు, అంత్యప్రాసలూ వుంటాయనుకోకండి. ఎందుకంటే అవి వ్రాయబడినవికావు కనుక ఈ రక్తులు అన్నీకాన్నో అక్కడక్కడ మాత్రమే కనబడుతూంటాయి. పై పల్లవిలో మొదటి వాక్యంలో యతి మాత్రమే వుంది. తర్వాత ఒక చరణం—

"అత్త లేని కోడలూ, ఉత్తమురాలు— ఓలమ్మా!
కోడ ల్లేనీ అత్త, గుణవంతురాలు!"

దీనిలో యతులూవున్నాయి, అంత్యప్రాసావుంది. మొదటి వాక్యంలో ప్రాసకూడా వుంది. మరొక చరణంలో—

"కాకమ్మ కూసింది, చుట్టమొస్తాడు మాయింట
దాక సద్దిముంత, దాచి తొంగుంటా!"

దీనిలో మొదటి వాక్యంలో యతి లేదుకాని మిగతావన్నీ వున్నాయి.

అలాగే—

" గోదారి తల్లికి గొజ్జంగి పూదండ
కావేరికి నల్ల కల్వదండ "

అనే ప్రసిద్ధమైన పడవపాటలో అన్నిరక్తులూవున్నాయి. ఇలాంటి రక్తులు కార్మికుల పాటలెన్నింటిలోనో కనబడతాయి

కార్మికులు కష్టజీవులు కాబట్టి తమపాటల్లో కొన్ని నీతులు, లోకోక్తులూ చెబుతూంటారు; పట్టణవాసులంత మాయామర్మం తెలియనివారు కనుక మధ్య మధ్య తమ కుటుంబ పరిస్థితులుకూడా సూచనగా ఆ పాటల్లో ప్రతిబింబింపచేస్తూంటారు. దీనికి ఉదహరణగా—రెండు చరణాలు దంపుళ్ళపంట నుంచి—

"ఒకడీపచ్చాచూసి ఒలపోయరాదు ఓలమ్మా!
వాజిమాలిన దేముని వరమడుగుతాను— హూం హూం"
"అత్త లేనీ కోడలూ ఉత్తమూరాలు ఓలమ్మా!
కోడల్లేనీ అత్త గుణవంతూరాలు— హూం హూం"

అలాగే—

"ఈ వూరి మారాజు అయిదాణలిత్తేను
ఆవూరి మారాజు ముప్పావలిత్తాడు;
పోదారి రాయే తూరుపోల బుల్లెమ్మా!

అని కూలిపనివాళ్లు స్థానిక సమస్యల్ని గురించి కూడా వాళ్లల్లో వా పాటల్లోనే సంప్రదించుకుంటూంటారు

శ్రమపడకుండా తినికూర్చోగల కార్మికుడంటూ వుండడు కర్షకునికిలాగే కార్మికునికికూడా, అలసటా, ఆయాసం ఒక్కనాడూ తప్పవు. వాళ్లు తమ వృత్తి ధర్మమూ నిర్వర్తించాలి. అందువల్ల పొందుతూన్న శ్రమనూ తాత్కాలికంగా మరచిపోవాలి. అందుకే కాబోలు దేముడు వాళ్లలో కొంత హాస్యప్రవృత్తి ప్రవేశపెట్టాడు. మధ్యమధ్య ఈ హాస్యమే వాళ్లని కవ్విస్తూండకపోతే వాళ్ల జీవితాలు వాళ్లకే విషాదంగా అనిపిస్తాయేమో! ఈ కార్మిక హాస్యానికి ఉదాహరణలిస్తాను - దంచలేక దంచలేక ఆయాసంతో డొక్కలెగరేస్తూ కూడా. దంపుళ్లవాళ్ళు హాస్యం వదలరు. ఇలా అంటుంది—

"మొగుడూమొగుడూ, వీడి
మొగమూ తగలెయ్యా! ఏం మొగుడూ?
మొన్నటిదాకా, తంతూనెవున్నాడు! హూం హూం!

మరొకర్తె ఇలా—

"ఆ కొండబోడి, ఈ కొండబోడి, నడేన్ని
మా యింటివారి, నడినెత్తిబోడి! హూం హూం!

అలాగే పడవల్లోకి బస్తాలు మోస్తూ, మూర్ఛపోయేటంతగా ఓగరుస్తూండే పడవ కూలీలు కూడా, ఆమోత మధ్యలోనే—

"ఎయిర సిన్నోడైరా! ఎయిరా, నీ జోరుగాల!
ఎయిర సిన్నోడైరా, ఎయిరా సిన్నోడైరా!"
"ఇంటబుట్టినా ఎద్దులాగ
మొద్దుకింద ఉండకురో.
ఎయిరా నీజోరుగాల"
"ఇంటబుట్టినా బోడెద్దు
చూడబోతె బల్మద్దు
తిండిదగ్గరా, అడ్డులేదురా!
ఎయిరా నీజోరుగాల!"

అంటూ, ఇలాంటి హాస్యధోరణిలో, తమ పనీ పాటా సాగిస్తారు.


కార్మికుల పాటల్ని గురించి విపులంగా వ్రాయాలంటే, ఇంత చిన్న వ్యాసం చాలదు. తెలుగువారం కనుక, మన జానపద గేయాల్లో ఇంత గొప్పదనం వుంది— అని చెప్పుకోడానికని, జానపదగేయ సముద్రం నుంచి ఒక్క అల-కార్మికగేయాలు—మాత్రం మీపైకి ప్రసరింపచేశాను. అంతే.

★

పెంబర్తిలో కళాత్మకమైన షీట్ మెటల్ పరిశ్రమ


ఎ. పండరినాథ్

ప్రాచీన కాలంనుంచీ మనదేశం చేతి పరిశ్రమలకు పుట్టినిల్లు. చేతితో తయారైన వస్తువులలో హస్తకళానైపుణ్యం, అద్భుత సృజనాశక్తి, మేధాశక్తి ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. అసలు యంత్రాలలో తయారైన వస్తువులకూ, చేతితో తయారైన వస్తువులకూ గల తేడా ఇదే. చేతివస్తువులకు సంబంధించిన పద్ధతులు, నమూనాలు ఈ నాటివికావు. ఆ సంపద తరతరాలది. మన దేశంలో వేర్వేరు ప్రాంతాలలో జీవిస్తూ, వంశ పారంపర్యంగా వస్తున్న కళానైపుణ్యాన్ని, భద్రపరచుకుంటూన్న కళాకారుల ప్రజ్ఞకు తార్కాణమే ఈ నాటి చేతి పరిశ్రమలు.



హాంగింగ్ లైట్ షేడ్

పూర్వకాలంలో రాజుల ఆదరణకు ప్రీతి పాత్రమై విరాజిల్లిన చేతి పనుల పరిశ్రమ, బ్రిటిషు వారి హయాంలో ఆదరణ లేక క్షీణించసాగింది. అయితే దేశస్వాతంత్ర్యానంతరం చేతి పరిశ్రమలు నూతనోత్తేజం పొంది పూర్వంకంటే ఉన్నత శిఖరాలను అధిగమించ యత్నిస్తున్నవి. కళాకారులలో హస్తకళా నైపుణ్యం, కల్పనాశక్తి, మేధాశక్తి దినదినం ఎంతో పురోభివృద్ధి చెందుతున్నది. కళాకారులు అనాదిగా ఉపయోగిస్తున్న పనిముట్లను వదిలి ఆధునాతన పనిముట్లను ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం అనుక్షణం కళాకారుల ఇబ్బందులను గుర్తిస్తూ వారి కళాభివృద్ధికి, జీవనోపాధికి చేయూత నిస్తున్నది. చేతి పరిశ్రమలను అభివృద్ధి పరిచే ఉద్దేశంతో. తయారైన వస్తువులకు సంబంధించిన ఒక మండలిని ఏర్పాటు చేస్తూ పార్లమెంటు చట్టాన్ని కూడా రూపొందించింది.




టేబిల్ లాంప్

చేతితో తయారైన వస్తువులలో దంతపు బొమ్మలు, రాతి బొమ్మలు, కొమ్ములతో చేసే బొమ్మలు, నగిషపని, నూలు వస్త్రాలు, వెదురు బుట్టలు ఒకరకానికి చెందినవైతే లోహపు సామానులు మరొక రకానికి చెందినవి, వంటింటో ఉపయోగించే పాత్రలు మొదలు గుడి గంటలు, విగ్రహాలవరకు రాగి, ఇత్తడి, కంచు లోహాలను ఉపయోగించి వృత్తి పనివారు కళాకృతంగా

తయారుచేస్తున్నారు. ఇవన్నీ అనాదినుంచి వస్తున్నవే. కాని నేడు, మారుతున్న ప్రపంచంలో మారుతున్న సమాజానికి అనువైన నూతన వస్తువులను, విదేశీయుల అవసరాలకు అనుగుణంగా అధునాతన పద్ధతులలో వస్తువుల తయారీకి ఎంతో కృషి జరుగుతున్నది. ముఖ్యంగా వివిధలోహాలతో అధునాతన పద్ధతులలో అలంకరణ సామగ్రిని వరంగల్ జిల్లాలోని పెంబర్తిలో తయారు చేస్తున్నారు.

పెంబర్తి ఒక చిన్న గ్రామం అయినా ఇచట తయారయ్యే అధునాతన అలంకరణ వస్తువులు అమెరికా, జపాన్, కెనడా, పాకిస్తాన్, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియాలకూ, ఐరోపా ఖండం లోని దేశాలకూ ఎగుమతి చేయబడుతున్నాయి. ఇప్పటి వరకు మనదేశంనుండి వేర్వేరురకాల వస్తువులు మొత్తం రూ. 69 కోట్ల విలువ మేరకు ఎగుమతి అయినట్లు తేలింది. అందులో విలువైన రత్నాలకు 44 కోట్ల 80 లక్షలు పోగా లోహపు సామానుల విలువ 5 కోట్లవరకు వున్నదని అంచనా వేశారు.




మధుకలశం

షీట్ మెటల్‌తో డెకరేటివ్ హాండీక్రాఫ్ట్స్ వస్తువులను తయారుచేసే కేంద్రాలలో పెంబర్తి ప్రసిద్ధిచెందినది. అధునాతన పద్ధతులలో వివిధ లోహాలతో అలంకరణ వస్తువులను తయారు చేసే చేతి పరిశ్రమల కేంద్రాలలో మొదటి స్థానం ఈ గ్రామానికే లభిస్తుంది. అనాదినుండి ఈ గ్రామం విగ్రహాల పోతకు పేరెన్నిక గన్నది. కాలంతీరు, సమాజానికనుగుణంగా ఇచటి కళాకారులు తాముచేసే పనులలో ఎన్నోమార్పులు ప్రవేశ పెట్టారు. ఒకప్పుడిచటి కళాకారులు సాగదీసిన లోహపు రేకులతో వివిధ వంట పాత్రలను తయారుచేసేవారు. కాని నేడు ఇచటి కళాకారులు తమ మేధస్సును, సృజనాశక్తిని వినియోగించి అవే సాగదీసిన రేకులతో వివిధ రీతులలో కళాత్మకమైన అలంకరణ వస్తువులను తయారు చేస్తున్నారు.

ఒకప్పుడిచట కళాకారుల కుటుంబాలు వందకు పైగా ఉండేవి. జీవనోపాధికై కొన్ని కుటుంబాలు ఇతర ప్రాంతాలకు ముఖ్యంగా హైదరాబాదు నగరానికి వలసపోగా నేడిచట సుమారు నలభై కుటుంబాలు ఈ వృత్తి పనిని కొనసాగిస్తున్నవి. అందులో షీట్ మెటల్‌తో చేతి పనులను తయారుచేసే కుటుంబాలు పది వరకుంటాయి.

ఈ కుటుంబాలు అహర్నిశలూ శ్రమించి తమవృత్తిలో రోజు రోజుకూ ఏదో ఒక నూతనత్వాన్ని ఆకర్షణను ప్రవేశపెడుతున్నాయి. ఇటీవలే షీట్ మెటల్ పనిలో కృషి జరిపి అధునాతన ఫలితాన్ని సాధించినందుకు కేంద్ర ప్రభుత్వం 1970 సంవత్సరానికి ఈ గ్రామానికిచెందిన కళాకారుడు శ్రీ అయిలా ఆచార్యకు యోగ్యతా పత్రాన్ని బహూకరించింది.


1970 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం దేశంలోని వివిధ చేతి పనులను కొనసాగించే 25 మంది కళాకారులకు యోగ్యతా పత్రాలను బహూకరించింది. షీట్ మెటల్ పనిలో యోగ్యతా పత్రాన్ని పొందిన కళాకారుడు శ్రీ ఆచార్య ఒకడు మాత్రమే. శ్రీ ఆచార్య తన కళాకౌశల్యాన్నంతా వినియోగించి షీట్ మెటల్‌తో మధు పాత్రను, ఎంబోజింగ్ చెక్కడంలో వివిధ లతలను, పూలను క్రొత్త క్రొత్త డిజైన్లతోను అలంకరించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాడు. ప్రస్తుతం ఈతను ఇచట నడిచే షీట్ మెటల్ ట్రైనింగ్ సెంటర్‌కు మాస్టర్ క్రాఫ్ట్సమన్‌గా పని చేస్తున్నాడు.



కలశ పాత్ర

కళాత్మకమైన ఇలాంటిపని ఇంతటితో నే నశించిపోకుండా ఉండడానికి అఖిలభారత చేతిపనుల మండలి ఇచట **Sheet Metal Training Centre** ను తెరిచి ఈ వృత్తిలో అభిరుచి గల కళాకారులకు శిక్షణ ఇస్తున్నది.

1966 నుండి 30 నెలలవరకు జరిగిన శిక్షణ కాలంలో ఆరుగురు కళాకారులకు శిక్షణ ఇవ్వబడింది ప్రభుత్వం మళ్ళీ ఈ సంవత్సరం ఇచట శిక్షణను ప్రారంభించింది. ప్రస్తుతం



పేపల్ కటౌట్

నలుగురు కళాకారులు ఇందులో శిక్షణ పొందుతున్నారు. వీరిశిక్షణా కాలం 24 మాసాలు. ఒక్కొక్క అభ్యర్థికి రూ. 80 చొప్పున స్టైఫండు లభిస్తున్నది.

ఈ గ్రామంలో తయారయ్యే అలంకరణ వస్తువులు హాంగింగ్ లైట్ షేడ్, కుషన్ చెయిర్స్, పేపర్ వెయిట్, ఫ్లవర్ వాజెస్, టేబుల్ లాంప్స్, ఆష్‌ట్రేస్‌లను కళాత్మకంగా మలిచిన తీరును చూస్తే ఆశ్చర్యంవేస్తుంది. ఇచట శిక్షణపొందే కళాకారులు ఆదిలోనే అద్భుతమైన కళను రూపొందించ గలుగుతున్నారు వీరు పనిచేసే కర్మాగారాలలో కళాకారులు ఉపయోగించే పనిముట్లు అతి సామాన్యమైనవి అందులోనూ ఈ పనిముట్లను వీరే తయారు చేసుకుంటున్నారంటే అతిశయోక్తి కాదేమో ! షీట్ మెటల్‌లో వీరు వివిధరకాల పనిని ప్రవేశపెట్టారు. అందులో ఎంబోజింగ్, కటౌట్, కట్ వర్క్, కాశ్మీరీ డిజైన్, ఇంగ్రేవ్‌లు ముఖ్యమైనవి

ప్రభుత్వ యోగ్యతా పత్రాన్ని పొందిన 35 సంవత్సరాల యువకళాకారుడే ఇచటి "విశ్వకర్మ ఇత్తడి, రాగి! వెండి పారిశ్రామిక సహకార సంఘానికి" అధ్యక్షుడుగా పనిచేస్తూ దీని అభివృద్ధికై పాటుపడుతున్నాడు. 1956లో 76 గురు సభ్యులతో, రూ. 4527.34 పెట్టుబడితో ప్రారంభమైన సంఘం ఇతని అధ్వర్యంలో ఎంతో పురోభివృద్ధి చెంది ప్రస్తుతం రూ. 12421-06 లాభంతో నడుస్తూ ఇతర సహకార సంఘాలకే ఒక ఆదర్శమైన సంఘంగా నిలిచిందంటే అతిశయోక్తి కాదేమో !

దేశం పారిశ్రామికంగా ముందంజవేస్తున్నప్పటికీ, ప్రాచీన కళావైభవం క్షీణించుపోవడం ముదావహం చేతికళలను జాగ్రత్తగా పదిలిపరచాలి. చేతిపరిశ్రమలను కొనసాగించే కళాకారులకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. చేతితో తయారైన వస్తువులను విరివిగా ఉపయోగించి కళాకారులకు జీవనోపాధిని కల్పించాలి. ఈ బాధ్యత కేవలం ప్రభుత్వానిదేకాదు. ప్రజలదికూడాను.

ఆంధ్రప్రదేశ్ జానపద సంగీత సలహా సంఘం పదవీకాలం పొడిగింపు

ఆంధ్రప్రదేశ్ జానపద సంగీత సలహా సంఘం పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం 1970 అక్టోబరు 15 నుంచి ఒక సంవత్సరం వరకు పొడిగించింది. ఈ సంఘం 1969 లో ఏర్పాటు చేయబడింది

ఈ సంఘం ప్రథమశ్రేణికి చెందినట్లుగా కూడా ప్రభుత్వం ప్రకటించింది.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి సేకరించిన వ్రాతప్రతులు, టేప్ రికార్డులు జానపద గీతాలను ఎన్నికచేసి జానపద గీతముల గ్రంథాలయం ఏర్పాటు చేయబడుతుంది ఈ గ్రంథాలయం సమాచార పౌరసంబంధ యాత్రా విషయాల శాఖలో వుంటుంది. జాతీయ పండుగలవంటి ముఖ్యమైన సందర్భాలలో ప్రభుత్వం ఏర్పాటుచేయు సాంస్కృతిక కార్యక్రమాలలో ఈ జానపద గీతములు ఉపయోగించబడుతాయి.

ఈ సంఘానికి ఉస్మానియా యూనివర్సిటీ రీడరు డా. బి. రామరాజు అధ్యక్షులు సర్వశ్రీ టి. దోణప్ప, ప్రయాగ నరసింహ శాస్త్రి, కొనరాజు రాఘవయ్య, ఎల్లోరా, శ్రీహరి ఆదిశేషు, గోపాలరాజ భట్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, శ్రీమతి వి. సీతాదేవి సభ్యులుగా వున్నారు.

సమాచార పౌరసంబంధ యాత్రిక విషయాల శాఖ అసిస్టెంటు డైరెక్టరు శ్రీ యన్. వి నారాయణరావు ఈ సంఘంలో సభ్యుడు_కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

ఆంధ్రస్తుతి

శాతవాహన వంశ సంభూతులై యొప్పు
కుంభినీధవులచే కొన్నినాళ్ళు
కాకతీయాన్వయ క్ష్మాపాలుర విశిష్ట
కూలంకష ప్రజ్ఞ కొన్నినాళ్లు
చాళుక్య రాజేంద్ర సంస్తవనీయ మ
హోన్నత శక్తిచే కొన్నినాళ్లు
తుళువ వంశీయ నిస్తుల శౌర్య ధైర్యాది
గుణవితానంబుచే కొన్నినాళ్లు

సేవితంబయి ఆసేతు శీతశైల
భారత వసుంధరాస్థలి భవ్య కీర్తి
మించు జనయిత్రి, ఆంధ్రలక్ష్మి ! త్వదీయ
పాదపద్మంబులకును మా వందనంబు ॥

పాడు బీడుల దున్ని బంగారు పండించు
ఘనశక్తి సంయుతుల్ తెనుగువారు
శిలలయందు సజీవచిత్రముల్ నిల్ప నై
పుణి సిద్ధహస్తులు తెనుగువారు
మృదుల గానంబున హృదయంబు లలరించు
వినుత కళానిధుల్ తెనుగువారు
దాన ధర్మంబుల ధైర్య సాహసముల
మునుముందు జనువారు తెనుగువారు

భారత జ్ఞాన విజ్ఞాన సౌరభంబు
దిసల బరపిన వారలు తెనుగువారు
భూతలంబున నగ్రతాంబూలమంది
ఘనత గాంతురుగాత మా తెనుగువారు ॥

రాజులు నేడులేరు, ప్రజ
రాజ్యము నేలెడి కాలమిద్ది; ని
ర్వ్యాజ పరోపకారమతి
నందరు దీక్ష వహించి ధర్మమం
దే జరియించి యాంధ్రభువి కెక్కుడు
గూర్పుడు భోగభాగ్యముల్
మీ జనయిత్రి సంబ్రపడు; మీ భవముల్
గనునయ్య ధన్యతన్ ॥

భారత భూతలంబునకు
భవ్య విభూషణమై తనర్చు నా
తీరున నాంధ్రరాష్ట్రమును
దిద్ది జగాన తెనుంగువారు వా
క్శూరులు కార్యశూరులని
జూపుచు దిక్కులు మారుమ్రోయ గం
భీరముగా జయధ్వనులు
మీ రొనరింపుడు; మిత్ర రత్నముల్.

రాజరాజేంద్రాది ప్రభువర్యులంగన్న
మాతృదేవీ నీకు మంగళంబు
వాగనుశాసన ప్రముఖ సత్కవులకు
మాటనేర్పిన తల్లి, మంగళంబు
మల్లమ మాంచాల మొల్ల మున్నగు సతీ
మణుల బెంచిన సాధ్వి, మంగళంబు
స్తవనీయ మూర్తి రాధాకృష్ణ ముఖ మహా
మహుల దిద్దిన దేవి, మంగళంబు

విపుల సౌభాగ్య సముపేత ! వీరమాత !
బహు కళా కోవిదావళీ పారిజాత !
అఖిల విశ్వ విఖ్యాత ! ఓ ఆంధ్రమాత !
మంగళము, మంగళము, నీకు, మంగళంబు ॥ ★


—కూరెళ్ళ రామనరసింగరావు

అనకాపల్లి బొజ్జన్న కొండ

కాండ్రేగుల నూకేశ్వరరావు

విశాఖ జిల్లా అనకాపల్లి పొలిమేరలోనున్న "శంకర" మను గ్రామము నానుకొనే ఈ బుద్ధన్న కొండవుంది. ఈ కొండలో బౌద్ధ స్థూప, దగోబ, గుహాలయములు ప్రాచీన బౌద్ధావశేషాలు నేటికీన్నీ శిధిల రూపమునోనున్నవి. కొండయంతయు బుద్ధుని ధ్యాన ముద్రను బోలిన విగ్రహములతో అలరారుతూ ప్రాచీన 'బౌద్ధసంస్కృతి' కళ్ళకు గట్టినట్లుంటుంది. వ్యవహారికంలో ఈ బుద్ధుని కొండ బుద్ధన్న కొండగామారి యిప్పటికి బొజ్జన్న కొండగా పేరుదాల్చింది.

ప్రాచీన బౌద్ధ శిల్పకళానైపుణ్యానికి పుట్టినిల్లు ఈ బొజ్జన్న కొండ. ప్రాచీన బౌద్ధ సంస్కృతికి ప్రతిబింబం ఈ బొజ్జన్నకొండ.




ఈ బొజ్జన్నకొండ కేవలం బౌద్ధశిల్ప కళానైపుణ్యానికి, సంస్కృతికే పరిమితం గాకుండా దీని వెనుక పెద్ద చరిత్రను గూడా సంతరించుకొంది. చరిత్రకారుల ఋజువులతో "దంతపురి" గా పేరొందింది. కానీ కొంతమంది చరిత్రకారులు వేర్వేరు ప్రాంతాల్ని దంతపురిగా పేర్కొన్నారు.

సిల్విన్‌నేవీ అను చరిత్రకారుడు 'పాలూరు' అనేగ్రామమే ప్రాచీన దంతపురియని పేర్కొన్నాడు. బరంపురం వద్ద సముద్రతీరానగల "గోపాలపురమే" పాలూరు అని చాల మంది అభిప్రాయ పడినారు. శ్రీ భావరాజు వెంకటకృష్ణారావుగారు తూర్పు గోదావరి జిల్లాలోని "దొంతికుఱ్ఱు" అను గ్రామమే ప్రాచీన దంతపురమని వ్రాసినారు. బీల్ అనుచరిత్రకారుడు, రాజమహేంద్రవరము గాని కాకినాడ వద్ద గల కోరంగి అనేగ్రామము గాని దంతపురి అయి ఉండవచ్చునని అభిప్రాయపడ్డారు కొందరు చరిత్రకారులు. శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాలవలస గ్రామమునకు సమీపమున నున్న దంతవక్త్రుని కోట అను పేరుతో ప్రస్తుతం పాతబడియున్న ప్రదేశమే ప్రాచీన దంతపురియని నిర్ణయించిరి.

కళింగదేశచరిత్ర వ్రాసిన "హంటర్" ప్రస్తుతం పూరీ అని పిలువబడుచున్న జగన్నాథ క్షేత్రమే దంతపురియని వ్రాసాడు.

కానీ ప్లినీ, మెగస్తనీస్ వ్రాతలు యుహన్‌చంగ్ పర్యటన వివరములు, గాంగవంశపు రాజుల శాసనములు, దంతపురి బౌద్ధ స్థూపవర్ణనలు జాగ్రత్తగా పరిశీలించినచో పైన పేర్కొన్న ఏ ప్రదేశము ప్రాచీన దంతపురియని భావించుటకవకాశము లేదు. చీనాయాత్రికుని వ్రాతలవలన దంతపురిగంగానదీ ముఖద్వారమునకు సుమారు 600 మైళ్ళ దూరములో నుండెడిదని తెలియుచున్నది. ఇది రేవు పట్టణం కాదుగాని సముద్రతీరమునకు దగ్గరగా మాత్రం నుండెడిదని, యిది యొక నదీ తీరమున వుండెడిదని స్పష్టమగుచున్నది. ఇచ్చట ప్రాచీన బౌద్ధస్తూపముండెడిదని దాని శిఖరము చాల దూరము కన్పడుచుండెడిదనికూడా చైనాయాత్రికుని వ్రాతలవలన తెలియుచున్నది.



పైన పేర్కొన్న ప్రదేశములలో రాజమహేంద్రవరం, కోరంగి, దొంతికుఱ్ఱు గ్రామములు గంగానదీ ముఖద్వారమునకు 600 మైళ్ళ కంటె ఎక్కువదూరములో కలవు. పూరీ, గోపాలపూర్ దంతవక్త్రుని కోట 600 మైళ్ళ కంటె తక్కువదూరములో కలవు, ఈప్రదేశములలో దేనియందును ప్రాచీన బౌద్ధ చిహ్నములు కానవచ్చుట లేదు.

పూరీ, గోపాల్‌పూర్, కోరంగి, దొంతికుఱ్ఱు ప్రసిద్ధిచెందిన రేవుపట్టణములు. కానీ దంతపురి రేవుపట్టణంకాదు.

పైవిషయములన్నీ కూలంకషంగా పరిశీలించినచో అనకాపల్లి బొజ్జన్నకొండ శిథిలములేప్రాచీనదంతపురి స్థూపశిథిలములని ఋజువగుచున్నది. చీనాయాత్రికుడు వ్రాసినట్లుగా అనకాపల్లి బొజ్జన్నకొండ గంగానదీ ముఖద్వారమునకు 600 మైళ్ళదూరములోలేదు. అనకాపల్లి రేవుపట్టణంకాదు. కానీ విశాఖ సముద్రతీరమునకు దగ్గరలో నున్నది శారదానదీ తీరముననున్నది ఇచ్చట ప్రాచీన బౌద్ధస్తూపశిథిలములు. విహారములు దగోబములు. గుహాలయములుకలవు

కావున అనకాపల్లిలోనున్న ఈబొజ్జన్న కొండయే చరిత్రకారులు పేర్కొన్న ప్రాచీన దంతపురియని పై ఋజువులవలన తేటతెల్లమగుచున్నది

బొజ్జన్నకొండ రమారమి 200 అడుగులకుపైగా ఎత్తువుంటుంది. ఈ కొండ పడమటిశిఖరము స్థూపపు పునాది తిన్నెగా మలచ బడినది. దాని చుట్టూ వలయాకారంలో కట్టబడిన యిటుక నిర్మాణ మీనాటికీ వుంది. కొండమీద రెండు వరుసలయిటుకలతో నిర్మింపబడిన గదుల శిథిలము లీ నాటికీ కానవచ్చుచున్నవి. ఈ కొండ తూర్పుకొనను ఒక మహావిహారము. స్తూపమునకు దగ్గరగా చైత్యాల శిథిలములు కలవు. స్థూపపు తిన్నెకు దిగువన రెండంతస్తులలో గుహాలయములు కలవు. వీటియందు బుద్ధుని విగ్రహములు, దగోబములు కలవు. స్థూపపుతిన్నె ప్రక్కగానే పలురాతి దగోబములు, సగమునకు విరిగిపోయిన ఒకరాతి స్తంభమున్నూ కలవు.

ఈ స్తంభముపై ఒక శాసనము చెక్కబడి యుండెడిదని జనప్రతీతి. కొన్ని స్తంభములపై ఈనాటికీ అస్పష్టమైన అక్షర ఛాయలు కనిపిస్తున్నవి.

ఈకొండను ఆనుకొనే ఆగ్నేయదిశగా లింగాల కొండ యని మరొక కొండవున్నది. దీనిపడమటి శిఖరమొక పెద్దరాతిస్తూపముగామలచబడినది. ఈకొండమీది ప్రతీరాయి పెద్ద దగోబాగా తీర్చి దిద్దబడింది. ఈకొండపై ఒకటితక్కువ కోటి లింగాలు వుండేవని, కాలభ్రమణంలో అవి శిథిలమైపోయాయని జనప్రతీతి. కానీ ప్రస్తుతం వున్న లింగాల్ని (దగోబాలు) చూస్తే ప్రజల అభిప్రాయం అతిశయోయుక్తేమో ననిపిస్తుంది.

బొజ్జన్న కొండ నధిరోహించినప్పుడు మనకు మొదటిసారిగా ప్రథమ గుహాలయము ప్రత్యక్షవుతుంది. ఈగుహాలయము 16 రాతి స్తంభములచే అతి సుందరముగా మలచ బడిన గుహాలయము. ఆ స్తంభముల మధ్యగా పెద్ద రాతి స్థూపమున్నది. ప్రజలు యాత్రికులు ఈ స్థూపానికే పువ్వులూ పళ్ళూ సమర్పించి పూజచేస్తారు. ఈ గుహాలయమునుండి యింకనూ పైకి వెళ్ళగా రెండవ గుహాలయము ఎదురవుతుంది చీకటిగానుండే ఈ గుహాలయములో ఒక పెద్ద బుద్ధుని విగ్రహముంది. అరమోడు కన్నులతో తపోనిద్రలోనున్న ఈ బుద్ధుని విగ్రహానికి ఎంతటి జడునికయినా చేతులెత్తి నమస్కరించాలని వుంటుంది. అచ్చట నుండి పైకి వెళ్ళితే పెద్ద పెద్ద రాతి దగోబములు చిన్నచిన్న ఏనుగు గున్నల్లా కనిపిస్తవి. అవిదాటి కొండ శిఖర మధిరోహించగానే అచ్చట యిటుకలతో నిర్మింపబడిన గదుల ఛాయలు అగపడుతవి. ఆగదులలో పూర్వము 100 మందికి పైగా బౌద్ధభిక్షువులు నివసించేరని భారత పురాతనవస్తు శాఖవారి అభిప్రాయం. అక్కడి యిటుకలు యిప్పటి యిటుకలకు నాలుగురెట్లు పెద్దవి. వాటిని రాయికేసి కొడితే రాయే విరిగిపోతుందన్నంత దృఢంగా వున్నవి.

కొండ దిగువన చెట్టుక్రింద ఒక స్త్రీ విగ్రహముంది. ఆ స్త్రీ చేతిలో వున్న పసి బాలుని చూచి ప్రజలు అది పిల్లలను ఎత్తుకొని పోయే పిల్లల రాక్షసియని అపోహపడుతున్నారు. అందుకే ఆవిగ్రహంపై పిల్లలు రాళ్ళురువ్వుతారు యిప్పటికీ. కానీ నిజానికది పిల్లల రాక్షసి ఎంతమాత్రమూకాదు. హారీతి అనేపేరుగల ఓదేవతా స్త్రీ విగ్రహమే అది. అయితే బౌద్ధశిల్పాలకు, ఈ హారీతి స్త్రీ విగ్రహానికి గల సంబంధమేమిటో యింకా కొరుకుడు పడలేదు. ఈవిగ్రహము ప్రస్తుతము యాత్రికులచే శిథిలము గాకుండా వుండుటకై పురాతన వస్తుశాఖవారి ఆఫీసులో భద్రపరిచారు.

ప్రస్తుతము ఈ బొజ్జన్న కొండ భారతపురాతన వస్తుశాఖ వారి ఆధ్వర్యంలోనున్నది. వారే ఈ కొండపైని శిల్పసంపద ప్రజలచే శిథిలము గానీయకుండా కాపాడుచున్నారు.


ఆమధ్య ఆంధ్రావనిలో జరిగిని స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో అనకాపల్లిలో చిక్కుకుపోయిన హౌరామెయిలులోని కొంతమంది బౌద్ధ భిక్షువులు రైలుస్టేషనుకు కనుచూపు మేరలో కన్పిస్తూన్న ఈ బొజ్జన కొండను దర్శించారు. వారువెళ్ళి విదేశములనుండి వేయిమంది బౌద్ధభిక్షువులను వెంటబెట్టుకొని వచ్చి, ఈ కొండపై దీపారాధన చేసిపోయారని అచ్చట వున్న పురాతన వస్తుశాఖ ఉద్యోగిద్వారా తెలిసింది

ఆంధ్రులకు పర్వదినమైన సంక్రాంతి పండుగ మరునాడు అనగా కనుమ పండుగనాడు యిచ్చట గొప్ప జాతర జరుగుతుంది. దాదాపు ఆరోజు లక్షమందిప్రజలు ఈబౌద్ధ శిల్పసంపదని వీక్షిస్తారు.

పురాతన వస్తుశాఖవారుగాని, లేదా అనకాపల్లి మునిసిపాలిటీవారుగాని శ్రీమకోర్చి పట్టణం నుండి ఈకొండకు సరియైన మార్గంవేయించి ఆవాతావరణాన్ని మెరుగుపరచినట్లయిన ముమ్ముందు యిది చిన్నయాత్రాస్థలంగా మారగలదు.

నగర వార్తా చిత్రాలు






ఎడమవైపు పైన : హైదరాబాదులోని అమరజీవి పొట్టిశ్రీరాములు హోమియోపతి వైద్య కళాశాలలో పొట్టిశ్రీరాములు 18వ వార్షిక కార్యక్రమంలో సమాచార పౌరసంబంధ శాఖ మంత్రి ప్రసంగించారు.


ఎడమవైపు మధ్య ఆర్థిక మంత్రి డిశంబరు 5న హైదరాబాదులో 16వ అఖిలభారత చేతిపనుల వారోత్సవానికి ప్రారంభోత్సవం చేశారు.

ఎడమవైపు క్రింద వైద్య, ఆరోగ్యశాఖమంత్రి శ్రీ మహమ్మద్ ఇబ్రహీం అలీ అన్సారీ తమ విదేశ పర్యటనను ముగించుకొని వచ్చిన సందర్భంలో వారికి బేగంపేట విమానాశ్రయంలో స్వాగత మివ్వబడింది.

పైన : ఘనా యువజన, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎ. ఎ. మునుఫీ డిశంబరు 1న హైదరాబాదు విచ్చేసిన సందర్భంలో యాత్రా విషయాల మంత్రి శ్రీమతి రోడామిస్త్రీ, తదితరులు స్వాగతం చెప్పారు


క్రింద : ఇరాన్ ప్రభుత్వ విద్యుచ్ఛక్తి, సేద్యపు నీటివిషయాల మంత్రి డిశంబరు 14న నాగార్జునకొండ మ్యూజియమును సందర్శించారు.


















ఎడమవైపు పైన: వేయిపడగలు తెలుగు నవలను హిందీలోకి అనువదించినందుకుగాను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి శ్రీ పి వి నరసింహారావును డిశంబరు 13 న కొత్త ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి శ్రీ జి ఎస్ పారక్ సన్మానించారు

ఎడమవైపు మధ్య: భారత ఉపరాష్ట్రపతి శ్రీ జి ఎస్ పాఠక్ డిశంబరు మొదటి వారంలో హైదరాబాదుకు విచ్చేసిన సందర్భంలో వారిని రాష్ట్రగవర్నరు, ముఖ్యమంత్రి, ప్రధానన్యాయమూర్తి కలుసుకున్నారు

ఎడమవైపు క్రింద: ఉపరాష్ట్రపతి డిశంబరు 8న సికిందరాబాదులో ఆర్మీఆర్డినెన్స్ కోర్‌కు రిజిమెంటల్ కలర్‌లను బహూకరించారు

పైన: గుడివాడలోని కె టి మహిళల కళాశాల గ్రంథాలయ భవన నిర్మాణం నిమిత్తం డిశంబరు 1 హైదరాబాదులోని వెంకటేశ థియేటరులో ఏర్పాటైన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నరు ప్రసంగించారు,

క్రింద: జర్మన్ డెమోక్రటిక్ రిపబ్లిక్ రాయబారి గౌరవార్థం డిశంబరు 9న సారథీ స్టూడియోస్‌లో జరిగిన అభినందన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు



కార్మికోపాధ్యాయుల సంయుక్త శిబిరం

శా. కా. వి. గుప్త

కార్మిక శిక్షా కేంద్రమండలి ఆధ్వర్యమున "ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వర్కర్స్ ఎడ్యుకేషన్, బాంబే" పేరిట మార్చి 1970 లో కార్మిక విద్యాలయము నొక దానిని స్థాపించారు

ఈ విద్యాలయములో ప్రాంతీయ సంచాలకులకు, విద్యాధికారులకు, కార్మికోపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమములు నిర్వహించుటకు, శిక్షణార్థులకు నివాస వసతులు గూడ ఏర్పచబడినవి. బోధనా పద్ధతులను నవీకరించుటకై ప్రత్యేక బోధనా సామగ్రి నూతన పరిశోధనల ద్వారా సిద్ధపరుచుటకు పఠన. దృశ్య, శ్రవణ పరికరముల సహాయముతో పరిశోధనావకాశములు కలుగునట్లు తగు రీతిగా అమర్చబడినది. కార్మిక విద్య ప్రచురణ ప్రచార సాధనములను వృద్ధి చేయుటకై ఈ విద్యాలయం ఎంతో తోడ్పడగలదని ఆశించవచ్చును. గత ఆరు మాసముల స్వల్పవ్యవధిలో విద్యాధికారులకు ప్రత్యేక శిక్షణ రెండు జట్టుల రూపంలో విజయవంతముగా పూర్తి చేసిన తరువాత విద్యాలయ ఆశయాలు ఆచరణ రూపంగా కొనసాగ గలవనే విశ్వాసం పెరిగింది.

ఈ విద్యాలయంలో కార్మిక వర్గమే కాకుండా యాజమాన్యపు పరిషత్తులకు, ట్రేడ్ యూనియన్ అధికారులకు, వర్క్స కమిటీ సభ్యులకు, జాతీయ స్థాయిలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమములు జరుపుటకు ఏర్పాట్లు చేయబడుచున్నవి.

కార్మిక విద్యా పథకము దేశములో ముఖ్యపాత్ర వహించుచున్నదనుటలో అతిశయోక్తి కానరాదు. పారిశ్రామిక సంబంధాలను మెరుగు పరచుటకు, పారిశ్రామిక శాంతిని నెలకొల్పడానికి కార్మికులకు తమ తమ పాత్ర, బాధ్యత, కోరికలపట్ల సమాన ఆసక్తి కల్పించుటలో అక్షరాలా సఫలమైనది. కార్మిక జీవన స్థాయిని పెంచడానికి కార్మిక విద్య యొక్క ఆశయాలు పూర్తిగా ఆచరణలో పెట్టి అనుసరించిన యెడల దేశసంపద దేశఐక్యత స్థిరంగా వృద్ధిగాగలవని వక్కాణించుటకు ఆస్కారము కలదు.

కార్మిక సంఘములు

నేడు కార్మికులు గూడ రాజకీయ వర్గములవలె వివిధ వర్గములుగా విభజింపబడి పారిశ్రామిక తగాదాలకు గురియై అనుబంధితజాతీయ కార్మిక సంస్థల ప్రాతి పదికపై పోట్లాడుట చూస్తూనే ఉన్నాము. వీటిమూలంగా కార్మికులలో చీలికలు కలిగి ఐక్యత నశించుచున్నది. ఏ సంస్థ గూడ ఇతర సంస్థలకు చెందిన కార్మికులను ఏక ఛత్రచ్ఛాయ క్రిందకు తీసుకొని రావలేనని ప్రయత్నము చేసిననూ అది కల మాత్రమే అయినది. కాని కార్మిక విద్యాపథకము ఒక్కటే భారతదేశములో నాల్గు జాతీయకార్మిక సంస్థల సభ్యులను, అధికారులను వర్గీకృత భావములను విస్మరింప చేస్తూ సుఖశాంతితోను ఒకే బల్లపైన సమస్యల పరిష్కరణకై భాతృత్వము. స్నేహము. ఐక్యతను చూపిస్తున్నది.

కార్మికోపాధ్యాయుల సంయుక్త శిబిరం


కార్మిక విద్య ఫలితంగా కార్మికులలో అనుబంధిత భావములు. భేదాభిప్రాయములు పూర్తిగా నశించుచున్నవి ఈ మార్పును దృష్టిలో పెట్టుకొని కార్మిక శిక్షణా కేంద్రమండలి ప్రథమంగా బొంబాయిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వర్కర్స్ ఎడ్యుకేషన్ అను విద్యాలయము భారతదేశంలో కార్మికులకు బోధన జరుపు కార్మికోపాధ్యాయులను ఆహ్వానించి భారతదేశ సమైక్యతకై కార్మిక సంఘముల పాత్రను గురించి చర్చించడానికి ఒక సంయుక్త శిబిరము ఏర్పాటు చేసినది. ఈ శిబిరాన్ని డాక్టర్ శాంతి పటేల్, బొంబాయి మేయర్ (కార్మిక శిక్షణ కేంద్ర మండలి సభ్యులు) 20-10-70 తేదీన ప్రారంభోత్సవం చేశారు. ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మైసూర్, ఒరిస్సా, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రములనుండి 27 కార్మికోపాధ్యాయులు పాల్గొన్నారు

జాతీయ సమైక్యతకై కార్మికుల పాత్ర

వివిధ రాష్ట్రముల నుండి కార్మికోపాధ్యాయులు భారత కార్మిక శిక్షా విద్యాలయం బొంబాయిలో 19 అక్టోబరు నుండి 23 అక్టోబరు వరకు 5 దినములు వరుసగా కార్మిక వర్గము, సామాజిక వ్యవస్థలు, దేశ సమైక్యతను చర్చించి; సాంస్కృతిక సంఘముల ప్రధాన నాయకుల ఉపన్యాసములు అనుభవముల రీత్యా తెలిపిన సంఘటనలు విని కార్మికోపాధ్యాయులు చాలావరకు జాతీయ సమైక్యతలో తమ తమ పాత్రలను సింహావలోకనం చేసుకోగలిగారు. నేటి పరిస్థితులలో కార్మిక వర్గము దేశ జనాభాలో అధిక సంఖ్యలో లేకున్ననూ దేశరక్షణకై కంకణబద్ధంగా శక్తిశాలియై ప్రాణాలర్పించి దేశ అభిమానమును కాపాడుతూవచ్చారు. కార్మికుల సంఘములన్ని ప్రప్రథమంగా రాజకీయ వర్గముల ప్రభావము

(తరువాయి 50 వ పుటలో)

అనంతపురం జిల్లాలో



కొత్త పరిశ్రమల స్థాపనకుగల అవకాశాలు

★

పెయింట్లు. వార్నీషులు

వస్తువులను అందంగా అలంకరించడానికీ, వాతావరణ పరిస్థితుల నుంచి రక్షణ కలిగించడానికీ పెయింట్లను, వార్నీషులను ఉపయోగిస్తుంటారు.

పెయింట్లను తయారుచేసే యూనిటు ఒక్కటి కూడా అనంతపురం జిల్లాలో లేదు.

ఈ జిల్లాలో ఏటా రూ 1 లక్ష విలువచేసే పెయింట్లను, వార్నీషుల్ని వినియోగిస్తున్నారు.

ఈ జిల్లాలో వీటిని తయారుచేసే పరిశ్రమను ఏర్పాటు చేయడానికి చక్కటి అవకాశాలు వున్నాయి.

రాతి జాడీలు

వీటిని సాధారణంగా యిళ్ళల్లో వాడకానికి వుంచుతారు. పెద్దరకం రాతిజాడీలను ఆమ్లాలను నిలవచేయడానికి వుపయోగిస్తుంటారు.

మన రాష్ట్రంలో వీటిని భీమడోలు, ద్రోణాచలం, హైదరాబాదులో తయారుచేస్తున్నారు.

వీటిని తయారుచేయడానికి కావలసిన ముడి పదార్థాలు కొన్ని ఈ జిల్లాలో లభిస్తున్నాయి.

వీటిని తయారుచేసే యూనిటును ఒకదానిని యిక్కడ నెలకొల్పుకోవచ్చు

సీసల్ వేక్స్

పాలిష్ చేసే పదార్థాల తయారీలో కార్నబావేక్స్ బదులు దీనిని వుపయోగిస్తారు.

సీసల్ వేస్టు నుంచి దీన్ని తీయవచ్చు.

సీసల్ వేస్టు నుంచి మైనాన్ని తీసే విధాన్నొక దానిని పూనాలోని నేషనల్ కెమికల్ లేబరేటరీ రూపొందించింది.

ఈ విషయమై యింకా వివరంగా తెలుసుకోదలచిన వారు 'సెక్రటరీ, నేషనల్ రిసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మండీ హౌస్, విట్టన్ రోడ్డు, న్యూఢిల్లీ"కి వ్రాసి తెలుసుకోవచ్చు.

బేరైట్స్ శుద్ధి

బేరైట్స్‌ను రబ్బరు, కాగితం, లినోలియం పరిశ్రమలో వుపయోగిస్తారు.

బేరైట్స్‌ను శుద్ధిచేసే యూనిటు ఒకటి కూడా యీ జిల్లాలో లేదు.

రంగుగల బేరైట్స్‌ను తెలుపుచేసే విధానాన్ని హైదరాబాదులోని ప్రాంతీయ పరిశోధన శాల రూపొందించింది.

అనంతపురం జిల్లాలో కనీసం ఇటువంటివి రెండు యూనిట్ల నన్నా నెలకొల్పవచ్చు.

బేరియం రసాయనాలు

బేరియం కార్బొనేట్, బేరియం నైట్రేట్, బేరియం క్లోరైడు వంటి బేరియం రసాయనాలను అనేక పరిశ్రమలలో వుపయోగిస్తుంటారు.

బేరియం రసాయనాలను మనదేశం దిగుమతి చేసు కుంటున్నది.

బేరియం రసాయనాలను తయారుచేసే భారీ యూనిటు ఒక దానిని ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పడం జరిగింది.

ఈ జిల్లాలో బేరైట్స్ లభిస్తున్నదృష్ట్యా ఒక లఘుపరిశ్రమ యూనిటును నెలకొల్పవచ్చు. దీనికి సంబంధించిన సాంకేతిక సహాయాన్ని హైదరాబాదులోని ప్రాంతీయ పరిశోధనాగారం నుంచి పొందవచ్చును.

అద్దకం రంగులు

సిల్కు నేత పరిశ్రమకు సుమారుగా రెండు లక్షల రూపాయల అద్దకం రంగులు అవసరమౌతున్నాయి.

కొన్ని రంగులను లఘు పరిశ్రమగా తయారు చేయవచ్చు.

ఒకే యూనిటులో ఎప్పుడూ ఉత్పత్తి చేస్తూవుండడానికి కొన్నిరంగుల్ని ఎన్నిక చేసుకుని ఉత్పత్తి చేయవచ్చు.

ఖాద్యయోగ్యంకాని నూనెలనుంచి సబ్బులతయారీ

వేప గింజల నూనెవంటి ఖాద్యయోగ్యంకాని నూనెలనుంచి సబ్బులను తయారుచేయవచ్చు.

వేప గింజలనూనె, కొబ్బరినూనె, కాస్టిక్‌సోడా, మొదలైనవి సబ్బుల తయారీలలో ముఖ్యమైన ముడిపదార్థాలు. ప్రస్తుతం కాస్టిక్‌సోడా తగినంతగా లభించడంలేదు.

వూలు, ప్రత్తి రద్దీనుంచి ముతకదారం తయారీ

ఈ జిల్లాలో వూలు రద్దీ, ప్రత్తి రద్దు పెద్ద మొత్తంలో లభిస్తుంది. వీటిని బ్లాంకెట్లు, రగ్గులు, తివాసీలు మొదలైన వాటిని తయారుచేయడానికి వుపయోగించవచ్చు.

ముతక దారాన్ని తయారుచేసే యూనిటును ఒక దానిని యిక్కడ నెలకొల్పుకోవచ్చు.

ఎక్స్-రే గ్రేడ్ బేరియం సల్ఫేట్

దీనిని ఆసుపత్రులలో వాడుతారు. దీనికి రోజురోజుకు గిరాకీ పెరుగుతున్నది.

ఈ పరిశ్రమకు అవసరమైన ముఖ్యమైన ముడి పదార్థాలు సల్ఫ్యూరిక్ ఆమ్లం, బేరియంక్లోరైడు.

ఎక్స్-రే గ్రేడ్ బేరియం క్లోరైడ్ తయారుచేసే విధానాన్ని హైదరాబాదులోని ప్రాంతీయ పరిశోధనాగారం రూపొందించింది

వీటిని తయారుచేసే యూనిటును ఒకదానిని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసుకోవచ్చు.

(48 వ పుట నుండి)

నుండి దూరముగా ఉండినట్లైతే రాజకీయ రీత్యా కార్మికులను దురుపయోగ పరచడానికి వీలుపడదు కార్మికులు మతము, ప్రాంతము, జాతిని మరచి కార్మిక జాతి ఒకే ఒకటి అని భావించవలెను. కార్మిక సంఘములు కార్మికుల ఉద్యోగ విషయముల గూడ జాతి మత విచక్షణ లేకుండ ప్రాంతీయ అభిమానము లేకుండ ప్రవర్తించవలెను. కార్మిక సంఘములు ప్రతి సమావేశములో జాతీయ సమైక్యతపై ఐక్యతను గురించి నొక్కి చెప్పాలి.

కార్మికుల వాడలలోగాని, పరిశ్రమలలోగాని చిన్న చిన్న విషయాల మూలంగా పెరిగే పోట్లాటలను వెంటనే అంతమొందించాలి. లేనిచో స్వార్థపరులు, సమాజద్రోహులు అవకాశములను చూసి మత సంబంధిత అల్లర్లకు దారి తీయుదురు.

కార్మికులకు సాయంత్రపు తరగతులు గాని రాత్రి తరగతులు గాని, కార్మిక శిక్షణా ప్రాథమిక కేంద్రముల ద్వారా గాని కార్మికులలో జాతీయ సమైక్యత పట్ల శ్రద్ధాభక్తులను పెంపొందింపజేయాలి. భారతదేశ యాత్రల ద్వారా వివిధ ప్రాంతముల కార్మికులతో కలయుట, మాట్లాడుట వలన వారి వారి అభిప్రాయములు తెలుసుకొనుటకు అవకాశములు కల్పించాలి.

పెద్ద ఎత్తున సెమినార్లు, సింపోజియములు మొదలగు కార్యక్రమాల ద్వారా గాని, చిత్ర ప్రదర్శనముల ద్వారా గాని, నాటకములు, ఏకపాత్రాభినయం ద్వారాగాని సమైక్యతను తెలియపరచాలి.

కార్మికులకు భారత పారిశ్రామిక కేంద్రములను సందర్శింపజేసి, కార్మికులు దేశ పురోగతికి చేయుచున్న కృషిలో మత ప్రాంత జాతి విచక్షణ లేకుండా శ్రమిస్తున్న దృశ్య దర్శనం కల్పించి జాతీయతాభావాన్ని కల్పించాలి.

కార్మిక సంఘం పదవులపై ప్రతి ఒక సంఘపు వ్యక్తిని నియమించినచో కార్మిక సంఘములలో అంతర్విరోధ గుణములు నశించును. కార్మిక విద్యయే నేడు కార్మికుల అంతర్విరోధ భావములు నశింప చేయును. ★

పట్టు పరిశ్రమ అభివృద్ధి

చిత్తూరు జిల్లాలోని పలమనేరు, పుంగనూరు, మదనపల్లి, వాయల్పాడు తాలూకాలు వ్యవసాయదారులకు అనుబంధ వృత్తిగా పట్టు పరిశ్రమను అభివృద్ధి పరచడానికి బాగా అనువైన ప్రాంతాలు. పైన పేర్కొన్న తాలూకాలలోని కొన్ని గ్రామాలలో పలమనేరులోని ప్రభుత్వ సిల్కు క్షేత్రం నుండి విత్తనాలు వగైరా సరఫరా చేయడంద్వారా పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రయత్నం జరుగుతున్నది.

పుంగనూరు, మదనపల్లి వాయల్పాడు తాలూకాలలో విస్తరణ కార్యక్రమాల అమలుకు కొద్దిపాటి సిబ్బంది కృషిచేస్తున్నది. శాఖా పరమైన బడ్జెట్లక్రింద నిధులకొరత కారణంగా అభివృద్ధి కార్యక్రమాలను తీవ్రతరం చేయడం సాధ్యం కావడంలేదు. సరిహద్దులోని మైసూరు రాష్ట్రం గ్రామాలలో-ముఖ్యంగా కోలారు జిల్లాలో-రైతులకు పట్టు పరిశ్రమ ముఖ్యమైన వ్యవసాయ పరిశ్రమ కావడంతో పై 5 తాలూకాలలో యీ పరిశ్రమను స్వచ్ఛందంగా ఉత్సాహంతో చేపట్టడానికి అపూర్వమైన ప్రయోజనంగా భావించబడుతున్నది. దానికితోడు సంవత్సరంలో 4,5 సార్లు రొక్కం ఆదాయం ఉండడంతో రైతులను యీ పరిశ్రమ ప్రముఖంగా ఆకర్షించింది ఎకరాకు రు. 500 ల ప్రారంభ ఖర్చుతో మెల్బరీ సేద్యం చేసిన వ్యవసాయదారులకు వార్షికంగా రు. 3000 ల నుండి రు. 4000 ల మేరకు ఆదాయం లభిస్తున్నది.

పలమనేరులోని ప్రభుత్వ సిల్కు క్షేత్రంవారు పట్టు పరిశ్రమలో అభ్యర్థులకు శిక్షణ సౌకర్యాలు కల్పిస్తున్నారు. వ్యవసాయదారుల కుటుంబాల నుండి ఎంపిక చేసిన 140 మంది అభ్యర్థులకు శిక్షణ యిచ్చే నిమిత్తం 4 సంవత్సరాల కార్యక్రమాన్ని రూపొందించారు. 20 మంది సభ్యులుగల ప్రతి బ్యాచీకి మూడు నెలలపాటు శిక్షణ యివ్వబడుతుంది. నెలకు రు. 50 ల చొప్పున ఉపకార వేతనం యివ్వబడుతుంది. శిక్షణ పూర్తి అయిన తర్వాత అభ్యర్థులు తమ గ్రామాలకు వెళ్ళి తమ క్షేత్రాలలో మల్బరీ మొక్కలను వేసి యీ పరిశ్రమను చేపటుతారు.

రోజుకు రు. 2_50 ల కూలీ చొప్పున 20 మంది కార్యకర్తలను నియమించాలని ప్రతిపాదించారు. శాఖ సిబ్బంది పర్యవేక్షణలో మెల్బరీ సేద్యం భూవిస్తీర్ణాన్ని పెంచడానికి యీ కార్యకర్తలు కృషిచేస్తారు. నాలుగు సంవత్సరాలలో ఆర్థికంగా వెనుకబడిన 200 కుటుంబాలకు కుటుంబానికి రు. 250 ల చొప్పున విలువచేసే వెదురు తట్టలు, చంద్రికలు, రీరింగ్ స్టాండ్లు వంటి సేద్యపు పరికరాలను సరఫరా చేయడానికి నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న 300 ఎకరాలుగాక వచ్చే నాలుగు సంవత్సరాలలో 2000 ఎకరాలలో మల్బరీ సేద్యం చేయాలని ప్రతిపాదించారు.

ఈ పథకం అమలు ఫలితంగా నాలుగు సంవత్సరాలలో జిల్లాలో రు. 50 లక్షలు విలువచేసే 4 లక్షల కిలోగ్రాముల కాకూన్ ఉత్పత్తి అవుతుందని అంచనా, సగటున ప్రతి వ్యవసాయదారుని కుటుంబానికి వార్షికంగా మల్బరీగల ఎకరాకు రు 3000 లకు తక్కువగాకుండా అదనపు ఆదాయం లభిస్తుంది. ఈ పథకం అమలు ఫలితంగా నాలుగు సంవత్సరాలలో దాదాపు 4000 వ్యవసాయదారుల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది. ఎక్కువ సంఖ్యలో కార్మికులు అవసరమైన యీ పరిశ్రమ అభివృద్ధివల్ల గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగ సమస్యను కొంతవరకు తీర్చవచ్చు. అంతేగాక వ్యవసాయదారులకు సంవత్సర పూర్తికాలం పని లభిస్తుంది.

ప్రతిరోజూ ఏరివేసే పట్టు పురుగు సంతతి, పశువులకు_ముఖ్యంగా పాడి పశువులకు మంచి గ్రాసంగా ఉపయోగపడుతుంది. ఈ విధంగా సంవత్సరమంతా ఈ పరిశ్రమవల్ల ఎటువంటి అదనపు ఖర్చులేకుండానే పశువులకు మాంస కృత్తులుగల మంచి గ్రాసం లభిస్తుంది.

ఈ పథకం అమలుకు ఖర్చు అయ్యే రు. 1.73 లక్షల మొత్తాన్ని రాయలసీమ ప్రాంతీయ అభివృద్ధి మండలి నిధులనుండి కేటాయిస్తారు. ★

గ్రంథ సమీక్ష

" నీలాటి రేవు "

రచన : మంగత్తుర్తి విశ్వనాథశాస్త్రి
మూల్యం . ఒక రూపాయి.
ప్రచురణ : శ్రీనివాస సాహితీ సమితి. 58, వివేకనగరం
హైదరాబాదు–20.
ప్రాప్తి స్థానం : ఆంధ్ర సారస్వత పరిషత్ తిలక్ రోడ్
హైదరాబాదు

ఏదో ఒక "ఇజానికి" కట్టుబడితేనే కవిత్వం రాయాలనే విపరీత ధోరణి ప్రబలిపోతున్న నేటి రోజుల్లో శ్రీ విశ్వనాథ శాస్త్రిలాంటి రచయితలు "మనిషి—మానవత్వం—కవిత్వం" అన్న ఆదర్శాలతో కవితలు రాసి ప్రచురిస్తున్నారు. ఇది శ్రీ శాస్త్రి గారి రెండవ సంపుటం ఇందులో మొత్తం 27 ఖండికలున్నాయి. ఇందులో ముఖ్యంగా "ఆరిన కుంపటి," "నేస్తం వెళ్ళిపో" అన్న రచనలు భావగర్భితంగా, అతి సున్నితంగావున్నాయి.

రేషన్ షాపులో బియ్యంకోసం "క్యూ"లో నిలబడలేక అక్కడే ప్రాణం వదిలిన కొడుకును చూసి తల్లిగూడా ప్రాణం వదిలిందన్న కఠోర విషయాన్ని "ఆరిన కుంపటి" అన్న కవితలో కవి ఆవేశాత్మకంగా, హృదయంగమంగా చెప్పాడు.

"గుంపు మధ్యన పడివున్న
కుమారుణ్ణి చూసి
కృశించిన దేహంతో
కుప్పగా కూలింది...
ఇక్కడ యింట్లో కుంపటి
కాకి పొడిచిన కన్నంలోనుంచి
కారుతున్న నీటిలో పడిసి
అసందిగ్ధంగా ఆరిపోయింది..."

కుప్పగా కూలిపోయిన ఆ మాతృమూర్తి దృశ్యాన్ని మనసులో కల్పించుకున్న పాఠకుడి కన్నులవెంట రెండు కన్నీటి బొట్లు రాలక మానవు. అలాగే "నేస్తం వెళ్ళిపో" అన్న ఖండికలో ఒకచోట

"ఇదికాదు ద్వాపరయుగం
ఇక్కడి శ్రీకృష్ణులు
చెయ్యరు మాన సంరక్షణం
చేస్తారు ద్రౌపదీ వస్త్రాపహరణం..."

అంటూ చక్కని వ్యంగ్య ధోరణిలో వర్తమాన సమాజ స్థితిని వర్ణించారు. "చేస్తారు గోపికా వస్త్రాపహరణం" అంటే ఎలా వుండేదో భావన!

మరోచోట :

"మంచితనపు మల్లెవాసనలు
పంచి పెట్టే రోజుకోసం
పలవరిస్తూ గడుపు..."

అంటూ చక్కని ఆశావాదాన్ని ప్రబోధిస్తారు.

మిగతా కవితలన్నీ సాధారణంగా నడిచాయి. నాగార్జునసాగరం, జాతీయ జెండా, మేలుకో తెలుగోడా," మొదలైన ప్రచార కవితల్ని యిందులో చేర్చకుండా వుంటే బాగుండేది. "పర్వాలేదు మన యువకులు" లాంటి కవితలు రాయటం మానుకుంటే మంచిది. "పీడకల" వంటి అభ్యుదయ వ్యతిరేక కావ్య వస్తువులను తీసుకోవడం వల్ల ప్రయోజనం వుండదు.

మొత్తంమీద చక్కని ముఖ చిత్రంతో మంచి ముద్రణ, గెటప్‌లలో అచ్చువేసిన ఈ పుస్తకం ధర రూపాయే. కాని చదివినవారికి ఆ మాత్రం విలువ గిట్టకపోదు.

—గుత్తికొండ సుబ్బారావు



పాఠకుల లేఖలు

ఉద్యోగుల సంక్షేమం

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకొన్న చర్యలు అక్టోబరు నెల "ఆంధ్రప్రదేశ్" లో ప్రకటితమైనవి.

ప్రభుత్వం అనుసరించదగు మరికొన్ని విషయాలను సూచించడానికి ప్రయత్నిస్తాను. ఉద్యోగులు తమ ఉద్యోగ ధర్మానికి భిన్నం గాకుండా ఇతర సాంస్కృతిక వైజ్ఞానిక రంగాలలో పాల్గొనేందుకు మరిన్ని అవకాశాలు కల్పించబడాలి. ఉద్యోగులకు సాహిత్యాది రంగాలలో అభిరుచి పెంపొందింప జేసినపుడు అధిక సదుపాయాలకు ఆరాటం అంతగా వుండదని నా అభిప్రాయం. ప్రతిభగల రచయితలు, నటులు, కళాకారులు, అనేకమంది ఉద్యోగులలో వున్నారు. కాని చిన్న ఉద్యోగులుగా వున్న ఇట్టివారిని పై స్థాయిలోని అధికారులు నిరుత్సాహపరిచే సందర్భాలు వుంటున్నవి. అధికారులలో విశాల దృక్పథం అవసరం. ఒక శాఖలో సామర్థ్యం పెంపొందడానికిగాని, వ్యయకర్తన విషయంలోగాని, చిన్న చిన్న వుద్యోగులే కొన్ని సందర్భాలలో విలువైన సలహాలనీయగల స్థితిలో వుంటారు. అధికారులైనవారు చిన్నవారి సలహా పొందడంగా "చిన్నతనంగా" భావించరాదు. స్నేహపూరిత వాతావరణం ఏర్పడడానికి పైవారే పూనుకోవాలి. సర్వీసులో నున్న వుద్యోగి విద్యావిషయకమైన అధిక యోగ్యతలు సంపాదించిన అట్టివారిని ప్రోత్సహించాలి. ఉద్యోగులలో యోగ్యత పెంపొందినపుడు సామర్థ్యమునకు దోహదకారి కాగలదని మనవి.

ఉద్యోగికి ఆర్థిక అవసరాలు ముఖ్యమైనవే. ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాలలో వుండడానికి సంకల్పించు కున్నప్పుడు ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఉద్యోగం బస్తీలలోవున్నా అయిదు లేక ఆరుమైళ్ల సమీప గ్రామంలో వుద్యోగుల నివాసమేర్పరచుకోడానికి అనుమతినివ్వాలి. అప్పుడుఉద్యోగులకు పట్టణాలలో ఇండ్ల అద్దె మీద హెచ్చు సొమ్ము ఖర్చు చేయాల్సిన అవసరం వుండదు. "విద్యావంతులు గ్రామీణ ప్రాంతాలకు తరలాలి". ఇది చాలకాలం నాటినుండి వినబడుచున్న నినాదం. గ్రామాలలో విద్యుచ్ఛక్తి, విద్య, వైద్యం మున్నగు సౌకర్యాలున్నప్పుడు ఉద్యోగులు విద్యావంతులు పల్లెలకు తరలడములో కష్టమేమి వుండరాదు. కుటుంబ నియంత్రణ మున్నగు అభ్యుదయ కార్యక్రమాలలో గ్రామీణ ప్రజలకు మార్గదర్శకముగా వుండగలరు.

ఉద్యోగులు కూడా 'బస్తీ' వదిలితే సినిమా కాలక్షేపం దొరకదన్న ఉద్దేశాలు విరమించుకోవడం లాభదాయకం. ఉద్యోగి పదవీకాలం అంతా బస్తీలలో గడిపి పల్లెలో విశ్రాంతి జీవనం గడపలేడు. చాలా గ్రామాలలో ఉన్నత పాఠశాలలు ఏర్పడినవి. ఇంకను కళాశాలలు కూడా గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు కావడం విద్యార్థులకు తలిదండ్రులకు లాభదాయకం.

వివాహాలకు ఉద్యోగులకు అప్పులు మంజూరు చేయడం ప్రభుత్వం చేసిన మంచిచర్య. ఉద్యోగుల బిడ్డల ఉద్యోగాల విషయంలో కూడా ప్రభుత్వం సాయపడాలి.

ఇదివరలో రైల్వేవారికి వారిపిల్లలకు ఆదేశాఖలో వుద్యోగం ఇస్తూవుండేవారు. ఇలాంటి సౌకర్యాలు అన్ని శాఖలలో వుంటే ఉద్యోగి తన బిడ్డల ఉద్యోగ విషయంలో నిర్విచారంగా వుండగలడు. ఇట్టి సదుపాయం చట్టరీత్యా వీలులేకపోయినను సంప్రదాయకంగా నెలకొల్పడానికి ఇబ్బందులుండవని ఆశిస్తాను.

ఇలాంటి—ఆర్థిక ఇబ్బందులు లేని—సూచనలు ప్రభుత్వంవారు ఆహ్వానించి పరిశీలించవలసినదిగా ప్రార్థన.

ఆర్. శ్రీరాములు

మా మాస పత్రిక అయిన ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక విడువక చదువుచున్న వారిలో నేనొకడిని. ఈ పత్రిక, అన్ని రంగాల, వివరములు మా కందించుచున్న కల్ప తరువు. ఇందులో వ్యవసాయ శీర్షిక నొకదానిని ప్రవేశపెట్టి రైతు సోదరులకు లాభదాయకమగు హైబ్రీడు రకములు, వాటి పెంపకములను గూర్చి విపులీకరించినట్లయిన రైతులకు ఎంతో ఉపకారం చేసినవారగుదురని కోరుచున్నాను.

బి. నరసింహులు,
సర్పంచ్, గార్లమడుగు

నవంబరు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ ప్రత్యేక సంచిక చూశాను. ముఖచిత్ర రచన బావుంది. కేవలం ఫోటోల్ని మాత్రమే కాక చిత్రాలనుకూడ ప్రచురించండి. హైదరాబాదు వరదల హృదయ విదారక దృశ్యాలను చూచిన ప్రతివారి హృదయం ద్రవించిపోతుంది. మధ్యపేజీల్లో వి. వి. గిరి గారి చిత్రాలు బావున్నాయి. విషయాలనేకం; వెల తక్కువ; పత్రిక ఆకర్షణీయంగా ఉంటుంది. ఇదే మీ పత్రికలోని ప్రత్యేకత. బాలురకూ, వనితలకూ ప్రత్యేక శీర్షికల్ని ప్రవేశపెట్టి, వానికి సంబంధించిన వ్యాసాల్ని ముగ్గులు, డిజైన్లూ ప్రచురించండి. మరీ బావుంటుంది. పత్రిక మధ్య మధ్య చిత్రాలూ, ఫోటోల్ని ప్రచురించండి. చిన్న చిన్న కథల్నికూడ ప్రచురించి క్రొత్త రచయితలకు అవకాశమిస్తారని ఆశిస్తున్నాను. పత్రిక ఇలాగే నిత్యనూత్న శోభాయమానంగా పదికాలాలపాటు కలకలవర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తూ.

"రేణుశ్రీ"
అనంతపురం—2

గౌరవనీయులైన "ఆంధ్రప్రదేశ్" ఎడిటర్ గార్కి,

"ప్రవాసాంధ్రులమైన మాకు ఆంధ్ర విషయములన్నియు విపులంగా విశదీకరించి వివరిస్తున్నది మీ, మా 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక, ఆరుద్రగారి, 'గాంధీ చరిత్ర—తోలుబొమ్మలాట' సమాప్తం చాలా బాగుంది. పండ్రంగి రాజేశ్వరరావుగారు 'శోధనా భాషగా తెలుగు' వ్యాసం బాగా వ్రాసారు. ఆంధ్రదేశం గూర్చి (వివరాలను, కళ, సాహిత్యం, అనేకం), దాని పురోగమనాన్ని గూర్చి చక్కగా వివరిస్తున్నందులకు నా నమస్సులు."

కిల్లంశెట్టి నాగేశ్వరరావు,
విక్రమదేవ్ కళాశాల, జయపురం (ఒరిస్సా).

జిల్లాలనుండి

రిక్షా డ్రైవర్ల సహకార సంఘానికి ప్రారంభోత్సవం

రెవిన్యూ శాఖామంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి చిత్తూరులో బాలల దినోత్సవ సందర్భంలో రిక్షా డ్రైవర్ల సహకార సంఘానికి ప్రారంభోత్సవం జరుపుతూ, ఇందిరా గాంధీ నాయకత్వంలో సోషలిస్టు విధానాలద్వారా ధనిక బీద వర్గాల మధ్యగల అంతర్యాలను తగ్గించేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నదని చెప్పారు. ఈ లక్ష్యం సాధించే రోజులు చాల దగ్గరలోనే వున్నాయని కూడా ఆయన చెప్పారు.

ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు పౌర సరఫరా శాఖా మంత్రి శ్రీ ఏ. సంజీవరెడ్డి అధ్యక్షత వహించారు. అంతకు ముందు శాసనమండలి సభ్యులు శ్రీ పి. నరసింహారెడ్డి అతిథులకు స్వాగతమిచ్చారు. శాసనసభ్యులు శ్రీ డి. ఆంజనేయులు నాయుడు ఈ సభలో ప్రసంగించారు.

శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఫిల్మ్ లైబ్రరీ

జాతీయ గ్రంథాలయ దినోత్సవ సందర్భంలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ డా. డి. జగన్నాథరెడ్డి నవంబరు 14 న తిరుపతిలో ఫిల్మ్ లైబ్రరీకి ప్రారంభోత్సవం చేస్తూ, ఈ విశ్వ విద్యాలయం, దేశంలో ఫిల్మ్ లైబ్రరీ ఆరంభించిన వాటిలో మొట్టమొదటి దని చెప్పారు.

యూనివర్సిటీ కాలేజి ప్రిన్సిపాల్ డా. కె. నీలకంఠం ఈ సభకు అధ్యక్షత వహించారు.

జర్నలిస్టుకు సన్మానం

రాష్ట్ర మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి ఆధ్వర్యాన తెలుగు రచయిత, జర్నలిస్టు అయిన శ్రీ కె. సభకు నవంబరు 14 న చిత్తూరులోని జీవకారుణ్య సమాజ భవనంలో ఏర్పాటైన ప్రత్యేక సభలో ఘన సన్మానం జరిగింది.

రచయితగా రైతులకు, పీడిత ప్రజలకు శ్రీ సభా చేసిన సేవలను మంత్రి ప్రశంసిస్తూ ఆంధ్రప్రభ, వాహిని, ప్రజా రాజ్యం, జమీన్ రైతు మున్నగు పత్రికల్లో ఆయన వ్రాసిన రచనలకు ఒక ప్రత్యేకత వుంది. రచయితలు, కవులు, జర్నలిస్టులు దేశ శ్రేయస్సుకై పాటుపడాలి అని మంత్రి ఉద్బోధించారు.

పంచాయతీ ఘర్‌కు ప్రారంభోత్సవం

రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి, చిత్తూరు జిల్లా పుత్తలపేట గ్రామంలో ఇటీవల పంచాయతీ ఘర్‌కు ప్రారంభోత్సవం చేశారు. శాసన మండలి సభ్యులు శ్రీ పి. నరసింహారెడ్డి ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు అధ్యక్షత వహించారు.

విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం

విద్యుచ్ఛక్తి శాఖామంత్రి శ్రీ వి. కృష్ణమూర్తి నాయుడు చిత్తూరు తాలూకాలోని కమ్మతిమ్మాయపల్లి, కుప్పగానిపల్లి గ్రామాలకు యిటీవల 16 వ తేదీన విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ వి. రామస్వామిరెడ్డి అధ్యక్షత వహించారు.

బావులక్రింద సేద్యం తప్ప ఇతర నీటి పారుదల సౌకర్యాలు లేని గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాచేసే విషయంలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని మంత్రి చెప్పారు.

కరీంనగరంలో అత్యధిక వరిపంట

కరీంనగరం జిల్లా మల్లియాల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ శ్రీ కర్బుజ పెద్దన్న ఖరీఫు పంటకు జయ వరి వంగడాలను వేసి ఎకరానికి 40 క్వింటాళ్ల వరి పండించారు.

ఆయన 1970 జూలై 8 న వరి వేసి ఆగస్టు 8 న నారు నాటారు. నవంబరు 12 న పంట కోశారు. పంచాయతీ సమితి అధికారుల సమక్షంలో పంట కోతలు జరిగాయి. జయ వరి వంగడాలు వేసి శ్రీ కర్బుజ పెద్దన్న అత్యధిక పంట పండించి జిల్లాలో రికార్డు స్థాపించారు.

శిశు సంక్షేమ కేంద్రానికి శంఖుసాపన

తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు సతీమణి శ్రీమతి లక్ష్మీ మాలకొండయ్య బాలల దినోత్సవ సందర్భంలో అడతీగల గ్రామంలో శిశు సంక్షేమ కేంద్ర భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణానికి రూ. 20,000 లు ఖర్చు అవుతుంది.

ఆమె అడతీగల, తుంగమడుగుల గ్రామాలకు చెందిన గిరిజన వాసులకు కంబళ్లు, దుస్తులు పంచిపెట్టారు.

భూసార పరిరక్షణకు రూ. 3.90 లక్షలు

మదనపల్లి సబ్-డివిజనులో భూసార పరిరక్షణకై వరద కట్టలు వేయడం మున్నగు పనులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పనుల కార్యక్రమంక్రింద రూ. 3.90 లక్షలు మంజూరుచేసింది.

విద్యార్థులకు మంత్రి ఉద్బోధ

సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి శ్రీ ఎ. వాసుదేవరావు నవంబరు 22 వ కోదాడులోని కె. ఆర్. ఆర్. కాలేజీ దినోత్సవ సందర్భంలో విద్యార్థులను వుద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు కష్టపడి శ్రమచేసి, ఉత్తమ పౌరులుగా రూపొందాలని ఉద్బోధించారు. ఇక్కడ గత సంవత్సరం కాలేజిని ప్రారంభించడం వల్ల విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి సౌకర్యాలు కల్పించబడినాయి. "ఈ కాలేజీకి అన్ని సౌకర్యాలు ఉండాలంటే ప్రజలు ఉదారంగా విరాళాలు ఇవ్వాలి. ఈ కాలేజీని రెసిడెన్షియల్ కాలేజీగా మార్చడానికి కాలేజి కమిటీ వారు ఆలోచిస్తున్నారు. పిల్లల నడవడిక, శ్రేయస్సు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధవహించాలి" అని మంత్రి చెప్పారు. గత సంవత్సరంలో ఈ కాలేజీ ఫలితాలు చాల ప్రోత్సాహకరంగా వున్నందుకు మంత్రి కాలేజీ ప్రిన్సిపాలును ఉపాధ్యాయులను అభినందించారు. కాలేజి ప్రిన్సిపాలు శ్రీ ఎ. మురళీధర్ మంత్రికి స్వాగతం చెప్పారు.

ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ

గుంటూరు జిల్లా కలక్టరు శ్రీ ఎం. వెంకటరత్నం యిటీవల నరసారావుపేటలో హరిజనులకు 500 యిండ్ల స్థలాల పట్టాలను పంపిణీచేశారు. శాసనసభ సభ్యులు శ్రీ వి. గోపాలకృష్ణయ్య యీ ఉత్సవానికి అధ్యక్షత వహించారు.

సమితి అధ్యక్షుడు శ్రీ డి. కృష్ణారెడ్డి అతిధులకు స్వాగతం చెప్పుతూ కేటాయించిన స్థలాలలో యిండ్లు నిర్మించుకోడానికి హరిజనులకు ఆర్థిక సహాయం అందజేయాలని కలక్టరుకు విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయ భవనానికి నిధులకై అభ్యర్థన

ఆదిలాబాదు జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ జి. నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు.

కలెక్టరు శ్రీ జియా ఉద్దీన్ ఈ సందర్భంలో ప్రసంగిస్తూ వ్యక్తి అభివృద్ధికి గ్రంథ పఠన చాలా తోడ్పడగలదనీ, గ్రంథాలయాలలో వివిధరకాల పుస్తకాలు వుండాలనీ చెప్పారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి జిల్లా సంక్షేమ నిధి నుంచి కొంతడబ్బు మంజూరు చేయగలనని ఆయన వాగ్దానం చేశారు. ఈ భవనానికి ఉదారంగా విరాళాలు ఇవ్వవలసిందని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒక గ్రంథాలయం నుంచి మరొక గ్రంథాలయానికి పుస్తకాలు అరువు మీద మారుతూ వుండడం సముచితంగా వుంటుందని ఆయన సూచించారు.

ప్రజాపాఠశాల భవనానికి ప్రారంభోత్సవం


వరంగల్లు జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ బి. జనార్ధనరెడ్డి పచ్చినపల్లి గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా ఇచ్చిన విరాళాలతో నిర్మించబడిన 4 గదుల పాఠశాల భవనానికి యిటీవల ప్రారంభోత్సవం జరిపారు.

జిల్లా పరిషత్తు హైస్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు నిధి వసూలు చేయడానికి ప్రదర్శనలు ఏర్పాటుచేసి రూ 8,000 లు పోగుచేశారు. యువకులు స్వయంగా భవన నిర్మాణానికి కృషిచేసి, భవనాన్ని అతిస్వల్పకాలంలో నిర్మించారు.

తోలుబొమ్మల ఆటకు ప్రశంసలు

కృష్ణా జిల్లాలోని గ్రామాలలోను, విజయవాడలోను నవంబరు 5 వ తేదీ నుండి 26 వ తేదీ వరకు సమాచార, పౌరసంబంధ యాత్రిక శాఖ గాంధీజీ జీవిత సందేశంపై నిర్మించిన తోలుబొమ్మలాట 25 ప్రదర్శనలను నిర్వహించింది. 1.25 000 లకు పైగా ప్రజలు యీ ప్రదర్శనలను తిలకించి ఎంతో ప్రశంసించారు. ఈ ప్రదర్శనను చూచిన ప్రముఖులలో కేంద్ర నీటిపారుదల, విద్యుచ్ఛక్తి శాఖామంత్రి డా. కె. ఎల్. రావు, శాసనసభ్యుడు డా. టి. వి. ఎస్. చలపతిరావు, ఆంధ్రపత్రిక సంపాదకులు శ్రీ పి. నాగేశ్వరరావు, అయ్యంకి వెంకట రమణయ్య ప్రభృతులు కూడ ఉన్నారు.


నాగార్జునసాగరు కాలువపైన సైఫన్-కాజ్‌వే నిర్మాణానికి శంకుస్థాపన



గుంటూరు జిల్లాలోని పర్చూరువాగు మీద సైఫన్_కాజ్వేకు నవంబరు 19న మధ్యరకం నీటిపారుదల శాఖా మంత్రి శ్రీ ఆర్. నారపరెడ్డి శంకుస్థాపన చేశారు.

మధ్యతరహా నీటిపారుదల శాఖామంత్రి శ్రీ ఆర్. నారప రెడ్డి ఇటీవల గుంటూరు జిల్లాలోని పర్చూరులో ప్రసంగిస్తూ వచ్చే 5ఏండ్లలోపల రూ. 70కోట్ల ఖర్చుతో కృష్ణా,గోదావరి డెల్టా ప్రాంతాలలో డ్రైనేజి నిర్మాణంపనులు పూర్తిచేయబడుతాయని చెప్పారు.

నాగార్జునసాగర్ కుడి కాలువపైన పర్చూరు_చీరాల రోడ్డు పైన నత్తలపాడువద్ద సైఫన్_కాజ్వే నిర్మాణానికి శంకుస్థాపన చేస్తూ ఆయన ఈ విషయం వెల్లడిచేశారు.



ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలోని మినిమించిలిపాడులో శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ స్మారక గ్రంథాలయానికి సాంఘిక సంక్షేమశాఖమంత్రి శ్రీ డి. పెరుమాళ్ళు శంకుస్థాపన చేశారు.

బంజరు భూముల పంపిణీ విషయంలో దేశంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానం వహించింది. అంతేకాకుండా బీద ప్రజలకు ఇండ్ల స్థలాలు కేటాయించడం, ఇండ్ల కాలనీలు నిర్మించడం విషయంలో కూడ మనరాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే ముందంజ వేస్తున్నదని ఆయన చెప్పారు.

గ్రంథాలయాల ప్రాముఖ్యత సమాచార శాఖ మంత్రి అభిభాషణ

హుజూరు నగరంలో నవంబరు 18న జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సభలో సమాచార పౌరసంబంధ శాఖా మంత్రి ప్రసంగిస్తూ, ప్రజలకు విజ్ఞానం కల్గించడానికి వ్యక్తిత్వం పరిపూర్ణంగా పరిణతి చెందడానికి గ్రంథాలయాలు ప్రముఖపాత్ర వహిస్తాయని చెప్పారు. ప్రజలు జ్ఞాన సముపార్జనకు కృషిచేయాలని మంత్రి ఉద్బోధించారు. దైనందిన కార్యకలాపాలలో జాతీయ భాషను ఉపయోగించవలసిన అవసరాన్ని గురించి వక్కాణించారు. గ్రంథాలయాలు అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అత్యవసరమైన సహాయం చేస్తున్నదని చెప్పారు.

బోర్డింగు గ్రాంట్లు హెచ్చింపు

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి శ్రీ డి. పెరుమాళ్ళు ఇటీవల గుంటూరులో ప్రసంగిస్తూ బీదప్రజలకు ఇండ్ల స్థలాలు సేకరించేందుకు ప్రభుత్వం ఈ సంవత్సరం ఒకకోటి రూపాయలు మంజూరు చేసిందని చెప్పారు.

గుంటూరు జిల్లా హరిజన గిరిజన మహాసభలో ప్రసంగిస్తూ మంత్రి ఈ విషయం వెల్లడిచేశారు. ఈ సభకు జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ యం. నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.

వచ్చే 3 నెలలలోపల పంచాయతీ సమితులు భూమి సేకరణ ప్రతిపాదనలను పూర్తి చేయనట్లయితే, జిల్లా పరిషత్తులు స్వయంగా ఈ ప్రతిపాదనలను పూర్తి చెయగలవని మంత్రి చెప్పారు. ప్రభుత్వం భూములు లేని బీదప్రజలకు ఇంతవరకు మొత్తం 22 లక్షల ఎకరాల భూమి పంచిపెట్టిందనీ దేశంలో ఏ రాష్ట్రంలోకూడ ఇంత భారీ యెత్తున భూములు పంచిపెట్టడం జరగలేదనీ ఆయన అన్నారు.

వీధి దీపాలకు ప్రారంభోత్సవం

నల్గొండ జిల్లా రామన్నపేట పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ జి. అనంతరెడ్డి ఇటీవల సిర్పూరు గ్రామంలో వీధిదీపాలకు ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు సర్పంచ్ శ్రీ పున్న యెల్లయ్య అధ్యక్షత వహించారు.


చెరకు ఉత్పత్తి పోటీలు

1969_70 పంటకాలంలో చెరకు ఉత్పత్తి పోటీలో తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం తాలూకాకు చెందిన శ్రీ ఆర్. అప్పారావు రాష్ట్రస్థాయి బహుమతి విజేతగా వ్యవసాయశాఖ డైరెక్టరు ప్రకటించారు. ఏక్సాలీస్పైరులో హెక్టారుకు 266.46 ఎం. టన్నుల ఉత్పత్తిని ఆయన సాధించారు.

ఇందుకు రు. 1000 ల బహుమతి ఆయనకు లభించింది.

గొల్లపల్లి గ్రామానికి విద్యుచ్ఛక్తి

మెదకు జిల్లా కలెక్టరు శ్రీ ఎన్. చక్రవర్తి ఇటీవల పటంచెర్వు సమితిలోని గొల్లపల్లిగ్రామంలో విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేశారు. సమితి అధ్యక్షుడు శ్రీ పి. రామచంద్రారెడ్డి యీ ఉత్సవానికి అధ్యక్షత వహించారు.



ఒంగోలుజిల్లా కలెక్టరు శ్రీ పి.కె. దొరైస్వామి నవంబరు23న పర్చూరు సమితిలోని ఉప్పుటూరు గ్రామంలో హరిజన కాలనీకి శంఖుస్థాపనచేశారు.

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు జిల్లా కలక్టరు శ్రీ ఎం. ఎస్ వీరరాఘవన్ యిటీవల బుచ్చిరెడ్డిపాలెం పంచాయతీ సమితిలోని ఇందుపూర్ గ్రామంలో పీటూరి వెంకటరెడ్డి ఎలిమెంటరీ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఎం. గోపాలకృష్ణారెడ్డి యీ ఉత్సవానికి అధ్యక్షత వహించారు.

రూ. 10,000 ల విలువ చేసే స్థలం, రూ 5,000 ల రొక్కం విరాళంగా అందజేసిన శ్రీ వెంకారెడ్డి పేర యీ పాఠశాల వ్యవహరించ బడుతున్నది. నెల్లూరుకు చెందిన శ్రీ బి. పుల్లయ్య చెట్టి జొన్నవాడలో ఎలిమెంటరీ పాఠశాల భవన నిర్మాణం నిమిత్తం రూ. 5,000 లను విరాళంగా అందజేశారు. కలక్టరు సమావేశంలో ప్రసంగిస్తూ విరాళాలు అందజేసిన యిద్దరినీ అభినందించారు.

ఆ తర్వాత పురిణి, ఇందుపూర్, ఉత్తరమోపూర్ గ్రామాలకు చెందిన 112 మంది హరిజనులకు గృహ నిర్మాణం గ్రాంటుగా రూ. 11,200 లను కలక్టరు పంపిణీ చేశారు. జాతీయ పొదుపు పథకం క్రింద రూ. 1,000 మదుపు చేసిన శ్రీ వెంకటరెడ్డికి ఆయన ప్యాస్‌బుక్కు సమర్పించారు.

గ్రంథాలయభవనానికి రు. 22,000 లు మంజూరీ

ఆంధ్రప్రదేశ్ సంక్షేమ నిధి మెదకు జిల్లా సంఘం, యిటీవల జిల్లా కలక్టరు, జిల్లా సంఘం అధ్యక్షుడు శ్రీ ఎన్. చక్రవర్తి అధ్యక్షత సమావేశం జరిపింది. సిద్దిపేటలో గ్రంథాలయం కొత్త భవనం నిర్మాణానికి రూ. 22,000. జోగిపేటలో ప్రస్తుతపు గ్రంథాలయం భవనం మరమ్మతులకు రు. 8,000 లు యీ సమావేశంలో మంజూరు చేశారు.



హైదరాబాదులోని తాండూరు పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ కె. లాల్‌రెడ్డి నవంబరు 22న తాండూరులో పశువుల విత్తుకొట్టు వారోత్సవాన్ని ప్రారంభించారు.



నల్గొండ జిల్లా రెడ్‌క్రాస్ సంఘం డిశంబరు 14న స్వర్ణోత్సవం జరుపుకుంది. ఆసందర్భంలో కార్యదర్శి శ్రీ వెంకటనారాయణ సంఘం నివేదికను చదివారు.

ముత్తాయంపేటలో హెచ్. ఆర్. 35 రికార్డు ఉత్పత్తి

కరీంనగర్ జిల్లా, మల్యాల పంచాయతీలోని ముత్తాయంపేట నివాసి, శాసన సభ్యులు శ్రీ లక్ష్మీనరసింహారావు, హెచ్. ఆర్. 35 అధిక దిగుబడి వరి వంగడాన్ని సేద్యం చేసి, ఎకరాకు 28 క్వింటాళ్ళ రికార్డు ఉత్పత్తిని సాధించారు.

బ్లాకు వ్యవసాయ విస్తరణాధికారి శ్రీ ఎం. జగన్నాధరావు యిటీవల యీ ఉత్పత్తిని రికార్డు చేశారు. ఈ ప్రాంతంలో యీ అధిక దిగుబడి వరి వంగడాన్ని ఉపయోగించి యింత ఎక్కువ ఉత్పత్తి సాధించడం యిదే ప్రథమమని ఆయన పేర్కొన్నారు.

హరిజన కుటుంబాలకు రొక్కం బహుమతులు

చిత్తూరు జిల్లా, చంద్రగిరిలోని సబ్ కలక్టరు శ్రీ సి. సత్యనారాయణరావు, యిటీవల చంద్రగిరి సమితిలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన 13 హరిజన కుటుంబాలకు వారికి కేటాయించిన స్థలాలలో యిండ్లు నిర్మించుకోడానికి ఒక్కొక్క కుటుంబానికి రు. 100 ల చొప్పున రు. 1,300 ల రొక్కాన్ని పంపిణీ చేశారు.

1970_71 సంవత్సరం షెడ్యూలు కులాల వారు యిండ్లు నిర్మించుకోడానికి చిత్తూరు జిల్లాలోని పంచాయతీ సమితులకు దిగువ పేర్కొన్న విధంగా సహాయపు గ్రాంట్లను మంజూరు చేశారు. చంద్రగిరి, రు. 1300, మదనపల్లి రు. 7,200, చౌదేపల్లి రు. 600, శ్రీకాళహస్తి రు. 5,600, చిత్తూరు రు. 400, పుడిచెర్ల: రు. 7,000, పుంగనూరు: రు. 600, పిచ్చటూరు: 7.900.

పశువైద్యశాల భవనానికి శంకుస్థాపన

కోవూరు పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ కె వెంకట్రామరెడ్డి లేగుంటపాడులో రు. 15,000 ల ఖర్చుతో నిర్మించబడుతున్న శ్రీ కె జయరామిరెడ్డి స్మారక సమితి పశు వైద్యశాల భవనానికి శంకుస్థాపన చేశారు ఆయన యీ సందర్భంగా ప్రసంగిస్తూ గ్రామ తగాదాలను విడనాడి ఆసుపత్రి అభివృద్ధికి మరింత సమైక్యతతో కృషి చేయాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

పాఠశాల బహుమతులకు రూ. 1,000 లు విరాళం

రాయదుర్గం పంచాయతీ సమితిలోని హిరేహాళ్ గ్రామ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు పంచుటకుగాను, శ్రీ హెచ్.జి. రాములుగారు, తమ తండ్రిగారి జ్ఞాపకార్థము రూ. 1000 లు నగదు విరాళ మిచ్చారు.

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి జయంతి

ఇటీవల గుడివాడలో శ్రీ ఓరుగంటి సుబ్బా రావుగారి భవనంలో భారత సమితి ఆధ్వర్యాన కవి సార్వభౌమ ఆస్థాన కవి శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి 105 వ జన్మదినోత్సవం జరిగింది. శ్రీ కరెడ్ల నరసింహంగారు సభకు అధ్యక్షత వహించారు. శ్రీ కొడాలి బసవయ్య చౌదరి గారు ప్రార్థన చేశారు.

శ్రీయుతులు కోగంటి దుర్గా మల్లికార్జున రావు, కోడూరి శ్రీరాములు, మల్లంపల్లి రామలింగేశ్వర శర్మ సుంకర శివరామయ్య, తుమ్మలపల్లి శివరావు, ఓరుగంటి సుబ్బారావు విన్నకోట రామడిండికేశ్వరుడు గార్లు శ్రీ కృష్ణమూర్తి శాస్త్రి గారి సారస్వత సేవను ప్రశంసించారు. శ్రీ దుర్గామల్లికార్జున రావు గారు వందన సమర్పణ చేశారు.

హరిజనుల సంక్షేమం—మంత్రి పెరుమాళ్ళు అభిభాషణ

ఇటీవల పోడూరి సమితిలోని ఆచంట గ్రామంలో జరిగిన బహిరంగ సభకు అధ్యక్షత వహిస్తూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి శ్రీ దాసరి పెరుమాళ్ళు "గాంధీజీ ఆశించిన రీతిని హరిజనుల స్థితి గతులను మెరుగు పరిచి వారికి సంఘంలో సరియైన స్థానాన్ని చూపటానికి ప్రభుత్వం ఎంతగానో కృషి జరుపుతోంది". అని అన్నారు.

సభను ప్రారంభిస్తూ జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ అల్లూరి బాపినీడు "గాంధీజీ వాంఛించిన శాంతి భద్రతలు చేకూర్చగల సుస్థిరమైన రామ రాజ్యాన్ని నెలకొల్పుకొనటానికి నేడు మనం అనుసరిస్తున్న ఈ పంచాయతీ రాజ్య విధానమే శరణ్యమని అందుకు అవసరమైన సమర్థులైన ప్రజా ప్రతినిధులను నాయకులను ఎన్నుకొనవలసినబాధ్యత నేటి ప్రజానీకంపై ఉన్నదని" అన్నారు.

శాసన సభ్యులు శ్రీ విజయ నరసింహ రాజు ప్రభృతులు పలువురు ప్రసంగించారు. శ్రీ గొడవర్తి రామారావు అతిథుల గౌరవార్థం విందు ఏర్పాటు చేశారు.

పెన్మరాజా పోలవరం గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ మంత్రి శ్రీ పెరుమాళ్ళు "హరిజనులకు నివేశన స్థలాలు మంజూరుచేసే సందర్భంలో ప్రస్తుతం పన్నెండు శాతం వెనుకబడిన కులాలవారికి కేటాయించడం జరుగుతోందని. దీన్ని 25% కి పెంచడానికి ప్రభుత్వం యోచిస్తోందని" వెల్లడించారు.

కొమ్ముచిక్కాలలో నూతనంగా నిర్మింపబడిన సమితి పాఠశాలా భవనానికి మంత్రి శ్రీ పెరుమాళ్ళు ప్రారంభోత్సవం జరిపారు. పోడూరు సమితిఅధ్యక్షులు శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు సభకు అధ్యక్షత వహించారు.

పోడూరు సమితిలోని 25 మంది రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులలో 5 రోజులపాటు శిక్షణ యిచ్చే కార్యక్రమాన్ని సమితి కార్యాలయంలో సమితి అధ్యక్షులు శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు అధ్యక్షతన ప్రారంభించారు.

దేవగ్రామంలో హౌసింగ్ కాలనీ

దేవ గ్రామంలో గాంధీనగర్ హౌసింగ్ కాలనీకి జిల్లా కలక్టరు శ్రీ కె. ఉమాపతి శంకుస్థాపన చేశారు. సభకు సమితి అధ్యక్షులు శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు. ఈ కాలనీలో 43 గృహాలు నిర్మింపబడతాయనీ ఒక్కొక్క గృహానికి ప్రభుత్వ నిధి నుండి రూ. 500/- లు, సమితి నిధి నుండి రూ. 250/- లు, పరిషత్ నిధి నుండి రూ. 250/- లు, సాంఘిక సంక్షేమ శాఖ వారి ద్వారా రూ. 100/- లు, పంచాయతీ నిధులనుండి రూ. 50/- లు ఆర్థిక సహాయం లభించగలదని బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరు తమ నివేదికలో పేర్కొన్నారు.

రాష్ట్రంలోని ఉత్తమ గ్రామానికి బహుమతి

1967—68 వ సంవత్సరానికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రామం ఎన్నిక పోటీలలో కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి పంచాయతీ సమితిలోని రాయకల్లు గ్రామాన్ని ఉత్తమ గ్రామంగా నిర్ణయించారని కరీంనగర్ జిల్లా పరిషత్తు కార్యదర్శి శ్రీ జి. పి. రావు అన్నారు.

డిసెంబరు 7 వ తేదీన జరిగే ప్రత్యేక ఉత్సవంలో రు. 500 ల రొక్కం బహుమతి యీ గ్రామానికి అందజేయబడుతుంది.

చిత్తూరు జిల్లాలో గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా

చిత్తూరు జిల్లా పరిషత్తు స్థాయీ సంఘ సమావేశంలో ఆ జిలా కలెక్టరు శ్రీ బి. వి. రామారావు ప్రసంగిస్తూ 1971 మార్చి 31 వ తేదీలోగా చిత్తూరు జిల్లాలో 70 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడం జరుగుతుందని వెల్లడిచేశారు. నిర్ణయించిన లక్ష్యాన్ని సాధించేందుకు చిత్తూరు, తిరుపతి, మదనపల్లి డివిజను లలో పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.

కెమెరా క్లబ్ భవనానికి ప్రారంభోత్సవం

మహిళా సంక్షేమం, యాత్రా విషయాల శాఖ మంత్రి శ్రీమతి రోడామిస్త్రీ డిసెంబరు 6 న మహబూబునగరులో కెమెరా క్లబ్ భవనానికి ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో ఆమె ప్రసంగిస్తూ యాత్రా విషయాలను తగు రీతిలో ప్రోత్స హించడానికి ఇటువంటి క్లబ్బులు వుండడం చాల అవసరమని చెప్పారు. ఈ భవన నిర్మాణానికి కృషిచేసిన రెవిన్యూ అధికారు లను ఆమె ప్రశంసించారు.

జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ కె. కె. రెడ్డి ప్రసంగిస్తూ ఫోటోగ్రాఫ్ చాలా ఖర్చుతో కూడిన పని అయినప్పటికీ, వినోద కలాపాలకు ఇటువంటి క్లబ్బులు చాల అవసరమని చెప్పారు.

రెవిన్యూ బోర్డు మెంబరు శ్రీ యన్. భగవాన్‌దాస్ ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 18 కెమెరా క్లబ్బులు వున్నా యనీ అయితే మహబూబునగరం క్లబ్బుకు మాత్రమే సొంత భవనం వుందనీ చెప్పారు.

అంతకుముందు జిల్లా కలెక్టరు శ్రీ అసదుల్లా సయీద్ అతిథులకు స్వాగతం చెబుతూ, ఫొటోగ్రాఫ్ కళలో శ్రీ భగవాన్ దాస్‌కు వున్న ప్రతిభా విశేషాలను కొనియాడారు.

క్లబ్బు ఉపాధ్యక్షులు, కలెక్టరు పి. ఎ. శ్రీ జె. బాపురెడ్డి, రెవెన్యూ బోర్డు జాయింటు సెక్రటరీ శ్రీ హసనుద్దీన్ అహమద్, మహబూబునగరం పంచాయతి సమితి అధ్యక్షులు శ్రీ రామకృష్ణా రెడ్డిగారలు కూడా ప్రసంగించారు.

దేవాదాయ మంత్రి పర్యటన

దేవాదాయ శాఖామంత్రి శ్రీ ఆర్. రామలింగరాజు, డిసెంబరు 11 న మచిలీపట్నం చేరుకుంటారు. డిసెంబరు 14 న ఉదయం రాజధానికి తిరిగివస్తారు.

పారిశ్రామిక వివాదం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా సంస్థ రాణీగంజ్ సికింద్రా బాదు డిపో మేనేజరుకూ అక్కడి ఉద్యోగి (మాజీ కండక్టరు) శ్రీ కె. ఎస్. నారాయణ్‌కూ మధ్య ఏర్పడిన పారిశ్రామిక వివా దాన్ని పరిష్కారం నిమిత్తం హైదరాబాదులో కార్మిక న్యాయా స్థానానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించింది.

హరిజనవాడలో సౌకర్యాలకు సమితి నిధుల మంజూరీ

ఆదిలాబాదు జిల్లా, ఖానాపూర్ పంచాయతీ సమితి స్థాయీ సంఘం, యిటీవల సమితి అధ్యక్షుని అధ్యక్షతన సమావేశమయ్యి ఖానాపూర్‌లోని హరిజన వాడలో మంచినీటి బావుల త్రవ్వకానికీ, రోడ్ల నిర్మాణానికీ, హరిజనులకు వ్యవసాయ పరికరాలు ఎద్దుల కొనుగోలుకూ రు. 24,600 లు మంజూరుచేసింది

అంతర్జాతీయ యాత్రా స్థలంగా విశాఖపట్నం అభివృద్ధి

విశాఖపట్నం నుంచి భీమిలి వరకు వేసిన 24 కి.మీ. బీచ్ రోడ్డు చాల అపూర్వమైనది. ఇది అంతర్జాతీయ యాత్రికులను విశేషంగా ఆకర్షించగలదు. అంతేకాకుండా ఈ రోడ్డువల్ల విశాఖపట్టణానికి సుమారు 20 గ్రామాల నుంచి తాజా చేపలు రవాణా చేయడం చాల సులభమవు తుంది. విశాఖపట్నం జిల్లా కలెక్టరు శ్రీ యన్. యన్. ఆచంట ఇటీవల బీచ్‌రోడ్డును తనఖీచేస్తూ ఈ విషయం చెప్పారు.

24 కి మీ. బీచ్‌రోడ్డు విశాఖపట్నం నుండి భీమిలి వరకు సముద్రతీరానికి సమాంతరంగా వెడుతుంది. తూర్పు తీరంలో ఉన్న బీచ్ రోడ్డులో ఇది చాల ఆకర్షణీయమైనది. దేశంలోని బీచ్‌రోడ్లలోకెల్లా ఇది పెద్దది. బహుశా విదేశాలలో కూడా ఇంతపెద్ద బీచ్‌రోడ్డు వుండదని చెప్ప వచ్చు. 1971 నాటికి దీని నిర్మాణం పూర్తి అవుతుందని ఆశింపబడుతున్నది.

బీచ్‌రోడ్డు పొడవునా అక్కడక్కడా యాత్రా కేంద్రాలుగా అభివృద్ధి పరచటానికి కొన్ని సుందరమైన ప్రాంతాలు వున్నాయి. ఈ స్థలాల్లో, ముఖ్యంగా భీమిలి బీచ్‌వద్ద యాత్రికులకు సౌకర్యాలు కల్పించవలసిందని జిల్లా కలెక్టరు ఇంజనీర్లకు సూచించారు.

బీచ్‌రోడ్డు పొడవునా వున్న గ్రామాలలోని బెస్త ప్రజలతో కలెక్టరు చర్చలు జరిపి వారి సమస్యలను తెలుసుకొన్నారు. ఆధునిక పద్ధతులలో చేపలు పట్టడం లాభదాయకంగా వుంటుందనీ, ఈ విషయంలో ప్రభుత్వం చేతనైనంత సహాయం చేయగలదనీ కలెక్టరు హామీ ఇచ్చారు. చేపల పట్టే ప్రాంతాల హద్దులను ఏర్పాటు చేయవలసిందని కూడ కలెక్టరు అధికారులకు చెప్పారు.



పుష్కలమైన పంటలకు ఫాక్టమ్‌ఫాస్

అన్ని రకముల భూములకు, పైర్లకు, అనుకూలమై తన ఆధిక్యతను నిరూపించుకున్న, అద్భుత సంకీర్ణ ఎరువు. దక్షిణ ప్రాంత రాష్ట్రముల రైతులు విరివిగా వాడు ఎరువు. భారత దేశంలో రసాయన ఎరువుల ఉత్పత్తికే పునాది వేసిన బ్రహ్మాండమైన ప్రప్రథమ ఫాక్ట్ ఎరువుల ఫాక్టరీ ప్రతిష్ఠను చాటే ఎరువు.

వరి పైరుకు శిఫారసు చేయబడ్డ ఎరువుల మోతాదులు. ఎకరాకు కిలోగ్రాములలో

	ఫాక్టమ్‌ఫాస్ 16 : 20	మ్యూరియేట్ ఆఫ్ పొటాష్	యూరియా
వరి :			
(ఎ) అధిక దిగుబడినిచ్చే రకాలు	180	50	58
(బి) దేశవాళీ రకాలు	135	26	12

FACT

ఫాక్ట్ కర్షక బంధు


ది ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కూర్ లిమిటెడ్, ఉద్యోగమండల్-కేరళ

ఆంధ్రప్రదేశ్ ఏరియా ఆఫీసు: షాపూర్‌వాడి, హైద్రాబాద్ - 4

ప్రాంతీయ కార్యాలయాలు:- నిజామాబాద్, వరంగల్, కర్నూలు, నెల్లూరు

aries EKM FT.152.TL

PRINTED BY THE DIRECTOR OF PRINTING, OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS AND TOURISM, ANDHRA PRADESH, HYDERABAD.



Reg. No. H. 133

